# బలగం TV
BALAGAM
నిజమే మా బలం..ప్రజలే మా బలగం
BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com
హైదరాబాద్ బుధవారం, 06 మే-2026 | balagamtv100@gmail.com | పేజీలు-8


## ఆగివున్న లారీని ఢీకొన్న కారు
### ఇద్దరు అక్కడికక్కడే మృతి




**సంగారెడ్డి,మే5 :** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ బైపాస్ రోడ్డుపై ప్రమాదం చోటుచేసుకుంది. ఆగి ఉన్న లారీని వెనక నుంచి కారు ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు మృతి చెందగా.. ముగ్గురికి గాయాల య్యాయి. మృతులను చేవెళ్ల వాసులుగా గుర్తించారు. బాధితులంతా తుల్జాపూర్ నుంచి హైదరాబాద్ వెళుతుండగా ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. క్షతగాత్రులను జహీరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

## ప్లాస్టిక్ గోదామ్‌లో అగ్నిప్రమాదం

**హైదరాబాద్,మే5 :** బాలాపూర్ పరిధిలోని కొత్తపేట గాలిబ్ కాలనీలో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ప్లాస్టిక్ గోదాంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో గమనించిన స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారమిచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చింది. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణాపాయం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

## ఏరోస్పేస్ దిగ్గజాలకు తెలంగాణ వ్యూహాత్మక భాగస్వామి



- డ్రోన్ టెక్నాలజీ, శాటిలైట్ కమ్యూనికేషన్స్ లోనూ గ్లోబల్ లీడర్
- ఎకోసిస్టమ్, ఇన్నోవేషన్, ఆర్అండ్ డీ, ఇండస్ట్రీ రెడీ వర్క్ ఫోర్స్ పైదృష్టి
- 'ఐటీపీ ఏరో - ఇండియా' ప్లాంట్ కు మంత్రి శ్రీధర్ బాబు భూమిపూజ

**హైదరాబాద్, మే 05 :**
అంతర్జాతీయ ఏరోస్పేస్ దిగ్గజాలకు తెలంగాణను ఒక వ్యూహాత్మక భాగస్వామిగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. రాష్ట్రాన్ని కేవలం విడిభాగాల తయారీకే పరిమితం చేయకుండా గ్లోబల్ ఏరోస్పేస్ ఆర్ అండ్ డీ హబ్‌గా మార్చేందుకు అవసరమైన 'కాంప్రహెన్సివ్ రోడ్డు మ్యాప్'ను సిద్ధం చేస్తున్నామన్నారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా శంషాబాద్ హార్డ్ వేర్ పార్క్‌లో రూ.453 కోట్ల పెట్టుబడితో 10 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేయనున్న 'ఐటీపీ ఏరో - ఇండియా' మిగతా 3లో..

## ప్రాణహిత-చేవెళ్లకు జాతీయ హోదా కల్పించాలి

- పోలవరంకు జాతీయ హోదా ఇచ్చి, తెలంగాణను విస్మరిస్తే ఎలా
- ఒక్క ప్రాజెక్టుకు కూడా జాతీయ హోదా ఇవ్వక పోవడం వివక్షే
- ధాన్యాన్ని కేంద్రం తీసుకోకుండా కొర్రీలు పెట్టడం సరికాదు
- నిధుల విడుదలలో జాప్యం రైతుల్ని మోసం చేయడమే
- పంట వ్యర్థాలను కాల్చకుండా బయో గ్యాస్ ప్లాంట్‌లకు సరఫరా
- ప్రధాని మోడీకి భట్టి విక్రమార్క విజ్ఞప్తి



**రాజన్నసిరిసిల్ల,మే5 :** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తెలంగాణ పర్యటనను పురస్కరించుకుని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో డిజైన్ చేసిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును తక్షణమే జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విజ్ఞప్తి చేశారు. సిరిసిల్లా జిల్లా గంబిరావుపేట గ్రామంలోని పంతులుగారి తోటలో బయోస్ట్రాట్రమ్ టెక్నాలజీస్ ప్రయివేట్ లిమిటెడ్ ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్ నిర్మాణానికి మంగళవారం డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, తుమ్మల నాగేశ్వర్ రావు, పొన్నం ప్రభాకర్ లతో కలిసి భూమి పూజ చేశారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు.రాష్ట్ర విభజన చట్టం ప్రకారం తెలంగాణలోని ఒక ప్రధాన సాగునీటి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పిస్తామని నాటి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చాల్సిన బాధ్యత ప్రస్తుత ప్రభుత్వంపై ఉందని ఆయన గుర్తు చేశారు. 2014లో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లోని పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా గుర్తించినప్పటికీ, తెలంగాణలో ఏ ఒక్క ప్రాజెక్టుకు కూడా ఆ హోదా కల్పించకపోవడం తెలంగాణ రాష్ట్రం పట్ల చూపుతున్న వివక్షతకు నిదర్శనమన్నారు. తెలంగాణలో రైతులు మిగతా 3లో..

## కాళేశ్వరంపై సిబిఐ విచారణ ఎందుకు చేయరు



- బిఆర్ఎస్‌తో బిజెపి కుమ్మక్కు రాజకీయాలకు నిదర్శనం
- కేంద్రమంత్రులు బండి, కిషన్ రెడ్డిలు సమాధానం చెప్పాలి
- టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ డిమాండ్

మిగతా 2లో..

## బెంగాల్లో నేను డిపోలేదు... రాజీనామా చేయను




- బిజెపి కుట్రలతో గెలిచింది..
- తొత్తుగా మారిన ఎన్నికల సంఘం
- ప్రధాన విలన్ ఎన్నికల కమిషనర్ ..

మమతా బెనర్జీ వ్యాఖ్యలు మిగతా 2లో..

## మైనర్ల ట్రాప్ కేసులో సంచలన విషయాలు

- ఇన్‌స్టా వేదికగా వల విసిరి లోబర్చుకున్న బ్రదర్స్
- ఖరీదైన కార్లలో తిప్పుతూ అత్యాచారాలు
- కేసులో ఆజాద్ తల్లి, మేనమామల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన కమిషనర్ సజ్జనార్

మిగతా 2లో..

# దేశాభివృద్ధికి కీలక నిర్ణయాలు

- రూ. 1,52,702 కోట్ల నిధుల మంజూరు
- చెరుకు రైతుల కోసం లక్ష కోట్లు కేటాయింపు
- మిషన్ ఫర్ కాటన్ ప్రొడక్టివిటీ కింద రూ. 5,659 కోట్లు
- సెమికండక్టర్ యూనిట్ల ఏర్పాటుకు ప్రోత్సాహకాలు
- ఉన్నత న్యాయస్థానంలో మరో నలుగురు జడ్జిల పెంపు
- కేబినేట్ కీలక నిర్ణయాలు



**న్యూఢిల్లీ,మే5 :** దేశాభివృద్ధిని పరుగులు పెట్టించే దిశగా కేంద్ర క్యాబినెట్ ఇవాళ సంచలన నిర్ణయాలు తీసుకుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన మంగళవారం జరిగిన సమావేశంలో పలు కీలక ప్రాజెక్టులు, సంక్షేమ పథకాలకు ఆమోదం తెలుపుతూ దాదాపు రూ. 1,52,702 కోట్ల నిధులను మంజూరు చేసింది. మౌలిక సదుపాయాలు, వ్యవసాయం, సెమీకండక్టర్ రంగాలకు ఈ నిధులను కేటాయించారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా కేంద్రం భారీ కేటాయింపులు చేసింది. చెరుకు రైతులకు తీపి కబురు అందించింది. 2026-27 సంవత్సరానికి గాను చెరుకు 'ఫెయిర్ అండ్ రెమ్యునరేటివ్ ప్రైస్' కోసం ఏకంగా రూ.1లక్ష కోట్లను కేటా యించింది. కాటన్ మిషన్.. పత్తి ఉత్పాదకతను పెంచేందుకు 'మిషన్ ఫర్ కాటన్ ప్రొడక్టివిటీ' కింద రూ. 5,659 కోట్లు మంజూరు చేసింది. టెక్నాలజీ రంగంలో స్వయం సమృద్ధి సాధించేందుకు సెమీకండక్టర్ యూనిట్ల ఏర్పాటుకు ప్రోత్సాహకాలు ప్రకటించింది. క్రిస్టల్ మ్యాట్రిక్స్ లిమిటెడ్.. సెమీకండక్టర్ యూనిట్ ఏర్పాటు కోసం ఈ సంస్థకు రూ. 3,068 కోట్లు కేటాయించారు. సుచి సెమికాన్ ప్రైవేట్ లిమిటెడ్.. మరో యూనిట్ కోసం రూ. 868 కోట్లు మంజూరు చేశారు. రైల్వే నెట్‌వర్క్‌ను బలోపేతం చేసేందుకు మూడు కీలక మార్గాల్లో 3వ, 4వ లైన్ల నిర్మాణానికి ఆమోదం తెలిపారు. నగద - మథుర రైల్వే లైన్ నిర్మాణానికి రూ. 16,403 కోట్లు, గుంతకల్ - వాడి లైన్ నిర్మాణానికి రూ. 4,758 కోట్లు కేటాయించారు. ఇది తెలుగు మిగతా 3లో..

## ఇచ్చిన హామీలకు .. పాలనకు పొంతన లేదు

- కాంగ్రెస్ సర్కార్‌ను సాగనంపడమే ఉత్తమం 3లో..
- గజ్వేల్ బిజెపి సభలో ఈటెల రాజేందర్ వ్యాఖ్య

## మక్కల కొనుగోళ్లలో కావాలనే జాప్యం




- రైతులను మోసం చేస్తున్న ప్రభుత్వం
- నేటిలోగా సమాధానం రాకపోతే ఆందోళన తీవ్రం
- ప్రభుత్వాన్ని హెచ్చరించిన కెటిఆర్

**జనగామ,మే5 :** రాష్ట్రంలో సుమారు 14 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న పండించారని, అయితే ఆ మేరకు కొనుగోలు ప్రణాళికలు రూపొందించలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ప్రభుత్వం కేవలం 10 లక్షల టన్నుల పంటను మాత్రమే కొనుగోలు చేయాలని భావిస్తోందని, మిగతా పంటను నిర్లక్ష్యం చేస్తున్నదని విమర్శించారు. పంటను కొనుగోలు చేయకుండా ఆలస్యం చేయడం వల్ల వర్షాల కారణంగా పంట దెబ్బతింటుందని, దీంతో రైతులు నష్టపోతున్నారని అన్నారు. కేటీఆర్ వరంగల్ జిల్లా పర్యటనలో భాగంగా జనగామ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులు ఆయనకు ఘన స్వాగతం పలికాయి. అనంతరం జనగామ మండలంలోని యశ్వంతపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కేటీఆర్ సందర్శించారు. అక్కడ రైతులతో నేరుగా మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలులో తీవ్ర జాప్యం జరుగుతోందని రైతులు కేటీఆర్ దృష్టికి తీసుకువచ్చారు. 15 నుంచి 20 రోజులుగా ధాన్యం కొనుగోలు జరగకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై వెంటనే మిగతా 3లో..

## హైదరాబాద్‌లో హైడ్రా భారీ కూల్చివేత

- ఆరుచోట్ల అక్రమ మైనింగ్ ప్లాంట్లపై చర్యలు




**హైదరాబాద్, మే 05 :**
హైదరాబాద్‌లో అక్రమ మైనింగ్, క్రషింగ్ యూనిట్లు, ప్లాంట్లపై హైడ్రా కఠిన చర్యలు చేపట్టింది. ఒక్క రోజులోనే 6 ప్రాంతాల్లో హైడ్రా ఆపరేషన్లు నిర్వహించి, అక్రమ యూనిట్లపై దాడులు చేసి కూల్చివేతలు చేపట్టింది. గండిపేట మండలం వట్టినాగులపల్లి, శేరి లింగంపల్లి మండలంలోని గౌలిదొడ్డి విలేజ్, శంషాబాద్ మండలం కొత్వాల్‌గూడలో హైడ్రా బృందాలు దాడులు నిర్వహించాయి. ఈ ఆపరేషన్లలో 6 క్రషింగ్ యూనిట్లను తొలగించగా, 12 ఆర్ఎంసి ప్లాంట్లను కూల్చివేశారు. పీసీబీ, మైనింగ్, రెవెన్యూ డిపార్ట్‌మెంట్ల ఫిర్యాదు మేరకు హైడ్రా ఈ చర్యలు చేపట్టింది. సంబంధిత శాఖల ఆధ్వర్యంలోనే కూల్చివేతలు

## ప్రముఖ నిర్మాత ఆర్‌బీ చౌదరి దుర్మరణం

- రాజస్థాన్‌లో రోడ్డు ప్రమాదంలో మృతి

**హైదరాబాద్,మే5 :** చిత్ర పరిశ్రమలో విషాదం నెలకొంది. ప్రముఖ నిర్మాత ఆర్‌బీ చౌదరి (76) దుర్మరణం చెందారు. రాజస్థాన్‌లోని ఉదయ్‌పుర్‌లో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయన ప్రాణాలు కోల్పోయారు. సూపర్ గుడ్ ఫిలిమ్స్ బ్యానర్‌పై తమిళ, తెలుగు, మలయాళంలో ఎన్నో విజయవంతమైన చిత్రాలను ఆయన నిర్మించారు. పలు సినిమాలను డిస్ట్రిబ్యూట్ చేశారు. 'రంగం' ఫేమ్ హీరో జీవా.. ఆర్‌బీ చౌదరి తనయుడే. మరో తనయుడు రమేశ్ 'విద్యార్థి' చిత్రంలో హీరోగా నటించారు. వీరితోపాటు మరో ఇద్దరు కుమారులున్నారు. రాజస్థానీ అయిన మిగతా 3లో..

## 9రాష్ట్రాల్లో ఆపరేషన్ ఆక్టోపస్



### సైబర్ క్రైమ్ పోలీసుల దాడులు
### 56 మంది నిందితుల అరెస్ట్

**హైదరాబాద్,మే5 :** హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు ఆపరేషన్ ఆక్టోపస్ 2.0తో పేరుతో భారీ ఎత్తున దాడులు నిర్వహించారు. తొమ్మిది రాష్ట్రాల్లో ఈ ఆపరేషన్లు నిర్వహించి.. 56 మంది నిందితులను అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో బ్యాంక్ సిబ్బందితోపాటు పట్టుబడ్డ నిందితులకు 101 కేసులతో సంబంధం ఉన్నట్లు పోలీసులు నిర్ధారించారు. అలాగే అరెస్ట్ అయిన వారిలో 32 మంది బ్యాంక్ మేనేజర్లు, కేవైసీ అప్రూవర్లు, రిలేషన్‌షిప్ మేనేజర్లతోపాటు ఫీల్డ్ ఆఫీసర్లు ఉన్నారు. అదే విధంగా15 మంది మ్యూల్ అకౌంట్ హోల్డర్లతో పాటు, 9 మంది అకౌంట్ ఆపరేటర్లను కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. వీరందరికీ 101 కేసులతో సంబంధం ఉందని పోలీసులు గుర్తించారు. ఈ నేపథ్యంలో బాధితులకు రూ. 69.99 లక్షలు రీఫండ్ చేశారు. ఈ 101 కేసుల్లో బాధితుల నుంచి రూ. 9.13 కోట్ల నగదును నిందితులు కొట్టేసినట్లు పోలీసులు గుర్తించారు. ఇక అరెస్టయిన వారిలో 17 మంది ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్‌కు సంబంధించిన వారని పోలీసులు వివరించారు. ట్రేడింగ్ ఫ్రాడ్‌లో 30 మంది, డిజిటల్ అరెస్ట్ కేసులో ఒకరిని అరెస్ట్ చేసినట్లు చెప్పారు. ఇలా అరెస్టయిన వారిలో తెలంగాణ నుండి అత్యధికంగా 17 మంది ఉన్నారని తెలిపారు. మహారాష్ట్ర నుంచి 14, ఢిల్లీ నుంచి 9, కర్ణాటక నుంచి నలుగురు, ఏపీ నుంచి ఇద్దరు అరెస్టయ్యారని మిగతా 3లో..

# బెంగాల్, అసోంలలో ఓట్ చోరీ

**బెంగాల్, అసోంలలో ఓట్ చోరీ**
**జనాదేశాన్ను చోరీచేసిన బిజెపి**
**మరోమారు రాహుల్ విమర్శలు**



**న్యూఢిల్లీ,మే5 :** బెంగాల్, అసోంలో ఓటు చోరీ జరగిందని విపక్షనేత రాహుల్ మరోమారు ఆరోపించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు దేశ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ఓటమి చెందడంతో కొందరు కాంగ్రెస్ నేతలు సంబరాలు చేసుకోవడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బెంగాల్, అస్సాం రాష్ట్రాల్లో జనాదేశాన్ని బీజేపీ చోరీచేసిందని ఆరోపించారు. ఇది కేవలం ఓ పార్టీ ఓటమి కాదని, దేశ ప్రజాస్వామ్య వ్యవస్థను కూనీ చేసే ప్రమాదకర పరిణామం అని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. సంకుచిత రాజకీయ ప్రయోజనా లను పక్కనపెట్టి.. దేశ ప్రజాస్వామ్య పరిరక్షణపై అన్ని పార్టీలు దృష్టి సారించాలని ఈ సందర్భంగా రాహుల్ పిలుపునిచ్చారు. 'ఇది ఒక పార్టీకి సంబంధించిన విషయం కాదు. దేశ అస్తిత్వానికి సంబంధించిన సమస్య' అని ఆయన పేర్కొన్నారు. విపక్ష పార్టీల మధ్య అనైక్యత పెరుగుతున్న నేపథ్యంలో.. అది బీజేపీకి వరంగా మారుతోందని ఆందోళన వ్యక్తంచేశారు. బెంగాల్, అస్సాం రాష్ట్రాల్లో చోటు చేసుకున్న పరిణామాలు దేశ ప్రజాస్వామ్య వినాశనానికి సంకేతాలుగా పరిగణించాల్సిన అవసరం ఉందని రాహుల్ హెచ్చరించారు. విపక్షాలు పరస్పర విభేదాలను తగ్గించి, ప్రజాస్వామ్య రక్షణ కోసం ఒకే వేదికపైకి రావాలని సూచించారు. దేశ భవిష్యత్తు దృ ష్ట్యా రాజకీయ పార్టీలన్నీ బాధ్యతతో వ్యవహరించాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన అభిప్రాయపడ్డారు.

# మైనర్ల ట్రాప్ కేసులో సంచలన విషయాలు

- ఇన్‌స్టా వేదికగా వల విసరి లోబర్చుకున్న బ్రదర్స్
- ఖరీదైన కార్లలో తిప్పుతూ అత్యాచారాలు
- కేసులో ఆజాద్ తల్లి, మేనమామల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన కమిషనర్ సజ్జన్నార్



**హైదరాబాద్,మే5 :** జూబ్లీహిల్స్ బాలికల ట్రాప్, చీటింగ్ కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ కేసులో ఇద్దరు అన్నదమ్ములు.. 19 మంది మైనర్లను ట్రాప్ చేసినట్లుగా పోలీసులు గుర్తించారు. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను మీడియాకు హైదరాబాద్ పోలీసు కమిషనర్ వీసీ సజ్జనార్ వెల్లడించారు. నిందితులను విచారించా మని.. ఈ విచారణలో పలు విషయాలు వెలుగులోకి వచ్చాయని తెలిపారు. జూబ్లీహిల్స్ పోలీసుస్టేషన్‌లో మూడుగంటల పాటు నిందితులను సీపీ ప్రశ్నించారు. అర్జున్ అలియాస్ చంద్రశేఖర్ ఆజాద్, ప్రవీణ్ లను అరెస్ట్ చేసి కస్టడీకి తీసుకున్నట్లు చెప్పారు. రిచ్ కిడ్స్‌ను అర్జున్, ఆయన సోదరుడు ప్రవీణ్ టార్గెట్ చేశారని సజ్జనార్ వెల్లడించారు. మైనర్లను ట్రాప్ చేసి ఖరీదైన కార్లలోనే లైంగిక చర్యలకు అర్జున్ పాల్పడ్డాడని తెలిపారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఎస్కార్ట్‌గా ఉంటూ మైనర్లకు వల విసిరారని చెప్పారు. అర్జున్‌ను ఇన్‌స్టాగ్రామ్‌లో 150 మంది అమ్మాయిలు ఫాలో అవుతున్నారన్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రస్తుతం అర్జున్ ప్రొఫైల్‌ను తాము లాక్ చేశామని తెలిపారు. ఇద్దరు నిందితులకు వారి తల్లి మీనాకుమారి కూడా సహకరించినట్లుగా గుర్తించామని అన్నారు. నిందితుల కుటుంబం గుంటూరుకు చెందినదిగా తమ దర్యాప్తులో తేలిందన్నారు. బాలికలు అట్రాక్ట్ అయ్యేలా ఇన్‌స్టాగ్రామ్‌లో అర్జున్ రీల్స్ చేశాడని అన్నారు. ఇక్కడి నుంచి బాలికలను ట్రాప్ చేసి రిచ్‌గా కారులో షికారు అంటూ హైదరాబాద్ రోడ్లపై అర్జున్ అన్నదమ్ములు తిప్పారని చెప్పారు. తమతో ఫిజికల్ రిలేషన్ పెట్టుకునేలా బాలికలపై ఒత్తిడి చేశారన్నారు. ఆ వీడియోలను కూడా నిందితులు రికార్డు చేశారని.. సమయం చూసి తాము ఓ బిజినెస్ మొదలు పెడతామని బాధితులను నమ్మించి డబ్బు అడిగేవారని తెలిపారు. అలా ఓ బాలిక ఇంట్లో తెలియకుండా రూ. 13 లక్షలను నిందితులకు ఇచ్చిందన్నారు. గత ఏడాది కూడా ఇలాగే మరో మైనర్‌ను అర్జున్ ట్రాప్ చేశారని తెలిపారు. ఈ కేసులో మూడు రోజుల పాటు జైల్లో ఉండి ఆయన బయటకు వచ్చారని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు. ఇకపోతే యువతులను బెదిరించి డబ్బులు కాజేసిన ఈ కేసులో మరో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు ఆజాద్ తల్లితోపాటు మేనమామను జూబ్లీహిల్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఖరీదైన కార్లలో తిరుగుతున్న ఫొటోలను ఇన్‌స్టాలో పోస్టు చేసిన ఆజాద్.. స్టార్టప్ కంపెనీ నిర్వహిస్తున్నట్లు ప్రచారం చేసుకున్నాడు. యువతులకు దగ్గరై.. ఫొటోలు బహిర్గతం చేస్తానని బెదిరింపులకు పాల్పడ్డాడు. ఓ మైనర్ బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో గత నెలలో ఆజాద్, అతడి సోదరుడిని పోలీసులు అరెస్టు చేశారు. కోర్టు అనుమతితో నాలుగు రోజులు కస్టడీకి తీసుకొని విచారించారు. మోసపోయిన వారిలో ఎక్కువ మంది మైనర్లు ఉన్నట్లు గుర్తించారు. యువతుల నుంచి కాజేసిన సొమ్మును తల్లి, మేనమామ ఖాతాల్లో జమచేసినట్లు విచారణలో తేలింది. దీంతో తాజాగా వారిద్దరినీ పోలీసులు అరెస్టు చేశారు.

# బిసిలను పట్టించుకోని కేంద్రం

- 9న ఆమరణ దీక్ష చేపడతానన్న విహెచ్



**హైదరాబాద్,మే5 :** బీసీ సమస్యలపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గాంధీ భవన్‌లో మాట్లాడిన ఆయన, ఈ నెల 9వ తేదీన ఆమరణ నిరాహార దీక్ష చేపడతానని ప్రకటించారు. 'బీసీ హక్కుల కోసం ప్రాణం పోయినా సరే పోరాడుతా' అని స్పష్టం చేసిన వీహెచ్.. బీజేపీ బీసీ ఎంపీలు ఈ అంశంపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. 'అంబేద్కర్‌ను మా దేవుడిగా భావిస్తాం. అలాంటి మహనీయుడిని కూడా అవమానించే విధంగా పరిస్థితులు ఉన్నాయి' అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తాజాగా జరుగుతున్న జనగణనలో బీసీల ప్రస్తావనే లేకపోవడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. 'బీసీలు ఓట్లు వేయడం లేదా? వారి సమస్యలు ఎందుకు పట్టించుకోవడం లేదు?' అని వీహెచ్ కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలకు లేఖలు రాసినా స్పందన రాలేదని వీహెచ్ ఆరోపించారు. ÷ఖసీ రిజర్వేషన్ల పెంపు కోసం ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా ఫలితం లేకపోయిందని తెలిపారు. ముఖ్యమంత్రి కూడా ధర్నాలు జరిగినప్పటికీ బీసీ సమస్యలపై కేంద్రం వైఖరిలో మార్పు రాలేదని వీహెచ్ వ్యాఖ్యానించారు.

# రైతులను గోసపెడుతున్న కాంగ్రెస్

- 6న రైతు సదస్సు విజయవంతం చేయాలన్న చల్లా

**వరంగల్,మే5 :** రైతులను కష్టాలపాలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి, సీఎం రేవంత్ రెడ్డికి రైతుల గోస తగులుతుందని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. రుణమాఫీ కాలేదని, రైతు భరోసాను ఎగ్గొట్టారని మండిపడ్డారు. రాష్ట్రంలో ఎక్కడా మక్కలు కొనడం లేదని, దీంతో రైతులు మండుటెండలో పడిగాపులు కాస్తున్నారని అన్నారు. ఈ నెల 6న హనుమకొండలో నిర్వహించనున్న రైతు సంగ్రామ సదస్సును విజయవంతం చేయాలని చల్లా ధర్మారెడ్డి రైతులకు పిలుపునిచ్చారు. మంగళవారం వరంగల్ జిల్లా ఆత్మకూరు మండలం గూడెప్పాడు మార్కెట్‌ను ఆ యన సందర్శించారు. ఈ సందర్భంగా రైతులను కలిసి వారి సమస్యలు, కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న మోసాలను అడిగి తెలుసుకున్నారు. 20 రోజులు గడిచిన కాంటాలు పెట్టడంలేదని, ఏది చేయాలన్న డబ్బులు అడుగుతున్నారని, కనీసం తాగడానికి నీళ్లు కూడా మార్కెట్‌లో లేవని, అధికార పార్టీ నాయకులు చెప్పిన వారికే కాంటాలు పెడుతున్నారని రైతులు మాజీ ఎమ్మెల్యేకి తెలుపుతూ కన్నీరు పెట్టుకున్నారు. దీంతో రైతులతో కలిసి గుడెప్పాడ్ క్రాస్ వద్ద మక్కలు కొనుగోలు చేయాలని ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ధర్మారెడ్డి మాట్లాడుతూ..మక్కలు కొనుగోలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. గన్నీ బ్యాగులు ఇవ్వకుండా, కాంటాలైన బస్తాలు తరలించకుండా కావాలనే రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యకం చేశారు. మక్కల కొనుగోలులో అధికారులు డబ్బులు వసూలు చేస్తున్నారని రైతులు బహిరంగంగానే ఆరోపిస్తున్నట్టు తెలిపారు. రాహుల్ గాంధీ వరంగల్‌లో రైతు డిక్లరేషన్ సభ నిర్వహించి ఈ నెల 6నాటికి నాలుగేండ్లు పూర్తవుతున్నా ఇచ్చిన 6 గ్యారెంటీలు, 420 హామీలను అమలు చేయలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో రైతులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# చురుకుగా రబీ ధాన్యం సేకరణ



**మిల్లుల వద్ద అన్‌లోడింగ్ పెంచాలి**
**ధాన్యం తరలించేందుకు లారీలు పెంచాలి**
**నల్లగొండలో ఆకస్మికి పర్యటన చేసిన స్టీఫెన్ రవీంద్ర**

**నల్లగొండ,మే5 :** రబీ ధాన్యం సేకరణలో భాగంగా మిల్లుల వద్ద అన్‌లోడింగ్ పెంచాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ఆదేశించారు. అన్‌లోడింగ్ తోపాటు, వెహికల్ రోటేషన్, కొనుగోలు కేంద్రాల నుండి ధాన్యం తరలించడం,లారీలు, హమాలీలను పెంచాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం ఆయన నల్గొండ జిల్లా, చిట్యాల మండలం, పెద్దకాపర్తి లో ప్రాథమిక వ్యవ సాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పెదకాపర్తి కేంద్రానికి ఇప్పటివరకు వచ్చిన దాన్యం వివరాలు, హమా లీలు, ట్రక్ షీట్లు, మిల్లుల ట్యాగింగ్ చేసిన వాహనాలు, టా ర్పాలిన్లు, తదితర వివరాలను జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, కేంద్రం నిర్వాహకుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. కాగా ఇప్పటివరకు ఈ కేంద్రానికి 25 వేల క్వింటాళ్ల దాన్యం వచ్చిందని, ఇందులో 7000 క్వింటాళ్లు కొనుగోలు చేయడం జరిగిందని, ట్యాబ్ ఎంట్రీ కూడా పూర్తి చేశామని, ఇంకా కొనుగోలు కేంద్రంలో 15 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉన్నట్లు అధికారులు వివరించారు. పెదకాపర్తి కేంద్రం పెద్ద సెంటర్ అయినందున అన్ని పెద్ద సెంటర్లలో 10 నుండి 20 వరకు ఎక్స్ట్రా లారీలు ఏర్పాటు చేశామని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ సివిల్ సప్లై కమిషనర్ కు వివరించారు. హమాలీల కొరత లేకుండా మిల్లర్లకు ముందే సమాచారం ఇవ్వడం జరిగిందని, ఒక్కొక్క కొనుగోలు కేంద్రంలో 30 వరకు హమాలీలు ఉన్నారని, అదేవిధంగా మిల్లుల్లో సైతం 30 నుండి 35 వరకు హమాలీలను ఉంచడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా పౌరసరఫరాల శాఖ కమిషన్ మాట్లాడుతూ ట్యాబ్ ఎంట్రీ నూటికి నూరు శాతం కావాలని, కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని శుభ్రపరిచేందుకు డ్రయ్యర్లు, శుభ్రపరిచే విధానాలను అడిగి తెలుసుకున్నారు. గన్ని బ్యాగుల వివరాలను, టార్పాలిన్లను అడిగారు. అవసరమైతే ఎక్స్ట్రా టార్పాలిన్లు కొనుగోలు కేంద్రాలలో పెట్టాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు. అనంతరం కమిషనర్ వట్టిమర్తిలో ఉన్న సిద్దార్థ రైస్ ఇండస్ట్రీస్ ను సందర్శించి అక్కడ ఎంత మంది హమాలీలు ఉన్నారని అడగగా 35 మంది ఉన్నారని తెలిపారు. ఆన్ లోడింగ్, వెహికల్ రోటేషన్ పెంచాలని చెప్పారు.అంతేకాక సిస్టం ద్వారా ధాన్యం వివరాల అనోడింగ్ ,ట్యాబ్ ఎంట్రీ వివరాలను ఆయన పరిశీలించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిరోజు ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేస్తున్నామని చెప్పారు. ట్యాబ్ ఎంట్రీ పెండింగ్ ఉన్న కొనుగోలు కేంద్రాలపై ఎక్కువ దృష్టి కేంద్రీకరించాలని, మిల్లులలో స్థలం లేకుంటే ఇంటర్మీడియట్ గోడౌన్లకు తరలించాలని, ధాన్యం తరలింపు తో పాటు, మరిన్ని వాహనాలు ఏర్పాటు చేయాలని ట్రాన్స్పోర్ట్ శాఖ డిప్యూటీ కమిషనర్ వాణిని సివిల్ సప్లైస్ కమిషనర్ ఆదేశించారు. పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ రోహిత్ సింగ్, జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, పౌరసరఫరాల శాఖ జీఎం నాగేశ్వర రావు, ట్రాన్స్పోర్ట్ డిప్యూటీ కమిషనర్ వాణి, పౌరసరఫరాల శాఖ వెంకటేశం జి ఎం. రాంపతి నాయక్, డిసీఓ పత్యా నాయక్, మార్కెటింగ్ శాఖ ఎడి ఛాయాదేవి, చిట్యాల తహసిల్దార్ విజయ్, తదితరులు ఉన్నారు.

# బిఆర్ఎస్, బిజెపి కుమ్మక్కు రాజకీయాలు

**కాళేశ్వరంపై సిబిఐ విచారణ**
**ఎందుకు తొక్కి పెట్టారు**
**వరంగల్ రైతుమేళా కార్యక్రమంలో**
**మంత్రి పొంగులేటి**



**హనుమకొండ,మే5 :** బిఆర్ఎస్, బిజెపిలవి కుమ్మక్కు రాజకీయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మండిపడ్డారు. బిఆర్ఎస్‌తో కుమ్మక్కు కాకపోతే కాళేశ్వరంపై సిబిఐ విచారణకు ఎందుకు ఆదేశించడం లేదన్నారు. మోడీకి దమ్ముంటే తెలంగాణకు వచ్చే లోగా సిబిఐ విచారణకు ఆదేశించాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రైతుల పక్షపాత ప్రభుత్వం నడుస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. రూ.లక్ష రుణమాఫీ చేసేందుకు గత ప్రభుత్వానికి పదేళ్లు పట్టిందని విమర్శించారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టినా రైతులకు రూ.21వేల కోట్లు చెల్లించామని చెప్పారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మెగా రైతు మేళా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలోవరి వేస్తే ఉరి అన్నారని, కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వరివేసిన రైతులకు మద్దతు ధర కల్పిస్తూ.. సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇస్తున్నామన్నారు. 'రైతులకు ఎకరా నికి రూ.12వేల ఆర్థిక సాయంతోపాటు వ్యవసాయ పరికరాలు ఇస్తున్నాం. కేంద్ర ప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంట్‌కు రూ.1200 కోట్లు చెల్లిస్తున్నాం. రైతును రాజు చేసే వరకు విశ్రమించబోము' అని పొంగులేటి అన్నారు.

# హైదరాబాద్‌లో చిన్నారి కిడ్నాప్ కలకలం

**తల్లి ఒడిలో ఉండగా అర్ధరాత్రి ఎత్తుకెళ్లిన దుండగులు**

**హైదరాబాద్,మే5 :** హైదరాబాద్‌లో చిన్నారి కిడ్నాప్ కలకలం సృష్టించింది. కుత్బుల్లాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో రహదారి పక్కన అర్ధరాత్రి తల్లి ఒడిలో నిద్రిస్తున్న ఆరు నెలల చిన్నారిని దుండగులు ఎత్తుకెళ్లారు. వివరాల్లోకి వెళ్తే.. మల్లారెడ్డి ఆస్పత్రి ఎదురుగా రోడ్డు పక్కన ఉన్న మార్బుల్ షాపు వద్ద ఆదివారం అర్ధరాత్రి నవనీత అనే మహిళ తన నలుగురు పిల్లలతో నిద్రిస్తున్నది. తల్లి నిద్రలో ఉన్న సమయంలో ఒడిలో నిద్రిస్తున్న ఆరు నెలల చిన్నారి ఆశను ఎవరో దుండగులు ఎత్తుకెళ్లారు. కాసేపటికి మెలకువ వచ్చిన నవనీత చుట్టుపక్కల వెతకగా పాప కనిపించకపోవడంతో ఆందోళనకు గురైంది.వెంటనే కుత్బుల్లాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తల్లి నవనీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితుల కోసం సమీపంలోని సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలిస్తున్నారు.

# పెరిగిన పత్తి ధరలు

**క్వింటాకు రూ.800 పైగా ధర జంప్**



**కర్నూలు,మే5 :** కర్నూలు జిల్లా ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తి ధరలు భారీగా పెరిగాయి. పదిహేను రోజుల్లో పత్తిధర క్వింటాకు రూ.800 పైగా ధర పెరిగింది. ఇప్పటికే పత్తి సీజన్ ముగియడంతో అరకొర పత్తి రైతులు విక్రయానికి తీసుకొస్తుండడంతో వ్యాపారుల మధ్య పోటీ నెలకొనడంతో ధరలు పెరగడానికి కారణమైందని వ్యాపారులు చెబుతున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లోనూ దూది ధరలు పెరి గాయని, దీంతో స్థానిక మార్కెట్ యార్డులో ధరలు పెరగడానికి మరో కారణమని తెలిపారు. ధరలు పెరగడంతో పత్తి రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. 758 క్వింటాల పత్తి విక్రయానికి రాగా.. గరిష్ఠ ధర రూ.9615, మధ్యస్థం రూ.9,300 కనిష్ఠం రూ.5,525 పలికింది.

# బెంగాల్లో నేను ఓడిపోలేదు... రాజీనామా చేయను

**బిజెపి కుట్రలతో గెలిచింది..**
**తొత్తుగా మారిన ఎన్నికల సంఘం**
**ప్రధాన విలన్ ఎన్నికల కమిషనర్ ..**
**మమతా బెనర్జీ వ్యాఖ్యలు**



**కోల్‌కతా,మే5 :** పశ్చిమబెంగాల్ ఎన్నికల్లో బీజేపీ కుట్రలతోనే గెలిచిందని టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ అన్నారు. బీజేపీకి ఈసీ ఏజెంట్‌గా మారిందని ఆక్షేపణ తెలిపారు. ఈ ఎన్నికలో ప్రధాన విలన్ ఎన్నికల సంఘమేనని విమర్శలు గుప్పించారు. 100పైగా సీట్లు లూటీ చేశారని, తాను ఎన్నికల్లో ఓడిపోలేదని చెప్పారు. అందువల్ల తాను రాజీనామా చేసే ప్రసక్తి కూడా లేదన్నారు. లోక్‌భవన్‌కు వెళ్లనని, రాజీనామా చేయమని తనను ఎవరూ ఒత్తిడి చేయలేరని స్పష్టం చేశారు. పశ్చిమబెంగాల్ ఎన్నికల ఫలితాల అనంతరం తొలిసారి మీడియా సమావేశంలో మంగళవారంనాడు మమతాబెనర్జీ మాట్లాడుతూ..ఇసి, బిజెపిలపై ఘాటు విమర్శలు చేశారు. బిజెపి కనుసన్నల్లో ఇసి పనిచేసిందన్నారు. అమిత్ షా, ప్రధాని మోడీలు కలసి కటు÷-రలు చేశారని మండిపట్టారు. 'ఈ ఎన్నికల్లో విలన్‌గా ప్రధాన ఎన్నికల కమిషనర్ వ్యవహరించారు. బెంగాల్‌లో ఈవీఎంలను లూటీ చేశారు' అని మమత ఆరోపించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు పోలింగ్ ముగిసిన తర్వాత కూడా 80 నుంచి 90 శాతం కంటే ఎక్కువ బ్యాటరీని కలిగి ఉండటం ఏమిటని ప్రశ్నించారు. పోలింగ్‌కు రెండ్రోజుల ముందే అధికారులు తమ పార్టీపై దాడులు, కార్యకర్తల అరెస్టులు చేశారని అన్నారు. భవనీపూర్‌లో ఉద్దేశపూర్వకంగానే ఒక ప్లాన్ ప్రకారం తనను ఓడించారని, ఎన్నికల కమిషన్‌ను దుర్వినియోగపరిచి బీజేపీ విజయం సాధించిందని, తన జీవితంలో ఎప్పుడూ ఇలాంటి ఎన్నికలు చూడలేదని అన్నారు. కౌంటింగ్ సెంటర్లలో టీఎంసీ కార్యకర్తలను కొట్టారని, తనను 'సీఆర్‌పీఎఫ్ గూండాలు' పొత్తికడుపులో తన్ని కౌంటింగ్ సెంటర్ నుంచి గెంటేశారని తీవ్రారోపణలు చేశారు. ఎస్‌ఐఆర్ నుంచి 90 లక్షల ఓట్లను తొలగించారనీ, కోర్టుకు వెళ్లడంతో 32 లక్షల ఓట్లు చేర్చారని, టీఎంసీని ఓడించేందుకు అన్నిరకాలుగా ఎత్తుగడలు పన్ని 100 సీట్ల వరకూ బీజేపీ లూటీ చేసిందని విమర్శించారు.ఈ మొత్తం ఉదంతంలో 'ఇండి' కూటమి తన వైపే ఉందని తెలిపారు. ఎన్నికల ఫలితాల అనంతరం సోనియాగాంధీ, రాహుల్ గాంధీ తనతో మాట్లాడారని, అఖిలేష్ యాదవ్, తేజస్వి యాదవ్, హేమంత్ సోరెన్ తదితరులు ఫోను చేసి సపోర్ట్‌గా నిలిచారని చెప్పారు. 'ఇండి' కూటమిలోనే తాను కొనసాగుతానని కూడా స్పష్టం చేశారు.

# ఇచ్చిన హామీలకు ..పాలనకు పొంతన లేదు

- కాంగ్రెస్ సర్కార్‌ను సాగనంపడమే ఉత్తమం
- గజ్వేల్ బిజెపి సభలో ఈటెల రాజేందర్ వ్యాఖ్య



**సిద్దిపేట,మే5 :** తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు రేవంత్ రెడ్డి చెప్పిన మాటలకు ప్రస్తుతం ముఖ్యమంత్రిగా ఆయన చేస్తున్న పనులకు ఎక్కడా పొంతన లేదని ప్రజలు చెప్పుకొనే పరిస్థితి వచ్చిందని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీని ఎన్ని శాపనార్థాలు పెట్టినా వెస్ట్ అని.. మళ్ళీ ఎన్నికలు వచ్చినప్పుడు ఓడిస్తే తప్ప మనకు మనః శాంతి లేదని ప్రజలు అనుకుంటున్నారని చెప్పారు. మంగళవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో బీజేపీ నేతల సమావేశంలో ఎంపీ ఈటెల రాజేందర్ మాట్లాడుతూ.. రిటైర్ ఉద్యోగులకు, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద నగదు చెల్లించక పోవడంతో కోర్టు జోక్యం చేసుకుని తీవ్ర వ్యాఖ్యలు చేసే పరిస్థితి వచ్చిందంటే.. ప్రభుత్వాన్ని ఎట్లా నడుపుతున్నారో వాళ్లకే తెలియాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చిన్న పనులు చేసుకునే కాంట్రాక్టర్లకు బిల్లులు అందక గతంలోనే కాదు.. నేడు కూడా వారు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వచ్చిందని ఎంపీ ఈటల ఆవేదన వ్యక్తం చేశారు. రెండేళ్లకే కాంగ్రెస్ పార్టీ ప్రజల చేత ఛీ కొట్టించుకునే పరిస్థితులు వచ్చాయని పేర్కొన్నారు. తెలంగాణరాష్ట్రం బాగుపడాలంటే ఏకైక మార్గం బీజేపీ అధికారంలోకి రావడం ఒక్కటే మార్గమని ఎంపీ ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. ఇటీవల జరి గిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారన్నారు. పశ్చిమ బెంగాల్‌లో అరాచకం, దుర్మార్గాలు జరిగినా.. ఇది నా జాగీరు అని అహంకారంగా పాలించిన టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీని ప్రజలు ఓడించారని ఎంపీ ఈటల తెలి పారు. తమిళనాడులో స్టాలిన్ మీద ఒక సామాన్యుడు గెలిచాడంటే డీఎంకే ప్రభుత్వంపై ప్రజలకు ఎంత వ్యతిరేకత ఉందో స్పష్టమైందన్నారు. తమిళనాడు ఎన్నికల ఫలితాలు దేశ రాజకీయ పార్టీలకు కనువిప్పు కావాలని తాను కోరుకుంటున్నానని ఆయన తెలిపారు. కుటుంబ రాజకీయాలు నడిపే వారు.. ఈ రాష్ట్రానికి తామే ఓనర్లమనే పద్ధతిలో అన్ని వాళ్లే చేసుకునే వారికి, లక్షల కోట్ల రూపాయలు స్కాంలు చేసి డబ్బులు సంపాదించి.. వాటితో ఎన్నికల్లో గెలవాలని కుట్ర చేసే వారికి తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు అత్యుత్తమ ఉదాహరణ అని ఎంపీ ఈటల రాజేందర్ చెప్పారు. తమిళనాడు ఎన్నికల ఫలితాలు.. చిన్న విషయం కాదన్నారు. దీనిపై లోతుగా ఆలోచించాల్సిన విషయమని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రజలు ఎంత అప్రమత్తంగా, ఎంత షార్ప్‌గా ఉన్నారో ఈ ఫలితాలను బట్టి మనకు అర్థమవుతుందని ఎంపీ ఈటల రాజేందర్ చెప్పారు.

# ప్రధాని పర్యటనలో భారీ భద్రత

**కట్టుదిట్టమైన భద్రతా చర్యలు**
**అధికారులతో సమీక్షలో సిఎస్ ఆదేశం**



**హైదరాబాద్,మే5 :** ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ మే 10వ తెలంగాణలో పర్యటించనున్న నేప థ్యంలో భద్రతా పరంగా కట్టుదిట్టైన చర్యలు తీసుకో వాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణా రావు ఆదేశించారు. అలాగే తగిన భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. ఎక్కడా పొరపాట్లు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ప్రధాని పర్యటన ఏర్పాట్లపై మంగళ వారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివా లయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామ కృష్ణా రావు సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రధాన మంత్రి పర్యటనకు సంబంధించి జరుగుతున్న ఏర్పాట్ల వివరాలను ఆయన సమీక్షించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. పర్యటనలో ప్రధాన మంత్రి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నారు. దీంతో పాటు అదే రోజు బహిరంగసభలో పాల్గొననున్నారు. అందుకు అనుగుణంగా బ్లూ బుక్ ప్రకారం తగిన భద్రతా ఏర్పాట్లు, శాంతిభద్రతలు, ట్రాఫిక్, బందోబస్త్ ఏర్పాట్లు చేయాలని పోలీసుశాఖకు ప్రధాన కార్యదర్శి సూచించారు. బేగంపేట్ విమానాశ్రయం, హెలిప్యాడ్‌లతో పాటు అన్ని వేదికల వద్ద తగినన్ని అగ్నిమాపక వాహనాలు ఏర్పాటు చేయాలని ఫైర్ సర్వీసెస్ శాఖ అధికారులను, అవసరమైన వైద్య సదుపాయాలు కూడా ఏర్పాటు చేయాలని, ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. ప్రధానమంత్రి కాన్వాయ్ పర్యటించే మార్గాలలో రోడ్లను పరిశీలించాలని ఏ వైన మరమ్మత్తులు ఉంటే యుద్ధప్రాతిపధికన పూర్తి చేయాలని పోలీసు, ఉఊఓఅ, రోడ్లూ భవణాల శాఖల అధికారులను ఆదేశించారు. ప్రధాని పర్యటించే అన్ని ప్రాంతాల్లో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ శాఖను ఆదేశించారు.అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని, ప్రధాన మంత్రి పర్యటన విజయవంతంగా జరిగేలా చూడాలని సూచించారు. సమావేశంలో డీజీపీ సీవీ ఆనంద్, స్పెషల్ సిఎస్ వికాస్‌రాజ్ , నవీన్ మిట్టల్, దానకిషోర్, వాణిప్రసాద్, హోంశాఖ ముఖ్య కార్యదర్శి శిఖా గోయ ల్, ఇంటిలిజెన్స్ అడిషనల్ డిజి అనిల్ కుమార్, హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి పోలీస్ కమిషనర్లు విసి సజ్జనార్, రమేష్ , సుమతి,ర్ సర్వీసెస్ డీజీ, విక్రమ్ సింగ్ మన్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ ముకుంద రెడ్డి, హైదరాబాద్ వాటర్ వర్క్స్ ఎండి అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

(మొదటిపేజీ తరువాయి)

## ప్రాణహిత-చేవెళ్లకు జాతీయ హోదా కల్పించాలి

పండించే ప్రతి పంటను కేంద్రం నిర్ణయించిన కనీస మద్దతు ధర ప్రకారమే రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. అయితే, రాష్ట్ర ప్రభుత్వం సేకరించిన ధాన్యాన్ని కేంద్రం తీసుకోకుండా కొర్రీలు పెట్టడం, నిధుల విడుదలలో జాప్యం చేయడం రైతుల్ని మోసం చేయడమేనని ఆయన విమర్శించారు. కేవలం కొన్ని పంటలకే మద్దతు ధర ప్రకటించి మిగిలిన వాటి విషయంలో కేంద్రం తప్పించుకునే ప్రయత్నం చేయవద్దని, రాష్ట్రం సేకరించిన ప్రతి గింజను కేంద్రమే సేకరించి సకాలంలో నిధులు విడుదల చేయాలని కోరారు. గత కాంగ్రెస్ ప్రభుత్వాలు రైతు సంక్షేమం కోసం బహుళార్థక సాధక ప్రాజెక్టులను నిర్మించి, వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి రైతులకు అనేక రకాల ప్రోత్సహకాలు అందించి రైతులకు అండగా నిలబడిందన్నారు. వ్యవసాయ రంగంలో సరికొత్త విప్లవానికి నాంది పలుకుతూ వరి గడ్డిని ముడిసరుకుగా ఉపయోగించి బయో గ్యాస్ ఉత్పత్తి చేసే బృహత్తర ఆలోచనను కాంగ్రెస్ ప్రభుత్వం కార్యరూపంలోకి తెస్తోందన్నారు. సాధారణంగా పంట కోతల అనంతరం రైతులు పొలాల్లోనే గడ్డిని కాల్చివేయడం వల్ల వాతావరణం కలుషితమై ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ పడిపోతున్న తరుణంలో, ప్రభుత్వం ఈ వినూత్న కార్యక్రమాన్ని ప్రోత్సహిస్తోందన్నారు. దీనివల్ల పర్యావరణానికి రక్షణ కలగడమే కాకుండా, రైతులకు వ్యర్థాల ద్వారా అదనపు ఆదాయం లభించే అవకాశం ఉందని వివరించారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా క్లీన్ ఎనర్జీ, గ్రీన్ ఎనర్జీపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతున్న నేపథ్యంలో, అభివృద్ధి చెందిన దేశాల బాటలో మన రైతాంగం కూడా అడుగులు వేయాలని ప్రభుత్వం ఆకాంక్షిస్తోందన్నారు. సమాజానికి ఆహారాన్ని అందించే రైతు, ఆరోగ్యకరమైన గాలిని కూడా అందించాలనే ఉద్దేశంతో పంట వ్యర్థాలను కాల్చకుండా బయో గ్యాస్ ఎ÷-లాంట్‌లకు సరఫరా చేయాలని కోరారు. మరోవైపు, వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చేందుకు పంట మార్పిడి విధానాన్ని రైతులు పాటించాలని కోరారు. కేవలం వరి మీదనే ఆధారపడకుండా ఉద్యానవన పంటలు, చిరుధాన్యాలు, ఆయిల్ పామ్ వంటి లాభదాయకమైన పంటల వైపు రైతులు దృష్టి సారించిన ప్పుడే ఆర్థిక స్థితిగతులు మెరుగుపడతాయని తెలిపారు. వీటి సాగు వల్ల రైతులకు ఆదాయం పెరగడమే కాకుండా సమాజానికి పోషక విలువలతో కూడిన ఆహారం అందించిన వారవుతారని చెప్పారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం, పండించిన ప్రతి గింజకూ కనీస మద్దతు ధర (ఓ÷ూఖ) కల్పించేందుకు కృతనిశ్చయంతో ఉందని. మద్దతు ధర ప్రకటించడమే కాకుండా, క్షేత్రస్థాయిలో కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన వ్యవస్థను ఏర్పుట చేసిందన్నారు. పాత పద్ధతులకు స్వస్తి పలికి, ఆధునిక సాగు పద్ధతులను అవలంబించడం ద్వారానే వ్యవసాయం పండుగలా మారుతుందని, ఈ మార్పులో రైతులందరూ భాగస్వాములు కావాలని కోరారు.

## ఏరోస్పేస్ దిగ్గజాలకు వ్యూహాత్మక భాగస్వామి

మ్యానుఫ్యాక్చరింగ్ ప్లాంట్ కు ఆయన భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.... ఆనతికాలంలో ప్రపంచంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ఏరోస్పేస్, డిఫెన్స్ హబ్‌లలో ఒకటిగా తెలంగాణను నిలిపామన్నారు. వరుసగా అయిదేళ్లు కేంద్రం నుంచి 'బెస్ట్ స్టేట్ ఫర్ ఏరోస్పేస్' అవార్డును అందుకోవడం రాష్ట్రంలోని పటిష్ఠమైన ఎకో సిస్టమ్‌కు నిదర్శనమన్నారు. బోయింగ్, జీఈ ఏవియేషన్, సాఫ్రాన్, లాక్హీడ్ మార్టిన్, టాటా వంటి గ్లోబల్ ఏరోస్పేస్ దిగ్గజాలు ఇప్పటికే మన దగ్గర కార్యకలాపాలు నిర్వహిస్తున్నా యన్నారు. తాజాగా... ఈ జాబితాలో స్పెయిన్ దిగ్గజ సంస్థ 'ఐటీపీ ఏరో' కూడా చేరడంతో 'మేడ్ ఇన్ తెలంగాణ' బ్రాండ్ మరింత విశ్వవ్యాప్తమవుతుందన్నారు. సంప్రదాయ తయారీ రంగంతో పాటు డ్రోన్ టెక్నాలజీ, శాటిలైట్ కమ్యూనికేషన్స్ లాంటి నెక్స్ట్ జనరేషన్ టెక్నాలజీస్ లోనూ రాష్ట్రాన్ని గ్లోబల్ లీడర్‌గా నిలిపేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. అందుకు అవసరమైన... మౌలిక సదుపాయాల కల్పన, ఎకోసిస్టమ్ అభివృద్ధి, ఇన్నోవేషన్, ఆర్ అండ్ డీ, ఇండస్ట్రీ రెడీ వర్క్ ఫోర్స్ తయారీ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. విమాన ఇంజిన్ల తయారీలో వినియోగించే అత్యంత కీలకమైన విడిభాగాలు ఈ 'ఐటీపీ ఏరో ? ఇండియా' నూతన మ్యానుఫ్యాక్చరింగ్ ప్లాంట్ లో ఉత్పత్తి అవుతాయన్నారు. వచ్చే ఏడాది నాటికి ఇక్కడ కార్యకలాపాలు పూర్తిస్థాయిలో ప్రారంభమవుతాయన్నారు. ప్రిసిషన్ ఇంజనీరింగ్, అడ్వాన్స్డ్ మ్యానుఫ్యాక్చరింగ్, క్వాలిటీ కంట్రోల్ తదితర విభాగాల్లో ప్రాథమికంగా 350 మంది నిపుణులకు ఉపాధి లభిస్తుందని, రాబోయే రోజుల్లో ఈ సంఖ్య 600కు పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఐటీపీ గ్రూప్ సీఈవో ఈవా అజూలే, ఎండీ కార్లోస్ అల్జోలా, వైస్ ప్రెసిడెంట్(ఆపరేషన్స్) వాలెంటిస్ గొరోనో, ఐటీపీ ఇండియా ఎండీ సందీప్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

## దేశాభివృద్ధికి కీలక నిర్ణయాలు

రాష్ట్రాల ప్రయాణికులకు ఎంతో మేలు చేకూరుస్తుంది. బుర్హ్వాల్ - సీతాపూర్ రైల్వే లైన్‌కు రూ. 2,276 కోట్లు కేటాయించారు. వీటితోపాటు మరికొన్ని ఇతర కీలక నిర్ణయాలను కేంద్ర క్యాబినెట్ తీసుకుంది. ఎమర్జెన్సీ క్రెడిట్ లైన్ గ్యారంటీ స్కీమ్ కోసం రూ. 18,100 కోట్లు కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారు. షిప్పింగ్ రంగం.. వడినర్‌లో ఓడల మరమ్మత్తుల సౌకర్యాల అభివృద్ధికి రూ. 1,570 కోట్లు కేటాయించారు. సుప్రీంకోర్టు బలోపేతం.. అత్యున్నత న్యాయస్థానం పనితీరును మరింత మెరుగుపరచడానికి, మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి ఒక కీలక విధాన నిర్ణయాన్ని క్యాబినెట్ ఆమోదించింది. దీంతోపాటు, సుప్రీంకోర్టులో మరో నలుగురు న్యాయమూర్తులను పెంచడానికి కూడా కేంద్రం ఆమోదం తెలిపింది. దీంతో దేశ అత్యున్నత న్యాయస్థానంలో జడ్జిల సంఖ్య 33 నుంచి 37కు చేరుతుంది. ఈ భారీ కేటాయింపులు దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమే కాకుండా, భారీగా ఉద్యోగ అవకాశాలను కల్పిస్తాయని కేంద్రం ఆశాభావం వ్యక్తం చేసింది.

## 9రాష్ట్రాల్లో ఆపరేషన్ ఆక్టోపస్

పేర్కొన్నారు. నిందితుల నుంచి 34 మొబైల్ ఫోన్లు, 8 చెక్ బుక్కులతోపాటు 11 షెల్ కంపెనీ స్టాంపులు, ట్యాబ్ సీజ్ చేశామని వివరించారు. సైబర్ పెట్రోలింగ్ ద్వారా అక్రమ బెట్టింగ్, నకిలీ పెట్టుబడులను ప్రోత్సహిస్తున్న 184 సోషల్ మీడియా ప్ల్గా÷ళ్లు తొలగించినట్లు పోలీసులు చెప్పారు. సి-మిత్ర ద్వారా1250 కాల్స్ చేసి బాధితులకు అవగాహన కల్పించడంతో పాటు 194 జీరో ఎఫ్ఐఆర్లు నమోదు చేసినట్లు తెలిపారు. గేమింగ్ ఫ్రాడ్ కేసులో బాధితురాలిని మోసం చేసి రూ. 74.99 లక్షలు మోసం చేసిన కేసులో కోల్‌కతాకు చెందిన ఇండస్ఇండ్ బ్యాంక్ కీ అకౌంట్ మేనేజర్ మొహమ్మద్ రియాజుద్దీన్, అసిస్టెంట్ మేనేజర్ మనీష్ ప్రసాద్ విశ్వకర్మను అరెస్ట్ చేసినట్లు సైబర్ క్రైమ్ పోలీసులు వెల్లడించారు.


## హైదరాబాద్‌లో హైడ్రా భారీ కూల్చివేత

జరిగాయి. అక్రమ మైనింగ్, క్రషింగ్, ఆర్ఎమ్‌సీ ఎ÷-లాంట్లతో వందల కోట్ల రూపాయల ప్రభుత్వ ఆదాయానికి అక్రమ యూనిట్లు గండికొడుతున్న పరిస్థితి. బడాబాబుల అండతో మైనింగ్, క్రషింగ్, ఆర్ఎంసి ప్లాంట్లు నడుస్తున్నట్లు సమాచారం. బడాబాబుల పైరవీలతో నడుస్తున్న యూనిట్లపై ఆయా శాఖల ఫిర్యాదులతో హైడ్రా కఠిన చర్యలు తీసుకుంటోంది.

## మక్కల కొనుగోళ్లలో కావాలనే జాప్యం

స్పందించిన కేటీఆర్, మార్క్‌ఫెడ్ ఎండీ శ్రీనివాస్ రెడ్డితో ఫోన్‌లో మాట్లాడి, మొక్కజొన్న కొనుగోళ్లను వేగవంతం చేయాలని కోరారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. అలాగే మార్క్‌ఫెడ్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రూ.22,000 కోట్ల అప్పులు తీసుకువచ్చిందని కేటీఆర్ ఆరోపించారు. సివిల్ సప్లై కార్పొరేషన్‌లో జరిగిన అక్రమాల కారణంగా అక్కడి నుంచి నిధులు రాకపోవడంతో, మార్క్‌ఫెడ్ నిధులను వాడుకుంటున్నారని చెప్పారు. తాను చెప్పిన లెక్కలు తప్పైతే ప్రభుత్వం రుజువు చేయాలని సవాల్ విసిరారు. రైతులను ఇలాగే ఇబ్బందులకు గురి చేస్తే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని కేటీఆర్ హెచ్చరించారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని, రేపటి వరకు గడువు ఇస్తున్నామని తెలిపారు. లేకపోతే రైతుల తరఫున పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని స్పష్టం చేశారు.

## ప్రముఖ నిర్మాత ఆర్‌బీ చౌదరి దుర్మరణం



ఆర్‌బీ చౌదరి 1950లో మద్రాసులో జన్మించారు. పూర్తి పేరు రతన్‌లాల్ భగత్‌రామ్ చౌదరి. సినిమాల్లోకి రాకముందు స్టీల్, జ్యువెల్లరీ తదితర వ్యాపారాలు నిర్వహించారు. ఆయన నిర్మించిన తొలి సినిమా 'ఆదిపాపమ్' (మలయాళం). 1988లో విడుదలైంది. 1990లో 'పుదు వసంతం'తో కోలీవుడ్‌లోకి అడుగుపెట్టారు. 'నవ వసంతం' పేరుతో తెలుగులో రీమేక్ చేశారు. 'సుస్వాగతం'తో ఘన విజయాన్ని అందుకున్నారు. అది మొదలు 'సూర్యవంశం', 'రాజా', 'శీను', 'నువ్వు వస్తావని', 'నిన్నే ప్రేమిస్తా', 'ప్రియమైన నీకు', 'శివరామరాజు', 'గోరింటాకు', 'సంక్రాంతి'.. ఇలా కుటుంబమంతా కలిసి చూడదగ్గ చిత్రాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచారు. 'శుభాకాంక్షలు'లాంటి హిట్ సినిమాలకు సమర్పకుడిగానూ వ్యవహరించారు. టాలీవుడ్‌లో రీమేక్ సినిమాలతోనే ఆర్‌బీ చౌదరి ఎక్కువగా విజయాలు అందుకున్నారు. దీనికి గల కారణాన్ని ఓ సందర్భంలో తెలిపారు. తనకు తమిళం బాగా వచ్చు కాబట్టి తొలుత కోలీవుడ్‌లో నిర్మిస్తానని, వాటిలో తెలుగు ప్రేక్షకులను మెప్పించే అంశాలుంటే తప్పక రీమేక్ చేస్తుంటానని చెప్పారు. సూపర్‌గుడ్ ప్రొడక్షన్స్, సూపర్‌గుడ్ కంబైన్స్, మెగా సూపర్ గుడ్‌ఫిల్మ్స్.. బ్యానర్ల పేర్లు మారినా ఆయన సినిమాల్లోని వినోదం మాత్రం తగ్గలేదు. ఆయన నిర్మాణంలో గతేడాది 99వ సినిమా 'మకుటం' మొదలైంది. ఇందులో విశాల్ హీరో.

# హైదరాబాద్‌లో బీఏఎస్ఎఫ్ గ్లోబల్ సర్వీస్ హబ్

### తెలంగాణ ప్రభుత్వంతో కీలక ఒప్పందం
### సుమారు 3,000 మందికి కొత్త ఉద్యోగ అవకాశాలు
### ఐటీ మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి



**హైదరాబాద్,మే5 :** హైదరాబాద్‌లో జర్మనీకి చెందిన అంతర్జాతీయ దిగ్గజం బీఏఎస్ఎఫ్ గ్లోబల్ సర్వీస్ హబ్‌ను ఏర్పాటు చేయనుంది. ఈమేరకు తెలంగాణ ప్రభుత్వానికి కీలక ఒప్పందం కుదిరింది. ఈ ప్రాజెక్ట్ ద్వారా సుమారు 3,000 మందికి కొత్త ఉద్యోగ అవకాశాలు లభించను న్నాయి. ఐటీ మంత్రి శ్రీధర్ బాబుకు సంస్థ ప్రతినిధులు లెటర్ ఆఫ్ ఇంటెంట్ అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ గ్లోబల్ బిజినెస్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్‌ను స్థాపించనున్నట్లు ప్రకటించారు. ఈ హబ్ ఫైనాన్స్, హ్యూమన్ రిసోర్సెస్ సేవలకు వ్యూహాత్మక కేంద్రంగా పని చేయనుంది. గ్లోబల్ సర్వీస్ డెలివరీ నెట్‌వర్క్‌కు హైదరాబాద్ కీలక కేంద్రంగా మారనుంది. 160 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ అంతర్జాతీయ సంస్థ ప్రపంచవ్యాప్తంగా 200 దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. హైదరాబాద్‌లో భారీ పెట్టుబడి ద్వారా తన సేవలను మరింత విస్తరించనుంది. తెలంగాణలో మరో మెగా గ్లోబల్ కంపెనీ పెట్టుబడి పెట్టేందుకు ముందుకు రావడంపై ప్రభుత్వం సంతోషం వ్యక్తం చేసింది. హైదరాబాద్‌పై అంతర్జాతీయ కంపెనీల నమ్మకం మరింత పెరుగుతోందని ఐటీ మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. మంగళవారం నాడు ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, జర్మన్ కాన్సుల్ జనరల్ మైఖేల్ హాస్పర్ ల సమక్షంలో బిఎఎస్ ఎఫ్ గ్లోబల్ బిజినెస్ సర్వీసెస్ అధ్యక్షుడు టోబియాస్ డ్రాట్ తెలంగాణ లైఫ్‌సైన్సెస్ సీఈఓ సర్వేశ్ సింగ్ కు లెటర్ ఆఫ్ ఇంటెంట్ అందజేసారు. సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ ఈ ఏడాది 100 జిసిసిల ఏర్పాటును లక్ష్యంగా పెట్టు కున్నట్టు వెల్లడించారు. వీటి ద్వారా లక్ష మంది ఐటి నిపుణులకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని తెలిపారు. హైదరాబాద్ కేవలం కార్యాలయాల కేంద్రంగా మాత్రమే కాకుండా, ఆవిష్కరణలు, ఇంజినీరింగ్ రంగాల్లో ప్రపంచ స్థాయి నగరంగా అభివృద్ధి చేస్తున్నట్టు శ్రీధర్ బాబు తెలిపారు. ఇందులో భాగంగా కృత్రిమ మేధస్సు ఆధారిత కేంద్రం ఐకామ్, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, 200 ఎకరాల్లో ఏఐ సిటీ, క్వాంటమ్ హబ్, జీవ విజ్ఞాన పరిశోధన్ సంస్థ '1 బయోల్యాబ్' లను ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. 160 సంవత్సరాల చరిత్ర కలిగిన బిఎఎస్ ఎఫ్ ప్రపంచవ్యాప్తంగా 200కి పైగా దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. 234 కర్మాగారాలు, 1,08,000 మంది ఉద్యోగులతో పనిచేస్తున్న ఈ సంస్థ వార్షిక ఆదాయం దాదాపు 5 లక్షల కోట్ల రూపాయలు (60 బిలియన్ డాలర్లు). ప్రపంచంలోని పలు నగరాలతో పోటీ పడి హైదరాబాద్ ఈ ప్రతిష్ఠాత్మక అవకాశాన్ని దక్కించుకోవడం రాష్ట్రానికి దక్కిన గౌరవం. న్విడియా, మైక్రోసాఫ్ట్, గూగుల్, వాన్‌గార్డ్, ఎలీ లిల్లీ, మారియట్ ఇంటర్నేషనల్ లాంటి దిగ్గజ సంస్థలు ఇక్కడ జిసిసిలు ఏర్పాటు చేసి హైదరాబాద్ నగరానికి ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెట్టాయని శ్రీధర్ బాబు తెలిపారు.

## ఆకివీడు రామాలయ నిర్మాణం కేసు

### పిటిషన్‌ను కొట్టి వేసిన ఎపి హైకోర్టు



**అమరావతి,మే5 :** పశ్చిమగోదావరి జిల్లాలోని ఆకివీడులో రామాలయం నిర్మాణం అనుమతులను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను ఏపీ హైకోర్టు కొట్టివేసింది. రెవెన్యూ రికార్డులను పరిశీలిస్తే గత 80 సంవత్సరాలుగా అక్కడ రామాలయం ఉన్నట్లు స్పష్టంగా అర్థమవుతోందని హైకోర్టు వ్యాఖ్యానించింది. అన్ని ఆధారాలు, రికార్డులు పరిశీలిం చిన తరువాత జిల్లా కలెక్టర్, నగర పంచాయితీ కమిషనర్ రామా లయం నిర్మాణానికి అనుమతులు ఇచ్చారని పేర్కొంది. ఈ నేపథ్యంలో పిటిషన్‌ను కొట్టివేస్తున్నామని హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. గతంలో రామాలయం నిర్మాణాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో పిల్ దాఖలైన విషయం తెలిసి ందే. ఈ పిల్‌పై హైకోర్టు చీఫ్ జస్టిస్ ధర్మాసనం విచారణ జరిపిన అనంతరం.. దీనిపై ఇప్పటికే హై కోర్టు సింగిల్ బెంచ్‌లో రిట్ పిటిషన్లు ఉన్నందున అక్కడే తేల్చుకోవాలని తెలిపింది. ఈ పిటిషన్‌ను డిస్మిస్ చేస్తున్నామని హైకోర్టు చెప్పగా.. డిస్మోజ్ చేయాలని పిటిషనర్ల తరఫు న్యాయవాది కోరారు. దీంతో ఈ పిటిషన్‌ను హైకోర్టు డిస్మోజ్ చేసింది. అంతేకాకుండా పిల్‌ను ఉపసంహాకరించుకున్న ట్లు పిటిషనర్ల న్యాయవాది తెలిపారు. తాజాగా ఆలయ నిర్మాణానికి ఇచ్చిన అనుమతులను సవాల్ చేస్తూ రిట్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ఈరోజు (మంగళవారం) హైకోర్టు ధర్మాసనం విచారణ జరిపింది. 80 సంవత్సరాలుగా అక్కడ రామా లయం ఉన్నట్లు రెవెన్యూ రికార్డుల్లో ఉందని.. అన్నింటినీ పరిశీలించాకే కలెక్టర్, నగర పంచా యితీ కమిషనర్ అనుమతులు ఇచ్చారని పేర్కొం టూ.. పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది.

## ఉపరితల ద్రోణితో పిడుగులతో కూడిన వర్షాలు

### తెలుగు రాష్ట్రాలకు వర్ష హెచ్చరిక



**విశాఖపట్టణం,మే5 :** తెలుగు రాష్ట్రాల ప్రజలకు వాతావరణశాఖ కీలక హెచ్చరిక జారీ చేసింది. ఆంధ ప్రదేశ్, తెలంగాణలో రాబోయే మూడు రోజుల పాటు పలుచోట్ల వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. తెలంగాణ, రాయల సీమ, తమిళనాడు మీదుగా కొమోరిన్ ప్రాంతం వరకు ఉపరితల ద్రోణి కొనసా గుతోందని అధికారులు వెల్లడించారు. ఈ పరిస్థితుల ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని పోలవరం, విశాఖ పట్నం, అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి, అంబేద్కర్ కోనసీమ, అల్లూరి సీతారామరాజు, పార్వతీ పురం మన్యం జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశముందని అంచనా వేశారు. అదేవిధంగా తిరుపతి, చిత్తూరు, పశ్చిమగోదావరి, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో కూడా వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించారు. పిడుగుపాటు ప్రమాదం ఉన్నందున ఉరుములు, మెరుపులు సంభవించే సమయంలో చెట్ల కింద ఆశ్రయం తీసు కోకూడదని ప్రజలకు సూచించారు. క సోమవారం ప్రకాశం, పార్వతీపురం మన్యం, తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో ఇప్పటికే వర్షాలు కురిశాయి. కొన్ని ప్రాంతాల్లో గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచి, పిడుగులు పడినట్లు సమాచారం. రాష్ట్రంలో ఒకవైపు వర్షాలు కురుస్తు ండగా, మరోవైపు వేడి కూడా కొనసాగుతోంది. కృష్ణా జిల్లాలో 43.9 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదవగా, అనేక మండలాల్లో 41 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తెలం గాణలో కూడా అకాల వర్షాలు కొనసాగుతున్నాయి. సోమవారం పలు జిల్లాల్లో వడగళ్ల వాన కురిసి నష్టం కలిగించింది. రాష్ట్రంలో వచ్చే మూడు రోజుల పాటు వర్షాలు పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణశాఖ తెలిపింది. గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశ ముండడంతో రైతులు అప్రమత్తంగా ఉండాలని సూ చించింది. ఇటీవల ఖమ్మం, సూర్యాపేట, భద్రాద్రి కొత్తగూడెం, మంచిర్యాల జిల్లాల్లో గణనీ యమైన వర్షపాతం నమోదైంది. కొన్నిచోట్ల 2 నుంచి 7 సెంటీమీటర్ల వరకు వర్షం పడినట్లు అధికారులు వెల్లడించారు. ఈ అకాల వర్షాల కారణంగా పం టలకు నష్టం కలగొచ్చని ఆందోళన వ్యక్తమవుతోంది.

## విశాఖ రైల్వే జోన్ గెజిట్ విడుదల

### రాయగడ కేంద్రంగా ఈస్ట్‌కోస్ట్ రైల్వే ఏర్పాటు
### రైల్వేశాఖ ఉత్తర్వులు జారీ



**విశాఖపట్టణం,మే5 :** విశాఖపట్టణం కేంద్రంగా కొత్త రైల్వేజోన్ గెజిట్‌ను కేంద్ర రైల్వే బోర్డు అధికారికంగా విడుదల చేసింది. జూన్ 1, 2026 నుంచి దక్షిణ కోస్తా రైల్వేను అధికారికంగా ప్రారంభించనుంది. ఈస్ట్ కోస్ట్ రైల్వే పరిధిలో రాయగడ కేంద్రంగా కొత్త రైల్వే డివిజన్ ఏర్పాటైంది. వాల్తేరు డివిజన్‌ను విభజించి విశాఖపట్టణం, రాయగడ డివిజన్లుగా మార్పు చేసింది. దక్షిణ కోస్తా, ఈస్ట్ కోస్ట్, దక్షిణ మధ్య రైల్వేల పరిధిలో కీలక మార్పులు చేసింది. పాత వాల్తేరు డివిజన్‌లోని విశాఖ నగరం సహా పరిసర ప్రాంతాలు ఇకపై విశాఖపట్టణం డివిజన్‌గా మార్చి ంది. రాయగడ కేంద్రంగా ఏర్పాటయ్యే కొత్త డివిజన్ ఈస్ట్ కోస్ట్ రైల్వే కింద పనిచేస్తుందని రైల్వే బోర్డు స్పష్టం చేసింది. దక్షిణ కోస్తా రైల్వే పరిధి కొత్త జోన్ పరిధిలోకి గుంతకల్, గుంటూరు, విజయవాడ, విశా ఖపట్టణం డివిజన్లను ఏర్పాటుచేసింది. ఇకపై సికిం ద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్ డివిజన్లు మాత్రమే దక్షిణ మధ్య రైల్వే పరిధిలో ఉంటాయని తెలిపింది. ఖుర్దా రోడ్ డివిజన్‌లో గల 'ఇచ్ఛాపురం నుంచి పలా స' వరకు గల మార్గాన్ని విశాఖపట్టణం డివిజన్‌కు బదిలీ చేసింది. గుంతకల్ డివిజన్ నుంచి 'రాయచూర్ - వాడి సెక్షన్' సికింద్రాబాద్ డివిజన్‌కు బదిలీ అ యింది. పగిడిపల్లి - విష్ణుపురం మార్గాన్ని.. గుం టూరు డివిజన్ నుంచి సికింద్రాబాద్ డివిజన్‌కు మార్పు చేసింది. కొండపల్లి - మోటుమర్రి మార్గాన్ని సికింద్రాబాద్ డివిజన్ నుంచి విజయవాడ డివిజన్‌కు బదిలీ చేసింది. రాయగడ, విశాఖపట్టణం డివిజన్ల మధ్య సింగపూర్ రోడ్ - విజయనగరం కొత్త సరిహద్దు ఖరారు చేసింది. సౌత్ పోస్ట్, ఈస్ట్ కోస్ట్ రైల్వే డివిజన్ల మధ్య స్పష్టమైన సరిహద్దు కిలోమీటర్లను గెజిట్‌లో రైల్వే బోర్డు వెల్లడించింది. ఈ మార్పులన్నీ జూన్ 1, 2026 నుంచి అమల్లోకి వస్తాయని నోటిఫికేషన్‌లో రైల్వే బోర్డు స్పష్టం చేసింది.

## ఐపిఎస్ విశాల్ గున్నికి హైకోర్టు షాక్

**అమరావతి,మే5 :** ఐపీఎస్ అధికారి విశాల్ గున్నికి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు షాక్ ఇచ్చింది. క్యాట్ ఉత్తర్వులపై స్టే విధించింది. పూర్తి వివరాల్లోకి వెళితే.. సినీ నటి కాదంబరి జత్వాని అక్రమ అరెస్ట్, అధికార దుర్వినియోగం కేసులో విశాల్ గున్నిని ప్రభుత్వం సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. అయితే, ఈ అంశంపై విశాల్ గున్ని క్యాట్‌ను ఆశ్రయించారు. ఈ నేపథ్యంలోనే విశాల్ గున్ని సస్పెన్షన్ ఉత్తర్వులు రద్దు చేసి ఆయనను వెంటనే విధుల్లోకి తీసుకుని పోస్టింగ్ ఇవ్వాలని గత ఏడాది ఆగస్టు 28వ తేదీన క్యాట్ ఉత్తర్వులు జారీ చేసింది. క్యాట్ ఉత్తర్వులను రాష్ట్ర చీఫ్ సెక్రటరీ, డీజీపీ హైకోర్టులో సవాల్ చేశారు. ఈ పిటిషన్‌పై మంగళవారం హైకోర్టులో విచారణ జరిగింది. డీజీపీ, సీఎస్ తరఫున అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపించారు. సస్పెన్షన్ కాల పరిమితి ముగియక ముందే ఉత్తర్వులను క్యాట్ రద్దు చేసిందని, దాని కారణంగా విచారణ ముందుకు వెళ్లలేదని అడ్వకేట్ జనరల్ కోర్టుకు తెలిపారు. ఇక, విశాల్ గున్ని తరుఫున సీనియర్ న్యాయవాది అవినాష్ దేశాయ్ వాదనలు వినిపించారు.

## కాళేశ్వరంపై సిబిఐ విచారణ ఎందుకు చేయరు

### టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ డిమాండ్

**హైదరాబాద్,మే5 :** కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణంలో అవినీతిపై సీబీఐ విచారణ ఎందుకు ఆలస్యం అవుతుందో సమాధానం చెప్పాలని తెలంగాణకు చెందిన కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డిలను టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈనెల 10వ తేదీన ప్రధాని మోదీ తెలంగాణలో పర్యటించనున్నారని.. ఆ లోపు దీనిపై స్పష్టత ఇవ్వాలని ఆయన పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్ గాంధీ భవన్‌లో టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ విలేకర్లతో మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టు విషయం లో సీబీఐ దర్యాప్తుపై ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదన్నారు. దీనిపై కేంద్ర మంత్రి బండి సంజయ్ సమాధానం చెప్పాలని పేర్కొన్నారు. బండి సంజయ్ కేంద్ర మంత్రి అనే ఫీలింగే రావటం లేదని చెప్పారు. గత ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో రూ. వేల కోట్ల అవినీతికి పాల్పడిందని విమర్శించారు. అలాగే రూ. వేల కోట్ల ప్రజాధనం దుర్వినియోగం అయిందని ఆరోపించారు. గతంలో బీఆర్ఎస్ అవినీతిపై కిషన్ రెడ్డి, బండి సంజయ్ పలుమార్లు ఆరోపణలు చేశారని.. అలాగే సీబీఐ విచారణను కోరారని గుర్తు చేశారు. ఈ అంశంపై అసెంబ్లీలో చర్చ పెట్టి 8 నెలల క్రితం ఈ కేసును సీబీఐకు బదిలీ చేశామని పేర్కొన్నారు. బండి సంజయ్.. చేతిలోని తుపాకీ కాల్చకుండా కాంగ్రెస్ పార్టీని విమర్శిస్తే లాభం ఏమిటి? అంటూ టీపీసీసీ చీఫ్ సూటిగా ప్రశ్నించారు. బండి సంజయ్ లోపాయికారీ ఒప్పందంలో ఉండి ఈ దర్యాప్తునకు అడ్డుపడు తున్నారని మండిపడ్డారు. ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ మద్దతు లేకుండానే బీజేపీకి ఓట్లు పడ్డాయా? అంటూ సందేహం వ్యక్తం చేశారు. ఎంపీ సీట్లకి కృతజ్ఞతగా 8 నెలలుగా జరగాల్సిన సీబీఐ దర్యాప్తును అడ్డుకుంటున్నారని తెలిపారు. ఈ కేసు విచారణ ఆలస్యం ఎందుకు అవుతుందో కేంద్ర మంత్రులు సమాధానం చెప్పాలని టీపీసీసీ చీఫ్ డిమాండ్ చేశారు. ల్గ÷తుల విషయంలో బీజేపీ, బీఆర్ఎస్ గతంలో అన్న మాటలు ప్రజలు మర్చిపోలేదన్నారు. రైతులు, పేద ప్రజలకు లాభం చేసిన ప్రభుత్వం తమదే అని చెప్పారు. ధాన్యం కొనుగోలు చెల్లింపులు వేగంగా జరుగుతున్నాయని వివరించారు. పంటల దిగుబడులు కూడా పెరుగుతున్నాయని చెప్పారు. రాష్ట్రంలో ఎక్కడా రైతులకి ఇబ్బంది లేకుండా అన్ని చర్యలతో కాంగ్రెస్ ముందుకు పోతుందన్నారు. బెంగాల్‌లో బీజేపీకి అనుకూల పరిస్థితులు లేవన్నారు. అక్కడ బీజేపీ గెలిచిందంటే.. అది ఓట్ల చోరీ వల్ల మాత్రమే అని టీపీసీసీ చీఫ్ కుండబద్దలు కొట్టారు. బెంగాల్‌లో ఓటు చోరీ జరిగిందని ఆరోపించారు. తెలంగాణలో కూడా అదే పరిస్థితి జరగొచ్చు అంటూ ఆందోళన వ్యక్తం చేశారు. ఓటు హక్కు కాపాడుకోవాలంటూ తెలంగాణ పౌరులకు ఈ సందర్భంగా టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. అయినా తెలంగాణలో అలాంటి ఆటలు సాగవు అని పేర్కొన్నారు. సర్ పేరిట ఓట్లు దొంగలించడం హేయమైన చర్యగా ఆయన అభివర్ణించారు.

## కరీంగనర్ బంగారం షాపు చోరీ

### ధర్మపురి లాడ్జిలో దొంగల బస
### సిసి ఫుటేజ్ ఆధారంగా దొంగలను గుర్తించే పని

**కరీంనగర్,మే5 :** కరీంనగర్‌లోని బంగారం షాపు చోరీ కేసులో దర్యాప్తును పోలీసులు వేగవంతం చేశారు. జగిత్యాల జిల్లా ధర్మపురిలోని ఒక లాడ్జిలో దుండగుల ముఠా బస చేసినట్లు గుర్తించారు. గోదావరి తీరం పక్కనే ఉన్న ప్రైవేట్ లాడ్జిలో వారు రెండు రోజులు ఉన్నట్లు పోలీసులు కనుగొన్నారు. మే 3వ తేదీ ఉదయం లాడ్జిని ఖాళీ చేసిన ఈ ముఠా.. బైక్‌లపై మట్టి రోడ్డు ద్వారా కరీంనగర్ చేరుకున్నట్లు పోలీసులు గుర్తించారు. ధర్మపురి నుంచి బయలుదేరిన ఈ ముఠా.. ధర్మారం, పెగడపల్లి, రామడుగు మండలాల మీదుగా కరీంనగర్‌కు చేరుకుందని సీసీ కెమెరాల ద్వారా పోలీసులు నిర్ధారించుకున్నారు. ఈ సందర్భంగా ధర్మపురిలో వీరు బస చేసిన లాడ్జిని పోలీసులు తనిఖీ చేశారు. అలాగే సీసీ టీవీ ఫుటేజ్‌ను పోలీసులు జల్లెడ పడుతున్నారు. అదే సమయంలో వారి ఫోన్ కాల్స్‌ను సైతం పోలీసులు పరిశీలిస్తున్నారు. పక్కాగా రెక్కీ చేసిన తర్వాతే కరీంనగర్‌లోని పీఎంజే దుకాణంలో చోరీ చేసి.. సిబ్బందిపై కాల్పులు జరిపినట్లు పోలీసులు ఒక నిర్ధారణకు వచ్చారు. మే 3వ తేదీన కరీంనగర్‌లోని పీఎంజీ జ్యువెలరీ షాపులో భారీగా బంగారం చోరీ జరిగింది. బైక్‌లపై సాధారణ కస్టమర్లలాగా వచ్చిన ఐదుగురు నింది తులు.. షాపులో క్షణాల్లో బీభత్సం సృష్టించారు. తుపాకులతో సిబ్బందిని బెదిరించడంతో పాటు.. వారిపై కాల్పులు జరిపారు. దీంతో పలువురు గాయపడ్డారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి.. వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. వారిని పట్టించినవారికి నగదు బహుమతిగా ఇస్తామని పోలీసులు ప్రకటించారు.

## మోత్కూరులో రైతుల రాస్తారోకో

**యాదాద్రి భువనగిరి,మే5 :** ధాన్యం కొనుగోళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంపై రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. చేతికొచ్చిన పంట కండ్ల ముందే వర్షార్పణం అవుతుంటే కడుపుమండిన రైతులు రోడ్లపై కొచ్చి ఆందోళనలు చేపడుతున్నారు. తాజాగా యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఎదుట బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తక్షణమే ధాన్యం కొనుగోలు చేసి రైతుల ఇబ్బందులను తొలగించాలని కోరారు. లేదంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

## ఆరు నెలల బాలిక కిడ్నాప్

**బలగం టీవీ, హైదరాబాద్**

తల్లిదండ్రులతో కలిసి ఫుట్‌పాత్‌పై నిద్రిస్తున్న ఆరు నెలల చిన్నారిని ఇద్దరు యువకులు బైక్‌పై వచ్చి కిడ్నాప్ చేసిన ఘటన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సీహెచ్ నవమిత, బషీర్ దంపతులకు ఏడేండ్ల క్రితం వివాహమైంది. ప్రస్తుతం వారు రోడ్డుపై అడుక్కుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి 10 ఏండ్ల నబీన, 7 ఏండ్ల అలీన, 4 ఏండ్ల ఆఫీదా, ఆరు నెలల ఆశా అనే నలుగురు పిల్లలున్నారు. సోమవారం రాత్రి భోజనం అనంతరం సూరారం ప్రాంతంలోని నారాయణ మల్లారెడ్డి ఆస్పత్రి ఎదురుగా ఉన్న మహారాజా టైల్స్ షాప్ సమీపంలోని ఫుట్‌పాత్‌పై కుటుంబ సభ్యులంతా నిద్రించారు. అర్ధరాత్రి సుమారు 2:30 గంటల సమయంలో ఇద్దరు యువకులు బైక్‌పై అక్కడికి వచ్చి ఆరు నెలల చిన్నారిని అపహరించారు. ఆ సమయంలో మేల్కొన్న పెద్ద కుమార్తె నబీన గట్టిగా కేకలు వేయడంతో తల్లిదండ్రులు లేచారు. అయితే వారు స్పందించేలోపే దుండగులు చిన్నారిని తీసుకుని పరారైనట్లు తెలిసింది. ఈ ఘటనపై తల్లి సూరారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి చిన్నారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. నిందితుల కోసం సమీపంలోని సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలిస్తున్నారు.

## మైనార్టీలకు సివిల్స్ ఉచిత కోచింగ్

**- దరఖాస్తులకు ఈనెల 31 వరకు గడువు**
**- వచ్చేనెల 14న రాష్ట్రవ్యాప్తంగా స్క్రీనింగ్ టెస్ట్**
**- నోటిఫికేషన్ విడుదల చేసిన తెలంగాణ మైనార్టీస్ స్టడీ సర్కిల్**

**బలగం టీవీ, హైదరాబాద్**

సివిల్ సర్వీసెస్ లక్ష్యంగా సాగే మైనార్టీ విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్-2027 పరీక్షలకు సన్నద్ధమయ్యే విద్యార్థుల కోసం ఉచిత ఇన్-హౌస్ కోచింగ్ ఇచ్చేందుకు తెలంగాణ మైనార్టీస్ స్టడీ సర్కిల్ అండ్ కెరీర్ కౌన్సెలింగ్ సెంటర్ నోటిఫికేషన్ విడుదల చేసింది. అర్హులైన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.

రాష్ట్రంలోని ముస్లిం, క్రిస్టియన్, సిక్కు, జైన్, బౌద్ధ, పార్శీ మతాలకు చెందిన విద్యార్థులు ఈ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థి ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి కనీసం మూడేండ్ల డిగ్రీ పూర్తి చేసి ఉండాలి. కుటుంబ వార్షిక ఆదాయం రూ. 5 లక్షలకు మించకూడదు. ప్రస్తుతం వేరే ఏ కోర్సుల్లోనూ చదువుతుండకూడదు. గతంలో ప్రభుత్వం ద్వారా ఇలాంటి ఉచిత సివిల్స్ శిక్షణ పొంది ఉండకూడదు.

మొత్తం 100 మంది విద్యార్థులను మెరిట్ ప్రాతిపదికన ఎంపిక చేస్తారు. ఇందులో మహిళలకు 33.33 శాతం, వికలాంగులకు(పీహెచ్) 5శాతం సీట్లు కేటాయించారు. ఎంపికైన వారికి డిజిటలైజ్డ్ క్లాస్ రూమ్స్, లైబ్రరీ, ఇంటర్నెట్ సదుపాయంతో పాటు వసతి సౌకర్యం కల్పించనున్నారు. ఈనెల 7వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. 31వ తేదీ చివరి రోజు. వచ్చేనెల 14న స్క్రీనింగ్ టెస్ట్ కాగా, జూలై 7న ఫలితాలు వెల్లడించనున్నారు. జూలై 14న సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేపట్టనున్నారు. ఇదిలావుంటే వచ్చేనెల 14న ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు హైదరాబాద్‌తో సహా అన్ని జిల్లా కేంద్రాల్లో స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహిస్తారు. పార్ట్-ఏ 70 మార్కులకు ఆబ్జెక్టివ్ ప్రశ్నలు (నెగటివ్ మార్కింగ్ ఉంటుంది). పార్ట్-బీ 30 మార్కులకు డిస్క్రిప్టివ్ ప్రశ్నలు ఉంటాయి. ఇక సిలబస్‌లో కరెంట్ అఫైర్స్, భారత చరిత్ర, జాగ్రఫీ, పాలిటీ, ఎకానమీ, ఎన్విరాన్మెంట్, జనరల్ సైన్స్, ఇంగ్లీష్, ఆప్టిట్యూడ్ అంశాలు ఉంటాయి. ఆసక్తి ఉన్న అభ్యర్థులు హెచ్‌టీటీపీఎస్// సెట్.సీజీజీ.గౌ.ఇన్/టీఎంఆర్ఈఐఎస్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఇతర వివరాలకు ఫోన్: 040-23236112 నెంబర్‌కు లేదా డైరెక్టర్ ఎంఎస్‌సీసీతెలంగాణఏ జీమెయిల్.కామ్ మెయిల్ ఐడీని సంప్రదించాలని స్టడీ సర్కిల్ డైరెక్టర్ టి. ప్రవీణ్ కుమార్ రెడ్డి తెలిపారు.




## ప్రాణాలకు తెగించి రౌడీ షీటర్‌ను అడ్డుకున్న ఆటో డ్రైవర్

**సన్మానించిన నగర సీపీ సజ్జనర్**

**బలగం టీవీ, హైదరాబాద్**

ఒక మహిళా బాధితురాలి మెడలోని బంగారు గొలుసును రౌడీ షీటర్ లాక్కెళ్లేందుకు ప్రయత్నిస్తే, ప్రాణాలకు తెగించి, తన ఆటోనే ఆయుధంగా మలచుకొని సాహసోపేతంగా మహమ్మద్ జాహెర్ రౌడీ షీటర్‌ను అడ్డుకున్నారు. కత్రతో దాడి చేస్తోన్న బెదరకుండా ప్రతిఘటించారు. ఈ అసామాన్య ధైర్యాన్ని ప్రదర్శించిన ఆటో డ్రైవర్ జాహెర్‌ను హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ మంగళవారం బంజారాహిల్స్‌లోని టీజీఐసీసీలోని తన ఛాంబర్ లో ప్రత్యేకంగా సన్మానించారు. ఆయనకు ప్రశంసా పత్రంతో పాటు నగదు పురస్కారాన్ని అందజేశారు.

మార్చి 4న తెల్లవారుజామున బేగం బజార్ జిన్సీ చౌరాహ్ ప్రాంతంలో శ్రీమతి మంజు ఓమ్లతా తన కోడలితో కలిసి మార్నింగ్ వాక్‌కు వెళ్లారు. హిందీ మర్వాడీ విద్యాలయ స్కూల్ వద్దకు చేరుకోగానే, డబీర్‌పురకు చెందిన రౌడీ షీటర్ మహ్మద్ సోహేల్ ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కెళ్లేందుకు ప్రయత్నించాడు. ఆ క్రమంలో నిందితుడి స్కూటీ అదుపుతప్పి కిందపడిపోయింది. బాధితురాలు గట్టిగా కేకలు వేయడంతో, అదే సమయంలో అటుగా వెళ్తున్న ఆటో డ్రైవర్ మహమ్మద్ జాహెర్ ఈ దశ్యాన్ని సైడ్ వ్యూ మిర్రర్ ద్వారా గమనించారు. సంఘటన స్థలాన్ని దాటి సుమారు 100 మీటర్ల దూరం ముందుకు వెళ్లినప్పటికీ, జాహెర్ వెంటనే స్పందించి తన ఆటోను వేగంగా వెనక్కి తిప్పారు. పారిపోవడానికి ప్రయత్నిస్తున్న రౌడీ షీటర్ బైక్‌ను తన ఆటోతో ఢీకొట్టి అతడిని కిందపడేశారు. ఆ సమయంలో నిందితుడు కత్రతో దాడి చేసినా భయపడకుండా ప్రతిఘటించి అడ్డుకున్నారు. ఆ సమయంలో పారిపోతుండగా వెంటనే గస్తీ తిరుగుతున్న పోలీసులు రౌడీ షీటర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ పని ముగించుకున్న జాహెర్, ఎలాంటి ప్రతిఫలాన్ని ఆశించకుండా అక్కడి నుండి వెళ్ళిపోయారు. ఆటో డ్రైవర్ సాహసం గురించి గోషామహల్ పోలీసులకు బాధితురాలు తెలియజేశారు. కాగా, ఈ వీరోచిత దశ్యాలన్నీ అక్కడి సీసీటీవీ కెమెరాల్లో రికార్డ్ అయ్యాయి. రౌడీ షీటర్‌ను పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించి, నిస్వార్థంగా వెళ్లిపోయిన అతని కోసం గోషామహల్ పోలీసులు గాలింపు చేపట్టారు. సీసీటీవీ ఫుటేజీలో ఆటో నంబర్‌ను సేకరించి, సాంకేతిక పరిజ్ఞానంతో జాహెర్‌ను గుర్తించారు. ఈ సందర్భంగా సీపీ వీసీ సజ్జనర్ మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్ మహమ్మద్ జాహెర్ చూపిన సాహసం సమాజానికి ఆదర్శమన్నారు. 'చూస్తుండగానే నేరాలు జరుగుతున్నా పట్టించుకోని ఈ రోజుల్లో, ప్రాణాలకు తెగించి రౌడీ షీటర్‌ను అడ్డుకున్న జాహెర్ సమాజానికి నిజమైన రోల్ మోడల్. ఆయనలో ఒక అద్భుతమైన ప్రజా పోలీస్ ఉన్నారు. ఎలాంటి ప్రతిఫలం కూడా ఆశించలేదని, ఇలాంటి బాధ్యతాయుతమైన పౌరులు ఉన్నప్పుడే నేరస్తులకు భయం పుడుతుంది' అని ప్రశంసించారు. ఇదిలావుండగా డబిర్ పూరకు చెందిన రౌడీ షీటర్‌పై గోషా మహల్ పీఎస్‌లో కేసు నమోదు చేసి, అరెస్ట్ చేశారు. అతడిపై వివిధ పోలీస్ స్టేషన్లలో 16 కేసులున్నాయి. ఈ సన్మాన కార్యక్రమంలో గోల్కొండ జోన్ డీసీపీ జి. చంద్ర మోహన్, గోషామహల్ ఎస్‌హెచ్‌వో శ్రవణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.




## దోమల నియంత్రణకు ఆధునిక పరికరాలతో బలోపేతం

**- ఎంఎంసీ కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి**

**బలగం టీవీ, హైదరాబాద్**

దోమల నియంత్రణ చర్యలను మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి ఎంటమాలజీ విభాగాన్ని ఆధునిక పరికరాలతో బలోపేతం చేస్తున్నట్టు మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి.వినయ్ కష్ణా రెడ్డి తెలిపారు. మంగళవారం మల్కాజిగిరి జోనల్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంటమాలజీ విభాగానికి అవసరమైన పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణలో దోమల నియంత్రణకు అత్యంత ప్రాధాన్యత ఉందన్నారు. దోమల వ్యాప్తిని అరికట్టేందుకు ఆధునిక సాంకేతిక పరికరాల వినియోగం కీలకమనీ, అధికారులు వీటిని సమర్థవంతంగా వినియోగించి క్షేత్రస్థాయిలో చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. నగర ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా దోమల నియంత్రణలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల సహకారంతోనే ఈ చర్యలు విజయవంతం అవుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్, డిప్యూటీ కమిషనర్ జాకియా సుల్తానా, సీనియర్ ఎంటామాలజిస్ట్ మాధవరెడ్డి, ఎంటమాలజీ సిబ్బంది పాల్గొన్నారు.

# అక్రమ క్రషింగ్ యూనిట్లపై హైడ్రా చర్యలు

**- అనుమతి లేని ఆర్ ఎంసీ ప్లాంట్ల తొలగింపు**
**- పీసీబీ, మైనింగ్ శాఖల ఫిర్యాదుతో పలుచోట్ల హైడ్రా ఆపరేషన్లు**

**బలగం టీవీ, హైదరాబాద్**

అనుమతిలేని క్రషింగ్ యూనిట్లపై హైడ్రా దృష్టి సారించింది. మంగళవారం ఒకే రోజు వేర్వేరు ప్రాంతాల్లో 8 క్రషింగ్ యూనిట్లతో పాటు, 13 ఆర్ఎంసీ ప్లాంట్లలో మూడింటిని నేలమట్టం చేసింది. మిగిలిన 10 ఆర్ఎంసీ ప్లాట్లను తొలగించాల్సి ఉంది. మెన్ అండ్ మెషనరీ కావాలని పీసీబీ, మైనింగ్, రెవెన్యూ అధికారులు కోరడంతో రంగంలోకి దిగిన హైడ్రా ప్రత్యేక ఆపరేషన్‌ను చేపట్టింది. పీసీబీ, మైనింగ్, రెవెన్యూ అధికారుల సమక్షంలో రంగారెడ్డి జిల్లా గౌలిదొడ్డి, వట్టినాగులపల్లి, గోపన్నపల్లి, శంషాబాద్‌లోని కొత్వాల్‌గూడలో ఏండ్లుగా నడుస్తున్న క్రషింగ్ యూనిట్లను తొలగించింది. బినామీ పేర్లతో బడా సంస్థల అండదండలు, బడాబాబులు వెనకుండి నడిపిన యూనిట్లు నేలమట్టమయ్యాయి. ఇందులో ఏ ఒక్క క్రషింగ్ యూనిట్‌కూ మైనింగ్‌తో పాటు, పీసీబీ అనుమతులు లేకపోవడం గమనించాల్సిదగ్గ అంశం. పీసీబీ నోటీసులు, రెవెన్యూ శాఖ ఆదేశాలు, మైనింగ్ శాఖ అభ్యంతరాలు ఏవీ పట్టించుకోకుండా నడుస్తున్న యూనిట్లు హైడ్రా చర్యలతో నేల మట్టమయ్యాయి.

సహజసిద్ధమైన కొండలు.. చిట్టడవిని తలపించే విధంగా ఉన్న గుట్టలను ఎలాంటి అనుమతి లేకుండా ధ్వంసం చేస్తున్నారని పీసీబీ, రెవెన్యూ, మైనింగ్ శాఖలు హైడ్రాకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాయి. ప్రకతి విధ్వంసానికి పాల్పడ్డాయని తెలిపాయి. రాత్రీ పగలూ అనే తేడా లేకుండా క్రషింగ్ చేసి దుమ్ము రేపి వాయు కాలుష్యానికి కారణమయ్యాయని ఫిర్యాదులో పేర్కొన్నాయి. ఇదంతా ఓఆర్ఆర్ పరిధిలోనే జరుగుతుండడం గమనార్హం. అక్రమంగా నడుస్తున్న క్రషింగ్ యూనిట్లతో పాటు.. వర్కింగ్



లైసెన్సు లేని ఆర్ఎంసీ (రెడీ మిక్స్ కాంక్రీట్) యూనిట్లను కూడా హైడ్రా తొలగించింది. భవిష్యత్తులో అక్కడ స్టోన్ క్రషింగ్ చేయడానికి వీలు లేకుండా పరికరాలను నేలమట్టం చేసింది. భగత్‌సింగ్ స్టోన్ క్రషర్, ఎస్‌వీకే, పరమేశ్వర్ స్టోన్, ప్రథ్వి, గ్రేట్ ఇండియా మైనింగ్, ఆర్ మిల్లర్, తిరుమల మెటల్ ఇండస్ట్రీకి చెందిన క్రషింగ్ యూనిట్లతో పాటు బీఎస్ ఆర్, అల్ట్రాటెక్, ఏసీసీ రెడీమిక్స్ ప్లాంట్లు ఇందులో ఉన్నాయి.

**బినామీ పేర్లతో....**

ఈ ప్లాంట్లు ఎవరివి అంటే సరైన చిరునామా లేకుండా సాగిపోతున్నాయి. ఎన్ని ఎకరాలు లీజుకు తీసుకున్న వివరాలు లేవు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలంలోని కొత్వాల్‌గూడలో దాదాపు 16 ఎకరాల మేర విస్తరించి అందులో 7 ఎకరాల వరకూ కొండల్ని పిండి చేసినట్టు ఆనవాళ్లు కనిపించాయి. తిరుమల మెటల్ ఇండస్ట్రీకి చెందిన క్రషింగ్ యూనిట్ ఇక్కడ నడుస్తోంది. దీనిని మొత్తం తొలగించారు. ఇక్కడే మరో రెండు ఆర్ఎంసీ ప్లాంట్లను కూడా హైడ్రా తొలగించింది. బడాసంస్థల అండదండలతో బినామీ పేర్లతో నడుస్తున్నట్టు పీసీబీ, రెవెన్యూ, మైనింగ్ శాఖల అధికారులు చెబుతున్నారు. ఔటర్ రింగు రోడ్డుకు ఆనుకుని ఈ యూనిట్లు ఉన్నాయి. ప్రకతి విధ్వంసం ఆపిన హైడ్రాను పలువురు అభినందించారు.

# ఆకివీడు రామాలయ నిర్మాణానికి హైకోర్టు పచ్చజెండా



**అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ దాఖలైన పిటిషన్ కొట్టివేత**
**80 ఏళ్ల నాటి చారిత్రక ఆధారాలను సమర్థించిన ధర్మాసనం**
**అడ్డంకులు తొలగడంపై భక్తుల హర్షాతిరేకాలు**

**బలగం టీవీ, అమరావతి**

పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడులో శ్రీరామ మందిర నిర్మాణానికి ఉన్న అడ్డంకులన్నీ తొలగిపోయాయి. ఆలయ నిర్మాణాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను విచారించిన రాష్ట్ర హైకోర్టు, పిటిషనర్ అభ్యంతరాలను తోసిపుచ్చింది. ఆలయ నిర్మాణానికి అధికారులు జారీ చేసిన అనుమతులు చట్టబద్ధంగానే ఉన్నాయని న్యాయస్థానం స్పష్టం చేసింది.

**80 ఏళ్ల చరిత్ర ఉంది..**

ఆలయానికి సంబంధించిన చారిత్రక రికార్డులను పరిశీలించిన న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. "గత 80 ఏళ్లుగా సదరు ప్రాంతంలో రామాలయం ఉన్నట్లు రికార్డులు స్పష్టంగా వెల్లడిస్తున్నాయి. ఇది నిన్న మొన్న వెలసిన నిర్మాణం కాదు. అధికారులు అన్ని రకాల ఆధారాలను, రెవెన్యూ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే నిర్మాణానికి అవసరమైన అనుమతులు మంజూరు చేశారు" అని కోర్టు అభిప్రాయపడింది. ప్రభుత్వ అధికారులు నిబంధనల ప్రకారమే అనుమతులు ఇచ్చారని, వారి నిర్ణయంలో జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఏమాత్రం లేదని ధర్మాసనం తేల్చి చెప్పింది. పిటిషనర్ లేవనెత్తిన సాంకేతిక అంశాల్లో పస లేదని పేర్కొంటూ వ్యాజ్యాన్ని కొట్టివేసింది.

హైకోర్టు తీర్పుతో ఆకివీడులో భక్తులు సంబరాలు జరుపుకుంటున్నారు. గత కొంతకాలంగా న్యాయపరమైన చిక్కుల వల్ల ఆలయ పనులు నిలిచిపోయాయని, ఇప్పుడు ధర్మమే గెలిచిందని భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. త్వరలోనే నిర్మాణ పనులను పూర్తి చేస్తామని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

# ఎమ్మెల్సీల నియామకంపై హైకోర్టులో సవాల్

**- కోదండరాం, అజారుద్దీన్ ఎంపిక రాజ్యాంగ విరుద్ధం**
**-జీవో 71ని రద్దు చేయాలని పిటిషన్**
**-హైకోర్టులో దాఖలైన క్వో వారంటో వ్యాజ్యం**

**బలగం టీవీ, హైదరాబాద్**

గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా ప్రొఫెసర్ ఎం. కోదండరాం, మాజీ క్రికెటర్ మహ్మద్ అజారుద్దీన్‌ను నియమించడాన్ని సవాల్ చేస్తూ రాష్ట్ర హైకోర్టులో మంగళవారం వ్యాజ్యం దాఖలైంది. వారిద్దరినీ ఎమ్మెల్సీలుగా నామినేట్ చేస్తూ గత నెల 26న రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 71 చట్టవిరుద్ధమని, దానిని రద్దు చేయాలని కోరుతూ హైదరాబాద్‌కు చెందిన సయ్యద్ హైదర్ ఈ పిటిషన్ వేశారు.

రాజ్యాంగంలోని ఆర్టికల్ 171(5) ప్రకారం గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా నియమితులయ్యే వ్యక్తులకు సాహిత్యం, శాస్త్రం, కళలు, సహకార ఉద్యమం లేదా సామాజిక సేవ వంటి రంగాల్లో విశేష అనుభవం ఉండాలని పిటిషనర్ పేర్కొన్నారు. అయితే, ప్రస్తుత నియామకాల్లో ఈ నిబంధనలను పాటించలేదని, కోదండరాం, అజారుద్దీన్‌లకు రాజ్యాంగం నిర్దేశించిన అర్హతలు లేవని పిటిషన్‌లో ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాల కోసం ఈ నియామకాలు చేపట్టిందని, ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని పిటిషనర్ తరపు న్యాయవాది పేర్కొన్నారు. జీవో 71 అమలును తక్షణమే నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని న్యాయస్థానాన్ని కోరారు. ఈ నియామక ప్రక్రియపై పూర్తిస్థాయి విచారణ జరిపి, వారి ఎంపికను చెల్లనిదిగా ప్రకటించాలని విన్నవించారు.

గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకంపై ఇప్పటికే రాష్ట్రంలో రాజకీయంగా పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ఇప్పుడు ఈ వ్యవహారం న్యాయస్థానానికి చేరడంతో హైకోర్టు తీర్పు ఎలా ఉండబోతుందనేది ఆసక్తికరంగా మారింది. ఈ పిటిషన్‌పై హైకోర్టు త్వరలోనే విచారణ జరిపే అవకాశం ఉంది.

# భారత్‌కు పులిట్జర్ గర్వం

**- ప్రఖ్యాత పురస్కారాన్ని దక్కించుకున్న ఆనంద్ ఆర్కే, సుపర్ణాశర్మ**
**- డిజిటల్ మోసాలపై 'బ్లూమ్‌బర్గ్' పరిశోధనాత్మక కథనానికి గుర్తింపు**
**- ఇలస్ట్రేటెడ్ రిపోర్టింగ్ విభాగంలో అవార్డు ప్రకటన**

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

పాత్రికేయ రంగంలో ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన 'పులిట్జర్' పురస్కారం ఈ ఏడాది ఇద్దరు భారతీయ జర్నలిస్టులను వరించింది. డిజిటల్ నిఘా, సైబర్ నేరాల వెనుక ఉన్న చీకటి కోణాలను వెలుగులోకి తెచ్చినందుకు గాను ఆనంద్ ఆర్కే, సుపర్ణాశర్మలు ఈ అరుదైన గౌరవాన్ని దక్కించుకున్నారు. పులిట్జర్ బోర్డు సోమవారం న్యూయార్క్‌లో ఈ విజేతల వివరాలను అధికారికంగా ప్రకటించింది.

**'ట్రాప్డ్' కథనానికి అంతర్జాతీయ గుర్తింపు**

ప్రముఖ అంతర్జాతీయ మీడియా సంస్థ 'బ్లూమ్‌బర్గ్'లో ప్రచురితమైన 'ట్రాప్డ్' (ఉచ్చులో చిక్కుకుని) అనే శీర్షికతో కూడిన పరిశోధనాత్మక కథనానికి గాను వీరికి ఈ అవార్డు లభించింది. నటాలీ ఒబికో పియర్సన్‌తో కలిసి వీరిద్దరు ఈ పురస్కారాన్ని పంచుకోనున్నారు. కొలంబియా యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఇచ్చే ఈ అవార్డును వీరు 'ఇలస్ట్రేటెడ్ రిపోర్టింగ్, కామెంటరీ' (విజువల్ రిపోర్టింగ్) విభాగంలో గెలుచుకున్నారు.

సాంకేతికతను ఆసరాగా చేసుకుని సైబర్ మోసగాళ్లు సామాన్యులను ఎలా వల వేసి వేధిస్తున్నారో ఈ రిపోర్టులో అత్యంత వివరణాత్మకంగా వివరించారు.

డిజిటల్ అరెస్ట్: ఫోన్ ద్వారా 'డిజిటల్ అరెస్టు'కు గురైన భారతదేశానికి చెందిన ఒక ప్రముఖ న్యూరాలజిస్ట్ ఉదంతాన్ని ఈ కథనంలో ప్రధానంగా ప్రస్తావించారు.

సైబర్ సవాళ్లు: ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న డిజిటల్ నిఘా, ఆర్థిక మోసాలు, సామాన్యులకు పొంచి ఉన్న ముప్పును ఈ పరిశోధనాత్మక నివేదిక కళ్లకు కట్టింది.

ప్రభావం: సాంకేతికత ద్వారా జరిగే అపరాధాలను కేవలం రాత పూర్వకంగానే కాకుండా, విజువల్స్ (చిత్రాలు/గ్రాఫిక్స్) తో అర్థమయ్యేలా వివరించడం ఈ కథనం ప్రత్యేకత.

**భారతీయ జర్నలిజానికి దక్కిన గౌరవం**

ప్రపంచ దేశాల మధ్య తీవ్ర పోటీ నెలకొనే పులిట్జర్ బరిలో భారతీయులు విజేతలుగా నిలవడం పట్ల జర్నలిజం రంగంలో హర్షం వ్యక్తమవుతోంది. సైబర్ నేరాలపై అంతర్జాతీయ స్థాయిలో అవగాహన కల్పించడంలో వీరి కృషి ఎంతో విలువైనదని పులిట్జర్ బోర్డు కొనియాడింది.

# గార్ల అటవీ ప్రాంతంలో మైనింగ్‌కు బ్రేక్..!

**- అటవీ శాఖ నిర్ణయాన్ని సమర్థించిన హైకోర్టు**
**- మైనింగ్ కంపెనీల పిటిషన్లు కొట్టివేత**
**- 762 ఎకరాల రిజర్వు ఫారెస్ట్‌కు దక్కిన ఊరట**

**బలగం టీవీ, హైదరాబాద్**

ఉమ్మడి ఖమ్మం జిల్లా గార్ల మండలంలోని రిజర్వు ఫారెస్ట్ ప్రాంతంలో అటవీ శాఖ తీసుకున్న మైనింగ్ నిషేధ నిర్ణయాన్ని హైకోర్టు సమర్థించింది. బెరైటీస్, డోలమైట్స్ మైనింగ్‌ను నిలిపివేస్తూ అటవీ శాఖ జారీ చేసిన నోటీసులను సవాలు చేస్తూ పలు మైనింగ్ కంపెనీలు 2009 నుంచి దాఖలు చేసిన పిటిషన్లను న్యాయస్థానం కొట్టివేసింది. ఈ మేరకు జస్టిస్ నగేశ్ భీమపాక ఇటీవల కీలక తీర్పు వెలువరించారు.

రిజర్వు ఫారెస్ట్ భూమిని ప్రభుత్వ భూమిగా (రెవెన్యూ భూమి) వర్గీకరిస్తూ గతంలో రెవెన్యూ అధికారులు చేసిన పొరపాటే ఈ సుదీర్ఘ వివాదానికి కారణమని హైకోర్టు అభిప్రాయపడింది. అధికారుల నిర్లక్ష్యం వల్ల 1962 నుంచి సుమారు 762 ఎకరాల విస్తీర్ణంలో నిరాటంకంగా మైనింగ్ కార్యకలాపాలు కొనసాగాయని, దీనివల్ల గార్ల అటవీ ప్రాంతానికి తీవ్ర నష్టం వాటిల్లిందని న్యాయమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రభుత్వ వాదనలతో ఏకీభవించిన న్యాయస్థానం, వివాదాస్పద ప్రాంతం రిజర్వు ఫారెస్ట్‌లో అంతర్భాగమేనని స్పష్టం చేసింది.

చారిత్రక ఆధారాలు:లిలి ఈ భూమిని 1951 ఆగస్టు 17న నిజాం ప్రభుత్వం రిజర్వు ఫారెస్ట్‌గా నోటిఫై చేసినట్లు కోర్టు గుర్తించింది.

రిపోర్టుల తిరస్కరణ:లిలి సర్వే ఆఫ్ ఇండియా నివేదికకు ప్రామాణికత లేదంటూ కొన్ని కంపెనీలు చేసిన వాదనలను కోర్టు తోసిపుచ్చింది.

మైనింగ్ కంపెనీలు తమ వ్యాపార ప్రయోజనాల కోసం అటవీ చట్టాలను అతిక్రమించలేవని కోర్టు స్పష్టం చేసింది. దాదాపు 15 ఏళ్ల నుంచి సాగుతున్న ఈ న్యాయపోరాటం అటవీ శాఖకు అనుకూలంగా ముగియడంతో, గార్ల అటవీ ప్రాంతం ఇప్పుడు మైనింగ్ ముప్పు నుంచి బయటపడనుంది. ఈ తీర్పు పర్యావరణ ప్రేమికులు, స్థానిక ప్రజల హర్షాతిరేకాల మధ్య వెలువడింది.

## రాష్ట్రపతి ముర్మును కలిసిన ఎంపీ రాఘవ చద్దా బృందం

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

పంజాబ్‌లోని ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం రాజకీయ వేధింపులకు పాల్పడుతోందని రాజ్యసభ ఎంపీ రాఘవ చద్దా తీవ్రంగా విమర్శించారు. స్వచ్ఛందంగా 'ఆప్'ను వీడి బీజేపీలో చేరిన ప్రజాప్రతినిధులను లక్ష్యంగా చేసుకుని ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు దిగుతోందని ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం రాఘవ చద్దాతో పాటు మరో ముగ్గురు ఎంపీలు రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసి వినతిపత్రం సమర్పించారు. బీజేపీలో చేరిన ఎంపీల ఇళ్ల వద్దకు పోలీసులను పంపి వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని చద్దా రాష్ట్రపతికి వివరించారు. పంజాబ్ అధికార యంత్రాంగాన్ని ప్రభుత్వం తన రాజకీయ ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేస్తోందని మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో తమ అభిప్రాయాలను వ్యక్తం చేసే హక్కు అందరికీ ఉంటుందని, పార్టీ నాయకత్వ వైఖరి నచ్చకే తాము బయటకు వచ్చామని స్పష్టం చేశారు."మేము మా రాజ్యాంగపరమైన హక్కులను వినియోగించుకుని అసంతృప్తిని వ్యక్తం చేస్తూ బయటకు వచ్చాం. కానీ దీనిని సహించలేక రాష్ట్ర ప్రభుత్వం దాడులకు, వేధింపులకు దిగడం అత్యంత దారుణం" అని రాఘవ చద్దా విమర్శించారు. బీజేపీలోకి వెళ్లిన ఎంపీలందరిపైనా రకరకాల మార్గాల్లో ఒత్తిడి పెంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.రాష్ట్ర ప్రభుత్వం నుంచి తమకు ప్రాణహాని ఉందని, రాజకీయ వేధింపుల నుంచి రక్షణ కల్పించాలని ఎంపీల బృందం రాష్ట్రపతిని కోరింది. కేంద్ర ప్రభుత్వం ఈ విషయంలో జోక్యం చేసుకుని పంజాబ్ ప్రభుత్వ నియంతృత్వ ధోరణిని అరికట్టాలని వారు విజ్ఞప్తి చేశారు.

## జలకళతో కళకళలాడుతున్న
# వేములవాడ తెలంగాణ చౌరస్తా

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సహకారంతో పట్టణాన్ని సర్వంగ సుందరంగా తీర్చిదిద్దుతాం
- యుద్ధప్రాతిపదికన ఫౌంటెన్‌కు మరమత్తులు పూర్తి చేసి వినియోగంలోకి తెచ్చిన మున్సిపల్ చెర్మన్ పుల్కం రాజు

**బలగం టీవి, వేములవాడ**



వేములవాడ పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ఉన్న వాటర్ ఫౌంటెన్, మళ్ళీ జలకళను సంతరించుకుని సందర్శకులకు కనువిందు చేస్తోంది. సాంకేతిక కారణాలు వల్ల గత కొంతకాలంగా వెలవెలబోయిన ఈ ఫౌంటెన్, తాజాగా చేపట్టిన మరమ్మతు పనుల తో కొత్త శోభను అద్దుకుంది. పట్టణ సుందరికరణలో భాగంగా, ఈ ఫౌంటెన్‌ను పునరుద్ధరించాలని భావించిన మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి పనులను పర్యవేక్షించారు. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అందించిన సహకారంతో, అధికారులు, సిబ్బంది యుద్ధప్రాతిపదికన పనులను పూర్తి చేయడంతో ఈరోజు సోమవారం సాయంత్రం నుంచి ఫౌంటెన్ తిరిగి తన పునఃర్వైభవాన్ని చాటుకుంటోంది. ?ప్రస్తుతం రంగురంగుల విద్యుత్ కాంతుల నడుమ, పైపుల నుంచి చిమ్ముతున్న నీటి ధారలు అక్కడి వాతావరణాన్ని ఆహ్లాదకరంగా మార్చేశాయి. సాయంత్రం వేళల్లో స్థానికులు, చిన్నారులు, వృద్ధులు జలకళను చూసి ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఒకప్పుడు మూలన పడిన ఈ ఫౌంటెన్ , ఇప్పుడు కళకళలాడుతోంది. పట్టణ ప్రజల కోరిక మేరకు తక్షణమే స్పందించి, మరమ్మతులతో ఈ ఫౌంటెన్‌ను తిరిగి అందుబాటులోకి తీసుకురావడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ వేములవాడను ఆదర్శవంతమైన పట్టణంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. "ప్రజల ముఖాల్లో ఆనందాన్ని చూడటమే మాకు నిజమైన సంతృప్తియని . పట్టణంలోని పర్యాటకులు, స్థానికులు తమ సాయంత్రం వేళల్లో ప్రశాంతంగా గడపడానికి, ఒక ఆహ్లాదకరమైన వాతావరణం ఉండాలనే ఉద్దేశంతో ఈ ఫౌంటెన్‌ను పునరుద్ధరించడం జరిగిందన్నారు. పట్టణాన్ని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు నిరంతరం శ్రమిస్తున్నారని తెలిపారు. ఈ పనులన్నీ ప్రజల కోసం చేపట్టినవే, కాబట్టి ఈ సౌకర్యాలను అందరం కలిసి కాపాడుకుందాం అన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలతో పట్టణాన్ని మరింత అందంగా తీర్చిదిద్దుతాం," అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు అన్నారం శ్రీనివాస్, ఎల్ల శ్రీనివాస్, రామతీర్థపు కృష్ణవేణి హరీష్, సిబ్బంది, తదితరులు వున్నారు.

# స్వంత ఇంటి కల కాంగ్రెస్ ప్రభుత్వంతో నిరుపేదలకు వరం

- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**బలగం, బోయినిపల్లి;**



స్వంతింటి కల నిరుపేదలకు వరం అని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం దుండ్రపల్లి గ్రామంలో కొడం శ్రీను-మంజుల దంపతులు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా ఇంటిని నిర్మించుకోనీ, గృహ ప్రవేశం చేయగా చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం దంపతులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ: కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇల్లు లేని నిరుపేదలకు ఇల్లు కట్టించే లక్ష్యంగా పనిచేస్తామని అన్నారు. ప్రతి ఒక్కరు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రమణారెడ్డి, సర్పంచ్ జంగం అంజయ్యా, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మర్లపేట సర్పంచ్ భీమ్ రెడ్డి మహేశ్వర్ రెడ్డి, సెస్ డైరెక్టర్ కోట్టపల్లి సుధాకర్ ,ఏఎంసి వైస్ చైర్మన్ నిమ్మ వినోద్ రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక రైతులకు అవగాహన సదస్సు



**బలగం, బోయినిపల్లి**

ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ లో భాగంగా మే 4 నుండి మే 9 వరకు రైతు వారముగా వ్యవసాయ మరియు అనుబంధ శాఖల వారీగా రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

దీనిలో భాగంగా మొదటి రోజు తేదీ 04.05.2026 న రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంలోని 4 రైతు వేధికలలో నేల ఆరోగ్యం, సమతుల ఎరువుల వాడకం, ప్రకృతి వ్యవసాయం, వినియోగదారులు కోరుకునే వరి, సన్నాల సాగు మొదలైన అంశాలపై రైతులకి సోమవారం రోజున అవగాహన కల్పించారుఅలాగే నేల ఆరోగ్యాన్ని పరిరక్షిస్తానంటూ రైతులతో ప్రతిజ్ఞ చేయించారు. భూసారపరీక్ష కొరకు మట్టి నమూనా ఎలా తీయాలో రైతులకు వివరించి, ఒక వీడియోని రైతులకి చూపించి, ఎలా తీయాలో ప్రత్యక్షంగా చూపించారు.సేంద్రియ ఎరువులు, జీవన ఎరువులు, రసాయన ఎరువులు గురించి వివరించి, వాటి వినియోగం ఎలా చేయాలో సమగ్ర ఎరువుల యాజమాన్యం వివరించారు.మార్చి నెలలో తీసి పంపించిన మట్టి నమూనా పరీక్షా విశ్లేషణ పత్రం రైతుకి అందచేసి, దానిని వివరించడం జరిగింది.అలాగే పౌరసరఫరాల శాఖ నుండి వినియోగదారులకి అందించే సన్న బియ్యంలో ఎక్కువగా ఉండే సన్నాల రకాలను, ప్రభుత్వం కొనుగోలు చేసి బోనస్ అందించే రకాలైన డి పి డి 5204, ఆర్ఎన్ ఆర్15048, జైశ్రీరామ్, హెచ్.ఎం.టి సోనా, కే ఎం ఎం 1638, జేజీఎల్ – 384, జేజీఎల్ 1798, డబ్ల్యూ జి ఎల్ 44 మొదలైన రకాలు వేసుకొమ్మని రైతులకి సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిని ప్రణీత, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు శ్రీదేవి, రవళి, లక్ష్మణ్, రజిత, వ్యవసాయ మార్కెట్ సెక్రటరీ రమణ, తడగొండ సర్పంచ్ ఉయ్యాల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ రద్దుపై కాంగ్రెస్ కుట్ర..

- బీఆర్ఎస్వీ రాష్ట్ర నేత కంచర్ల రవి గౌడ్ ఆగ్రహం

**బలగం టీవీ, సిరిసిల్ల:**

సిరిసిల్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవి గౌడ్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని క్రమంగా రద్దు చేయడానికి ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆరోపించారు. ఈ నిర్ణయం వల్ల సుమారు 14 లక్షల పేద విద్యార్థుల భవిష్యత్తు చీకటిలోకి నెట్టబడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో విద్యా వ్యవస్థ కాంగ్రెస్ పాలనలో దెబ్బతింటోందని, ముఖ్యంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులపై దీని ప్రభావం తీవ్రంగా ఉంటుందని అన్నారు. జీవో నంబర్ 7 ద్వారా ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని బలహీనపరచే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి విద్యార్థులపై ఆర్థిక భారం మోపడం అన్యాయమని మండిపడ్డారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో విద్యా రంగం గందరగోళానికి గురైందని, ఈ ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతోందని వ్యాఖ్యానించారు. స్వర్గీయ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ విజయవంతంగా కొనసాగించారని గుర్తుచేశారు. ప్రస్తుతం దానిని ఉద్దేశపూర్వకంగా దెబ్బతీసే ప్రయత్నం జరుగుతోందని అన్నారు.

జీవో నంబర్ 7ను వెంటనే వెనక్కి తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా భారీ ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నాయకత్వంలో విద్యార్థుల హక్కుల కోసం చివరిదాకా పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడితే కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు ఆరెల్లి వినయ్ కుమార్, సదుల శేఖర్, బల్యాల ప్రవీణ్, ప్రశాంత్, శశి, భాను రాజు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.






## మాడేలేశ్వర స్వామి ఆలయం వద్ద నూతన బోర్ మోటార్ ప్రారంభించిన సర్పంచ్ యం. రాజు

**బలగం, టీవీ ఇల్లంతకుంట**

ఇల్లంతకుంట మండల కేంద్రంలోని శ్రీ సీతారామ మడేలేశ్వర స్వామి ఆలయం వద్ద నూతన బోర్ వేయించి, నేడు మోటర్ అమర్చి స్థానిక సర్పంచ్ యం. రాజు ప్రారంభించారు.


ఈ సందర్భంగా భక్తులు సంతోషం వ్యక్తం చేస్తూ, తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించినందుకు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం సర్పంచ్ రాజు మాట్లాడుతూ మానకొండూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సహకారంతో మాడేలేశ్వర స్వామి ఆలయం వద్ద బోర్ ప్రారంభించడం జరిగిందని అయన తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మూగు నాగరాజు శర్మ, వార్డు సభ్యులు చేరాల వంశీకృష్ణ, కొట్టే ప్రమీల, అంతటి శ్రీకాంత్ గౌడ్ నాయకులు ,పురోహితులు, రజక సంఘం సభ్యులు, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ వేములవాడ అర్బన్ మండల కార్యవర్గ సమావేశం

**బలగం, వేములవాడ;**

భారత దేశ ప్రధాని నరేంద్ర మోడీ మూడవసారి ప్రధానమంత్రి అయిన తర్వాత ఈనెల 10వ తారీఖు రోజున హైదరాబాద్ కి విచ్చేస్తున్న సందర్భంగా మరియు ఈనెల 12వ తేదీ రోజున పార్లమెంట్ సభ్యులు, కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగే హిందూ ఏక్తా యాత్ర సమావేశాలు విజయవంతం చేసే విధంగా వేములవాడ అర్బన్ మండలం భారతీయ జనతా పార్టీ మండల కార్యవర్గ సమావేశం మండల అధ్యక్షుడు బుర్ర శేఖర్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించుకోవడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి జిల్లా కార్యదర్శి గోపాడి సురేందర్ రావు హాజరైనారు

ఈ కార్యక్రమంలో జిల్లా కోఆప్షన్ మెంబర్ చింతపల్లి వెంకటేశ్వరరావు, యువ మోర్చా రాష్ట్ర నాయకులు జింక అనిల్, మండల ప్రధాన కార్యదర్శి చంద్రగిరి ప్రశాంత్, మం,డల ఉపాధ్యక్షులు ఎరుగోకుల రమేష్, తిప్పరవేణి రాజు, కిసాన్ మోర్చా అధ్యక్షులు గోనె భాస్కర్, నాయకులు పేరంగాని మల్లేశం, కోలనూరి సంజీవరెడ్డి, పోచంపల్లి బాను, కంసాని రాము ముడికే రాములు, పల్లెబోయిన శేఖర్, పల్లెబోయిన కనకరాజు, నాంపల్లి తిరుపతి, ముదాం శ్రీనివాస్, దామోదర్ రెడ్డి, నాగరాజు బొల్లు తిరుపతి, మరిపెద్ది వికాస్ తదితరులు పాల్గొన్నారు.





## ప్రజావాణి అర్జీల పరిష్కారంపై దృష్టి సారించాలి..

**-కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

ప్రజావాణి అర్జీలపై అధికారులు దృష్టి సారించి, పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం ప్రజావాణి నిర్వహించగా, కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజావాణికి మొత్తం 220 దరఖాస్తుల రాగా, వాటిని సంబంధిత శాఖల అధికారులకు అందజేసి, పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు.

**డివిజన్ స్థాయిలో ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి..**

ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో నేటి నుండి డివిజన్ స్థాయిలో ప్రజావాణి కార్యక్రమం ప్రారంభించడం జరిగిందని కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ ఆర్డీఓ కార్యాలయాల్లో ప్రతీ సోమవారం ఆర్డీఓ లు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించి, ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తారని పేర్కొన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి ప్రతీ సోమవారం నిర్వహించే డివిజన్ స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ప్రజావాణిలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, హౌసింగ్ పీడీ వెంకట మాధవ రావు, తదితరులు పాల్గొన్నారు.




## బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యం..

**- ఎస్పీ మహేష్ బి.గితే**

**బలగం టీవీ ,రాజన్న సిరిసిల్ల:**

ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వారికి సత్వర న్యాయం అందించడమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎస్పీ మహేష్ బి.గితే అన్నారు. సోమవారం సిరిసిల్ల పట్టణంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డే లో ఎస్పీ మహేష్ బి.గితే పాల్గొని,బాధితుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి.గితే మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ సేవలను మరింత చేరువ చేయడమే తమ ధ్యేయమని అన్నారు . పోలీస్ స్టేషన్లకు వచ్చే బాధితులతో అధికారులు, సిబ్బంది ఎంతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని, వారి ఫిర్యాదులను స్వీకరించి అవసరమైన చోట క్షేత్రస్థాయిలో విచారణ జరిపి న్యాయం జరిగేలా చూడాలని సూచించారు. అప్పుడే ప్రజలకు పోలీస్ శాఖపై పూర్తి నమ్మకం, భరోసా కలుగుతాయని పేర్కొన్నారు. గ్రీవెన్స్ డేలో అందిన ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామని, ఆయా సమస్యల పరిష్కార ప్రగతిని తానే స్వయంగా ఎప్పటికప్పుడు సమీక్షిస్తానని అన్నారు . ప్రజలు తమ సమస్యలను నేరుగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావడానికి ఈ కార్యక్రమం ఒక వేదికగా నిలుస్తుందని అన్నారు.



## ఘనంగా విగ్రహ ప్రతిష్టాపన

**- ప్రత్యేక పూజలు చేసిన చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**

**- కొదురుపాకలో సంతరించుకున్న ఆధ్యాత్మిక శోభా**

**బలగం, బోయినిపల్లి;**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం కొదురుపాక ఆర్ అండ్ ఆర్ కాలనీలో నూతనంగా నిర్మించిన మూడు దేవాలయాలలో విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హాజరై, విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వేద పండితులు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు వేదా ఆశీర్వచనం అందించారు. మూడవరోజు సర్పంచ్ కత్తెరపాక మంజుల-సుధాకర్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీశ్రీశ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి,పార్వతి రాజేశ్వర స్వామి, శివ పంచాయతనం ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం కల్యాణాన్ని వేద పండితుల మంత్రులకు మధ్య అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.కత్తెరపాక-మంజుల సుధాకర్ తెలిపారు.విగ్రహ ప్రతిష్టతో పాటు, నవగ్రహాలు,ధ్వజ స్తంబాలు, ద్వారపాలకులు,జయ,విజయముల,శృంగి,బృంగి దేవత మూర్తుల విగ్రహాలను ప్రతిష్టించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిలను దర్శించుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జోగిని పల్లి వెంకట రామారావు, ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వన్నెల రమణ రెడ్డి, నాయకులు బాలగోని శ్రీనివాస్, నాగుల వంశీ,శాలివాహన శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.



## టపాసులు పేల్చి స్వీట్లు పంపిణీ చేసిన బిజెపి నాయకులు

**బలగం, బోయినిపల్లి;**

ఐదు రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరి రాష్ట్రాలలో భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన శుభ సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో టపాసులు పేల్చి, స్వీట్లు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా మండల అధ్యక్షులు పారశురాం మాట్లాడుతూ:దేశ ప్రజలు అభివృద్ధి, పారదర్శక పాలన, జాతీయ భావజాలానికి మద్దతు తెలుపుతూ మళ్లీ మరోసారి భారతీయ జనతా పార్టీకి ఘన విజయం అందించారు. పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరి రాష్ట్రాలలో వచ్చిన ఈ విజయాలు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వానికి, పార్టీ శ్రమకు నిదర్శనం.ఇది కేవలం ఎన్నికల విజయం మాత్రమే కాదు, దేశంలో జాతీయవాదం, అభివృద్ధి రాజకీయాలకు ప్రజలు ఇచ్చిన మద్దతు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునే విధంగా, ఇంకా మరింత కృషి చేస్తూ ప్రతి వర్గానికి న్యాయం చేసే సంకల్పంతో పార్టీ ముందుకు సాగుతుంది.మండలంలోని ప్రతి కార్యకర్త ఈ విజయాన్ని తమ విజయంగా భావిస్తూ, పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలని కోరుతున్నాను" అని తెలిపారు.

ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కమిటీ సభ్యులు ఉదారి నరసింహ చారి , మండల ప్రధాన కార్యదర్శి రాజేంద్రప్రసాద్ మెరుపుల గంగాధర్ గౌడ్ , మాజీ మండల అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, స్థంబంపెల్లి సర్పంచ్ బొంగుని అశోక్ గౌడ్ , బూరుగుపల్లి సర్పంచ్ పెంచాల సౌమ్య మహేష్ , మండల ఉపాధ్యక్షులు ఇల్లందుల బాలయ్య ,పసికాంతి వెంకటేశం, అన్నేమల్ల మోహన్ బాబు, కందారపు వెంకటేష్ , మోర్చా అధ్యక్షులు శరత్ చంద్ర రెడ్డి, తిప్పర వేణి శ్రీనివాస్, సుంకపాక ప్రభు, సీనియర్ నాయకులు స్వామి కుమార్ , హరీష్ , భాస్కర్ రెడ్డి, సింగర్ వెంకటేష్, శేఖర్ , నిఖిల్ , చంద్రయ్య, కట్ట విజయ్, ముసుగు విజయేందర్ రెడ్డి, మామిడి శెట్టి శ్రీనివాస్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ధర్మపురి గోదావరి పుష్కర ఘాట్ వద్ద కరీంనగర్ జ్యూవెలరీ షాప్ దొంగలు వదిలిన బైక్, హెల్మెట్ లభ్యం..

- సీసీ ఫుటేజీల పరిశీలనలో పోలీసులు

**బలగం టీవీ, జగిత్యాల:**

జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలో ఇటీవల చోటుచేసుకున్న దొంగతన ఘటనకు సంబంధించి కీలక పరిణామాలు వెలుగులోకి వచ్చాయి. కరీంనగర్‌కు చెందిన పీఎంజే జ్యూవెలరీ షాప్‌లో జరిగిన దొంగతనం కేసులో నిందితులు వదిలి వెళ్లినట్లు భావిస్తున్న బైక్ మరియు హెల్మెట్ ధర్మపురి గోదావరి పుష్కర ఘాట్ సమీపంలో లభ్యమయ్యాయి. ఈ నేపథ్యంలో కేసును చేధించేందుకు పోలీసులు చర్యలు వేగవంతం చేశారు. నిన్న సాయంత్రం ప్రత్యేక పోలీస్ బలగాలు ధర్మపురి పట్టణానికి చేరుకుని ప్రధాన కూడళ్లు, ఆర్యవైశ్య సత్రం, బ్రాహ్మణ సంఘ భవనం పరిసర ప్రాంతాలు, తెనుగువాడ తదితర ప్రాంతాల్లో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీలను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

## బయ్యారంలో అంబేద్కర్ విగ్రహం ధ్వంసం

**బలగం టీవీ, బయ్యారం**



మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం సింగారం గ్రామంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేశారు. మంగళవారం ఉదయం విగ్రహం చిన్నాభిన్నమై ఉండటాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందిన వెంటనే గార్ల-బయ్యారం సీఐ రవీందర్ ఆధ్వర్యంలో పోలీసు బృందం గ్రామానికి చేరుకుంది. విగ్రహం ధ్వంసమైన తీరును పరిశీలించి, స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, నిందితుల కోసం గాలింపు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గ్రామంలో ప్రత్యేక పోలీసు బలగాలతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

గత రెండేళ్ల క్రితం ఈ గ్రామంలో అంబేద్కర్ విగ్రహాల ఏర్పాటు విషయంలో రాజకీయ రంగు పులుముకుంది. అప్పట్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు పోటాపోటీగా విగ్రహాల ఏర్పాటుకు సిద్ధం కావడం ఇరువర్గాల మధ్య తీవ్ర వివాదానికి దారితీసింది. దీంతో విగ్రహావిష్కరణ కొన్ని రోజుల పాటు వాయిదా పడగా, ఆ తర్వాత రెండు వర్గాలు వేర్వేరుగా విగ్రహాలను ఆవిష్కరించుకున్నాయి. తాజాగా ధ్వంసమైన విగ్రహాన్ని గతంలో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే హరిప్రియ నాయక్, మాజీ రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ఆవిష్కరించారు. రాజకీయ విభేదాల వల్లే ఈ అకృత్యానికి పాల్పడి ఉంటారని స్థానికంగా చర్చ జరుగుతోంది. ఈ చర్యపై దళిత సంఘాలు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నాయి. దోషులను వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం గ్రామంలో పరిస్థితి అదుపులోనే ఉన్నప్పటికీ, పోలీసులు అప్రమత్తంగా ఉన్నారు.



## తెలంగాణ -- గల్ఫ్ 'వలస మార్గం' లో నూతన అధ్యాయం..

- ఇండియా - ఖతార్ 'లేబర్ మైగ్రేషన్ కారిడార్' లో ఇరు దేశాల్లోని సంఘాల సమన్వయం
- స్వదేశంలో, విదేశంలో పనిచేసే రెండు వేర్వేరు సంఘాల సహకారం...

**వలస కార్మికుల సమస్యల పరిష్కారానికి మార్గం**

**బలగం టీవీ, హైదరాబాద్:**

బిల్డింగ్ అండ్ వుడ్ వర్కర్స్ ఇంటర్నేషనల్ (బిడబ్ల్యూఐ) అనే ప్రపంచం కార్మిక సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో... గ్లోబల్ ఆర్గనైజింగ్ అకాడమీ, ఆసియా పసిఫిక్ అనే సంస్థ ఈనెల 4-5 తేదీల్లో ఫిలిప్పీన్స్ లోని మనీలాలో కార్మిక సంఘాల ప్రతినిధులకు రెండు రోజుల శిక్షణ సమావేశం నిర్వహించింది. 10 దేశాలలోని 22 అనుబంధ సంస్థల నుంచి 42 మంది పాల్గొన్నారు.

ఇండియా -- ఖతార్ 'మైగ్రేషన్ కారిడార్' (వలస మార్గం) లో ఇరు దేశాల్లోని సంఘాల సమన్వయం అనే అంశంపై జరిగిన చర్చలో... తెలంగాణ నుండి ప్రవాసీ మిత్ర లేబర్ యూనియన్ గౌరవ అధ్యక్షులు మంద భీంరెడ్డి, ఖతార్ లోని తెలంగాణ గల్ఫ్ సమితి అధ్యక్షులు మైదం మధు పాల్గొన్నారు. స్వదేశంలో, విదేశంలో పనిచేసే రెండు వేర్వేరు సంఘాలు సమన్వయంతో పనిచేస్తే... వలస కార్మికుల సమస్యలను వేగంగా, సులువుగా ఎలా పరిష్కరించవచ్చునో ఇరువురు నేతలు తమ అనుభవాలను పంచుకున్నారు. ఇద్దరు ప్రవాసీ కార్మిక నాయకులు జగిత్యాల జిల్లావాసులు కావడం విశేషం.

ఖతార్ దేశానికి ఇండియా, నేపాల్, బంగ్లాదేశ్, ఫిలిప్పీన్స్ నుంచి వచ్చిన నిర్మాణరంగ వలస కార్మికులకు మార్గదర్శనం, శిక్షణ ఇవ్వడానికి 'గ్లోబల్ ఆర్గనైజింగ్ అకాడమీ' కృషి చేస్తున్నది. గమ్యస్థాన దేశాల్లోని వలస కార్మిక సమూహాలు, మూలస్థాన దేశాల్లోని బిడబ్ల్యూఐ, అనుబంధ సంస్థల మధ్య సహకారం ఏర్పరచేందుకు ఒక వలస కార్మిక కార్యక్రమాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నారు.



## సిరిసిల్లలో బీజేపీ పట్టణ విస్తృత స్థాయి సమావేశం ఘనంగా నిర్వహణ

- మే 10న ప్రధాని పర్యటన విజయవంతం చేయాలని పిలుపు
- బిజెపి సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

సిరిసిల్ల పట్టణంలోని నెహ్రూ నగర్‌లో ఉన్న కనకదుర్గ ఫంక్షన్ హాల్‌లో భారతీయ జనతా పార్టీ పట్టణ విస్తృత స్థాయి సమావేశం మంగళవారం రో ఘనంగా నిర్వహించబడింది. ఈ సమావేశానికి జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి ఉన్నాను తిరుపతి రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, పార్టీ నాయకులు మరియు కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ బలమే కార్యకర్తల ఐక్యతలో ఉందని, రాబోయే రోజుల్లో ప్రతి కార్యకర్త కట్టుబాటుతో పనిచేస్తే సిరిసిల్లలో పార్టీ మరింత బలపడుతుందని అన్నారు. ముఖ్యంగా మే 10న గౌరవ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పర్యటనను విజయవంతం చేయడం ప్రతి కార్యకర్త బాధ్యతగా భావించాలని పిలుపునిచ్చారు.

సిరిసిల్ల పట్టణ అధ్యక్షులు దుమాల శ్రీకాంత్ మాట్లాడుతూ.. సిరిసిల్ల పట్టణంలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. రాబోయే కార్యక్రమాలలో అందరూ చురుకుగా పాల్గొని పార్టీ విజయానికి తమ వంతు పాత్ర పోషించాలని, ముఖ్యంగా మే 10న జరిగే ప్రధాన మంత్రి పర్యటనను చారిత్రాత్మక విజయంగా నిలపాలని కోరారు. కార్యక్రమంలో మే 10న జరగనున్న ప్రధానమంత్రి పర్యటనకు సంబంధించిన ప్రణాళికలు మరియు కార్యాచరణపై సమగ్రంగా చర్చించారు. ఈ సమావేశం ద్వారా పార్టీ శక్తి, ఐక్యత మరింత బలపడిందని నాయకులు తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు గరిపెల్లి ప్రభాకర్, సీనియర్ నాయకులు రాజాసింగ్, పట్టణ ప్రధాన కార్యదర్శులు మెరుగు శ్రీనివాస్, కొండ నరేష్, మోర శ్రీహరి, సురం వినయ్, శ్రీధర్, శేఖర్, పోశెట్టి, గాలి శ్రీనివాస్, దూడం సురేష్, అనిల్, నరసయ్య, విజయ్, కోడం రవి, కోడం శ్రీనివాస్, బాగయ్య, మొర రవి తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ అడ్మిషన్ల షెడ్యూల్ తాత్కాలికంగా రద్దు

**కొత్త మార్గదర్శకాలతో సవరించిన షెడ్యూల్ త్వరలో**

**బలగం టీవీ, హైదరాబాద్**

రాష్ట్రంలోని జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలకు సంబంధించి విడుదల చేసిన అడ్మిషన్ల షెడ్యూల్‌ను ఇంటర్మీడియేట్ బోర్డు తాత్కాలికంగా రద్దు చేసింది. మే 4న విడుదల చేసిన అడ్మిషన్ షెడ్యూల్ సర్క్యులర్‌ను ఉపసంహరించుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. విద్యా వ్యవస్థలో సంస్కరణలు, పారదర్శకత పెంపు దిశగా కొత్త మార్గదర్శకాలను రూపొందిస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు బోర్డు వెల్లడించింది. తదుపరి ఆదేశాలు వెలువడే వరకు ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలలు ఎలాంటి అడ్మిషన్లు నిర్వహించకూడదని స్పష్టం చేసింది. 2026-27 విద్యాసంవత్సరానికి మే 8 నుంచి అడ్మిషన్లు ప్రారంభించాలని ముందుగా షెడ్యూల్ విడుదల చేసినప్పటికీ, అనంతరం దానిని ఉపసంహరించుకుంది. ఇంటర్ ప్రవేశాలకు సంబంధించి సవరించిన షెడ్యూల్‌ను త్వరలో విడుదల చేస్తామని బోర్డు పేర్కొంది.

# రైతుల సేవకే ప్రాధాన్యం

- ముత్యాల బలరాం రెడ్డి
- నంది మేడారం ప్యాక్స్‌లో పర్సన్ ఇన్‌చార్జిగా బాధ్యతల స్వీకారం

**బలగం టీవీ, ధర్మారం**



వ్యవసాయ పరపతి సహకార సంఘం పదవిలో ఉన్నంతకాలం రైతుల సేవకు పునరంకితం అవుతానని నంది మేడారం ప్యాక్స్ చైర్మన్ ముత్యాల బలరాం రెడ్డి తెలిపారు. మంగళవారం నంది మేడారం సింగిల్ విండో కార్యాలయంలో ఆయన పర్సన్ ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించారు.

రాష్ట్ర ప్రభుత్వం, హైకోర్టు ఆదేశాల మేరకు ప్యాక్స్ చైర్మన్లు పర్సన్ ఇన్‌చార్జీలుగా కొనసాగవచ్చని ఉత్తర్వులు జారీ చేయడంతో ఈ నియామకం జరిగింది. సింగిల్ విండో సీఈఓ మల్లేశం సమక్షంలో బలరాం రెడ్డి తోటి డైరెక్టర్లతో కలిసి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఈఓ మల్లేశం ఆయనను శాలువాతో సత్కరించగా, పలువురు డైరెక్టర్లను కూడా అభినందించారు.

ఈ సందర్భంగా బలరాం రెడ్డి మాట్లాడుతూ, హైకోర్టు ఆదేశాల ప్రకారం బాధ్యతలు చేపట్టడం ఆనందంగా ఉందని తెలిపారు. సింగిల్ విండో పాలకవర్గం గడువు ఉన్నంతవరకు రైతులకు అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం యాసంగి సీజన్‌లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం కొనుగోళ్లు సజావుగా జరిగేలా కృషి చేస్తామని చెప్పారు. కేంద్రాల్లో ఏవైనా సమస్యలు ఉంటే రైతులు తమకు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ సామంతుల రాయమల్లు, డైరెక్టర్లు మోర కొమురయ్య, దీటి శ్రీనివాస్, సాయిరి కుమార్, పాలమాకుల తిరుపతి రెడ్డి, ఈదుల శివకుమార్ రెడ్డి, ఇస్లావత్ రూపానాయక్, సింగిల్ విండో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అహంకారం వీడండి.. ప్రజల్లోకి వెళ్ళండి!



- సొంత ఖర్చులతోనే ప్రభుత్వ పర్యటనలు
- దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి
- కార్యకర్తలకు నారా లోకేష్ పిలుపు
- ఉండవల్లిలో 'కాఫీ కబుర్లు'..

**పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం**

**బలగం టీవీ, అమరావతి**

ప్రభుత్వ పర్యటనల కోసం తాను, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తమ సొంత వాహనాలనే వినియోగిస్తున్నామని, వ్యక్తిగత విదేశీ పర్యటనలకు కూడా సొంత డబ్బునే ఖర్చు చేస్తున్నామని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ స్పష్టం చేశారు. మంగళవారం ఉండవల్లిలోని తన నివాసంలో పార్టీ క్లస్టర్, యూనిట్ ఇన్-ఛార్జులతో నిర్వహించిన 'కాఫీ కబుర్లు' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులకు పలు కీలక సూచనలు చేస్తూ దిశానిర్దేశం చేశారు.

**ఫేక్ ప్రచారాన్ని అడ్డుకోవాలి**


ప్రతిపక్షాలు పనిగట్టుకుని ప్రభుత్వంపై, తమపై తప్పుడు ప్రచారం చేస్తున్నాయని లోకేష్ మండిపడ్డారు. "మేము ప్రజలకు, పార్టీకి పూర్తి జవాబుదారీగా ఉంటున్నాం. సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారాన్ని కార్యకర్తలు వాస్తవ సమాచారంతో వెనువెంటనే తిప్పికొట్టాలి" అని పిలుపునిచ్చారు. పార్టీ కేడర్ అత్యంత అప్రమత్తంగా ఉంటూ సోషల్ మీడియాను సమర్థవంతంగా వాడుకోవాలని సూచించారు.

నాయకులు, కార్యకర్తలు ఎట్టి పరిస్థితుల్లోనూ అహంకారం ప్రదర్శించకూడదని లోకేష్ హితవు పలికారు. "గత ఎన్నికల్లో 151 సీట్ల నుంచి 11 సీట్లకు పడిపోవడానికి గొడ్డలి పార్టీ (వైసీపీ) వారి అహంకారమే కారణం. మనం ఆ తప్పు చేయకూడదు. మంచి మాటలతో ప్రజల మనసులు గెలవాలి. అప్పుడే ప్రజలు మనల్ని మళ్లీ మళ్లీ గెలిపిస్తారు" అని అన్నారు.

ప్రభుత్వం అమలు చేస్తున్న వినూత్న పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని ఆయన అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.4 వేల పింఛను ఇస్తున్న ఏకైక రాష్ట్రం మనదే. తల్లికి వందనం కింద రూ.15 వేలు, ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నాం. పోలవరం పనులు వేగవంతం కావడం, అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్న తీరును ప్రజలకు వివరించాలి.

పార్టీలో పనిచేసే వారికే గుర్తింపు ఉంటుందని లోకేష్ హెచ్చరించారు. ప్రతి మూడు నెలలకోసారి చంద్రబాబు నాయుడు నేరుగా పనితీరును సమీక్షిస్తారని, పనిచేయని వారి పదవులు ఊడతాయని స్పష్టం చేశారు. పార్టీలో ఇప్పుడు ఎలాంటి కోటరీలు లేవని, సామాన్య కార్యకర్త కూడా అధినేతను కలిసే అవకాశం ఉందన్నారు. క్రమశిక్షణ ఉల్లంఘిస్తే సహించేది లేదని, అంతర్గత విభేదాల వల్ల పార్టీకి నష్టం కలిగించవద్దని కోరారు.

2027 నాటికి రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో పర్యటిస్తానని లోకేష్ ప్రకటించారు. "కార్యకర్తలపై పెట్టిన అక్రమ కేసులను తొలగిస్తాం. ఉపాధి హామీ పెండింగ్ బిల్లులను క్లియర్ చేస్తాం. బీజేపీ వంటి పార్టీలు దీర్ఘకాలం అధికారంలో ఉండేందుకు అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేస్తున్నాం" అని పేర్కొన్నారు. కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని ఆయన భరోసా ఇచ్చారు.



## ఓడినా.. ప్రజల మధ్యే స్టాలిన్!

**ఫలితాలు వచ్చిన 24 గంటల్లోనే నియోజకవర్గంలో పర్యటన**

**కొళత్తూరుతో నాది గెలుపోటములకు అతీతమైన బంధం**

**నా విధిని నిర్వర్తించాననే సంతృప్తి ఉంది: ఆపద్ధర్మ సీఎం స్పష్టీకరణ**

**బలగం టీవీ, చెన్నై**

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే అనూహ్య ఓటమిని చవిచూసినప్పటికీ, ఆ పార్టీ అధినేత ఎం.కె. స్టాలిన్ తన హుందాతనాన్ని చాటుకున్నారు. కొళత్తూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసి టీవీకే అభ్యర్థి వీఎస్ బాబు చేతిలో 8 వేలకు పైగా ఓట్ల తేడాతో ఓడిపోయిన స్టాలిన్, ఫలితాలు వెలువడిన 24 గంటల లోపే తన నియోజకవర్గంలో పర్యటించి అందరినీ ఆశ్చర్యపరిచారు.

గత మూడు పర్యాయాలుగా తనను ఆదరించి, ఎమ్మెల్యేగా గెలిపించిన కొళత్తూరు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపేందుకు ఆయన స్వయంగా వారి వద్దకు వెళ్లారు. నియోజకవర్గ ప్రజలతో ముఖాముఖి మాట్లాడి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనకు సంబంధించిన ఫొటోలను ఆయన 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా పంచుకుంటూ భావోద్వేగపూరితమైన సందేశాన్ని ఇచ్చారు.

"కొళత్తూరు ప్రజలతో నాకున్న అనుబంధం ఎన్నికల ఫలితాలతో ముగిసేది కాదు. గత 15 ఏళ్ళుగా ఈ నియోజకవర్గం నాకు వెన్నంటి నిలిచింది. గెలుపోటములకు అతీతంగా నేను ఎప్పుడూ మీకు అందుబాటులోనే ఉంటాను." - ఎం.కె. స్టాలిన్

నియోజకవర్గంలో పర్యటిస్తున్న సమయంలో తాను చేసిన అభివృద్ధి పనులను చూసి గర్వపడుతున్నానని స్టాలిన్ పేర్కొన్నారు. ఆదర్శ నియోజకవర్గం: తన శక్తి మేర అభివృద్ధి పథకాలను అమలు చేసి, కొళత్తూరును రాష్ట్రానికే ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేశానని చెప్పారు.

మౌలిక సదుపాయాలు: నియోజకవర్గంలోని ప్రతి వీధిలో ఏర్పాటు చేసిన పార్కులు, లైబ్రరీలు, క్రీడా మైదానాలు, ఆసుపత్రులు, పాఠశాలలు, కళాశాలలు తన పనితీరుకు నిదర్శనమని వివరించారు. కర్తవ్య పాలన: ప్రజల సమస్యలను పరిష్కరించడంలో తాను విఫలం కాలేదని, ఒక ప్రజా ప్రతినిధిగా తన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాననే సంతృప్తి కలిగిందని పేర్కొన్నారు.

ప్రస్తుతం ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా ఉన్న స్టాలిన్, నియోజకవర్గ ప్రజలకు ఏ అవసరం వచ్చినా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. పదవి ఉన్నా లేకపోయినా ప్రజా సేవలో నిరంతరం కొనసాగుతానని స్పష్టం చేశారు. ఓడిపోయిన వెంటనే ప్రజల వద్దకు వెళ్లడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.



## ఫీజు రీయంబర్స్ మెంట్ ఎత్తివేస్తే ఊరుకోం!

**జూన్‌లో 5 లక్షల మందితో హైదరాబాద్ ముట్టడి**

**నగదు బదిలీ పేరుతో విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలు**

**బడ్జెట్ లేదనడం పచ్చి అబద్ధం: ఎంపీ ఆర్.కృష్ణయ్య ధ్వజం**

**బలగం టీవి, హైదరాబాద్**

రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయంబర్స్ మెంట్ పథకాన్ని ఎత్తివేయాలని చూస్తోందని, ఈ కుట్రను మానుకోకపోతే జూన్ చివరి వారంలో 5 లక్షల మందితో హైదరాబాద్‌ను ముట్టడిస్తామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. మంగళవారం ముషీరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన ఈ 30 నెలల కాలంలో బడ్జెట్ విడుదల చేయకుండా ప్రభుత్వం విద్యార్థులకు తీవ్ర అన్యాయం చేస్తోందని మండిపడ్డారు.

ప్రభుత్వం చెబుతున్న బడ్జెట్ కొరత సాకు కేవలం బుకాయింపు మాత్రమేనని కృష్ణయ్య విమర్శించారు. "గడిచిన 30 నెలల్లో పన్నుల ద్వారా 6 లక్షల కోట్ల ఆదాయం వచ్చింది, మరో 3.60 లక్షల కోట్లు అప్పుగా తెచ్చారు. కాంట్రాక్టర్లకు వేల కోట్ల బిల్లులు చెల్లించడానికి నిధులు ఉంటాయి కానీ, 14 లక్షల మంది విద్యార్థుల కోసం 8 వేల కోట్లు విడుదల చేయడానికి మనసు రావడం లేదు" అని ధ్వజమెత్తారు. వెనుకబడిన కులాలు చదువుకుంటే ప్రభుత్వం ఓర్వలేకపోతోందని ఆయన ఆరోపించారు.

జీవో నెంబర్ 7 ద్వారా ఫీజు రీయంబర్స్ మెంట్ పథకాన్ని అటకెక్కించే ప్రయత్నం జరుగుతోందని కృష్ణయ్య ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కొత్త విధానం వల్ల కాలేజీ యాజమాన్యాలు విద్యార్థుల నుంచి ముక్కుపిండి ఫీజులు వసూలు చేసే ప్రమాదం ఉంది. స్కాలర్షిప్పులను మూడు నాలుగేళ్ల తర్వాత విడుదల చేయడం వల్ల విద్యార్థులు చదువు పూర్తయినా ఇబ్బందులు పడుతున్నారు. నగదు బదిలీ పేరుతో కాలయాపన చేయకుండా, పాత బకాయిలను తక్షణమే చెల్లించి పథకాన్ని యథాతథంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వం తన వైఖరి మార్చుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని కృష్ణయ్య హెచ్చరించారు. "జూన్ నెల నుంచి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతాం. మంత్రులను, ఎమ్మెల్యేలను గ్రామాల్లో తిరగనివ్వం, వారిని ఘెరావ్ చేస్తాం. నేరుగా ముఖ్యమంత్రి నివాసాన్నే ముట్టడిస్తాం" అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు నీలా వెంకటేష్, మోడీ రాందేవ్ తదితరులు పాల్గొని తమ మద్దతు ప్రకటించారు.

# ఢిల్లీ కోటలో చెన్నై జోరు!

**8 వికెట్ల తేడాతో క్యాపిటల్స్ చిత్తు**

**సంజూ శాంసన్ (87) మెరుపు ఇన్నింగ్స్**

**ప్లేఆఫ్స్ దిశగా సీఎస్‌కే మరో అడుగు**

**బలగం టీవి, హైదరాబాద్**

ఐపీఎల్-19లో చెన్నై సూపర్ కింగ్స్ (జూఖ) వరుస విజయాలతో దూసుకుపోతోంది. మంగళవారం ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో చెన్నై అన్ని విభాగాల్లోనూ ఆధిపత్యం ప్రదర్శించి 8 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. తద్వారా ఈ సీజన్‌లో ఐదో విజయాన్ని తన ఖాతాలో వేసుకుని ప్లేఆఫ్స్ రేసును మరింత ఆసక్తికరంగా మార్చింది. ఢిల్లీ నిర్దేశించిన 156 పరుగుల లక్ష్యాన్ని సీఎస్‌కే కేవలం 17.3 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి ఛేదించింది.

**శాంసన్ వీరవిహారం**

ఛేదనలో ఓపెనర్ సంజూ శాంసన్ అద్భుత బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. పిచ్ బౌలింగ్‌కు సహకరిస్తున్నా, ఆరంభంలో ఆచితూచి ఆడిన సంజూ.. ఆ తర్వాత గేర్ మార్చి ఢిల్లీ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. కేవలం 52 బంతుల్లో 7 ఫోర్లు, 6 సిక్సర్లతో 87 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. అతడికి తోడుగా కార్తీక్ శర్మ (31 బంతుల్లో 41 నాటౌట్) రాణించడంతో చెన్నై విజయం నల్లేరుపై నడకలా సాగింది. వీరిద్దరూ మూడో వికెట్‌కు అజేయ భాగస్వామ్యాన్ని నెలకొల్పి మ్యాచ్‌ను ముగించారు.

**తేలిపోయిన ఢిల్లీ బ్యాటర్లు**

అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఢిల్లీ క్యాపిటల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 155 పరుగులు మాత్రమే చేయగలిగింది.

స్పిన్ ఉచ్చు: చెన్నై స్పిన్నర్ నూర్ అహ్మద్ (2/22) తన మాయాజాలంతో ఢిల్లీ బ్యాటర్లను కట్టడి చేశాడు. అకీల్, ముకేశ్ కూడా పొదుపుగా బౌలింగ్ చేసి వికెట్లు పడగొట్టారు.



రిజ్వీ పోరాటం: ఒక దశలో 69 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి కష్టాల్లో ఉన్న ఢిల్లీని సమీర్ రిజ్వీ (40లి), ట్రిస్టన్ స్టబ్స్ (38) ఆదుకున్నారు. ఆఖర్లో అశుతోష్ శర్మ రెండు సిక్సర్లతో మెరిసినా.. అది గౌరవప్రదమైన స్కోరుకే సరిపోయింది.

**రేసులో సీఎస్‌కే ముందంజ**

ఈ విజయంతో చెన్నై ప్లేఆఫ్స్ అవకాశాలు మెరుగుపడగా, ఆరో ఓటమితో ఢిల్లీ క్యాపిటల్స్ పరిస్థితి ఆందోళనకరంగా మారింది. అద్భుత ఇన్నింగ్స్ ఆడిన సంజూ శాంసన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది.

**సంక్షిప్త స్కోర్లు:**

ఢిల్లీ క్యాపిటల్స్: 20 ఓవర్లలో 155/7 (సమీర్ రిజ్వీ 40 నాటౌట్, ట్రిస్టన్ స్టబ్స్ 38; నూర్ అహ్మద్ 2/22, ముకేశ్ 1/31).

చెన్నై సూపర్ కింగ్స్: 17.3 ఓవర్లలో 159/2 (సంజూ శాంసన్ 87 నాటౌట్, కార్తీక్ శర్మ 41 నాటౌట్; అక్షర్ పటేల్ 1/25, ఎంగిడి 1/30).

ఫలితం: చెన్నై 8 వికెట్ల తేడాతో విజయం.

# పాండ్యా భవితవ్యంపై చర్చ..!?



**బలగం టీవి, న్యూఢిల్లీ**

ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన ముంబై ఇండియన్స్ జట్టుకు 2024లో కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టినప్పుడు హార్దిక్ పాండ్యాకు ముందున్న సవాళ్లు ఏంటో అతనికి బాగా తెలుసు. అంతకుముందు గుజరాత్ టైటాన్స్‌ను 2022లో విజేతగా, 2023లో రన్నరప్‌గా నిలిపి తన నాయకత్వ పటిమను నిరూపించుకున్నాడు. కానీ, ముంబైకి తిరిగి వచ్చాక పరిస్థితి పూర్తిగా మారిపోయింది. 2024 సీజన్‌లో ముంబై పట్టికలో అట్టడుగు స్థానంలో నిలవగా, 2025లో నాలుగో స్థానానికి చేరుకుని కాస్త మెరుగుపడింది. అయితే, ప్రస్తుత 2026 సీజన్ ముంబైని మరింత సంక్షోభంలోకి నెట్టింది. ఇప్పటివరకు ఆడిన 10 మ్యాచ్‌ల్లో కేవలం 3 విజయాలు మాత్రమే సాధించి, ప్లేఆఫ్స్ రేసు నుంచి దాదాపు నిష్క్రమించే స్థితికి చేరుకుంది. 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' నివేదిక ప్రకారం, ముంబై ఇండియన్స్ యాజమాన్యం ఇప్పటికీ హార్దిక్ పాండ్యాకే మద్దతుగా నిలుస్తోంది. జట్టు వైఫల్యానికి అతని నాయకత్వమే కారణమని వారు భావించడం లేదు. దానికి బదులుగా, ఐపీఎల్‌లో మారుతున్న ఆట తీరుకు జట్టు త్వరగా అలవాటు పడలేకపోవడమే ప్రధాన కారణమని వారు విశ్లేషిస్తున్నారు. ముఖ్యంగా పవర్ ప్లేలో ఓపెనర్ల నుంచి లభించాల్సిన మెరుపు ఆరంభాలు, డెత్ ఓవర్లలో బౌలర్ల ప్రభావం తగ్గడం వంటి అంశాలే జట్టును దెబ్బతీశాయని మేనేజ్‌మెంట్ భావిస్తోంది. మరోవైపు, మాజీ క్రికెటర్ సైమన్ డౌల్ రాబోయే మెగా వేలం గురించి ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. "వచ్చే ఏడాది మీ కెప్టెన్ ఎవరు? అనేది ముంబై ఆలోచించుకోవాలి. ఒకవేళ హార్దిక్ పాండ్యా కెప్టెన్‌గా కొనసాగకపోతే,

అతన్ని వేలంలోకి వదిలేయడమే మంచిది. ఎందుకంటే, గత మూడు ఏళ్లుగా తను, తన జట్టు ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. అటువంటి వాతావరణంలో, కెప్టెన్సీ పోయిన తర్వాత అతను ఎలా ఆడతాడో చెప్పడం కష్టం" అని డౌల్ పేర్కొన్నాడు. కెప్టెన్సీ భారం తగ్గితే హార్దిక్ తన పాత ఫామ్‌ను తిరిగి సాధించగలరా? అన్న ప్రశ్నకు డౌల్ స్పందిస్తూ.. "అది అతనికి స్వేచ్ఛను ఇవ్వవచ్చు లేదా నేను విఫలమయ్యాను అనే భావనను కలిగించవచ్చు. హార్దిక్ ఫిట్‌గా ఉంటే ప్రపంచంలోనే అత్యుత్తమ ఆల్ రౌండర్లలో ఒకడు. అతను కెప్టెన్ కాకపోయినా, తన ఆటపై పూర్తి దృష్టి పెట్టి మళ్ళీ 'గ్రేట్ హార్దిక్'గా నిరూపించుకోవడానికి సిద్ధంగా ఉన్నాడా లేదా అన్నదే ఇక్కడ అసలు ప్రశ్న" అని విశ్లేషించారు. ప్రస్తుతానికి ముంబై మేనేజ్‌మెంట్ హార్దిక్‌కు అండగా ఉన్నప్పటికీ, సీజన్ ముగిశాక మెగా వేలం నేపథ్యంలో ఎలాంటి కఠిన నిర్ణయాలు తీసుకుంటారో వేచి చూడాలి.

# ర్యాంకింగ్స్‌లో ఆధిపత్యాన్ని చాటుకున్న భారత జట్టు

**బలగం టీవి, న్యూఢిల్లీ**

ఐసీసీ తాజాగా విడుదల చేసిన టీ20 ఇంటర్నేషనల్ ర్యాంకింగ్స్‌లో భారత జట్టు తన ఆధిపత్యాన్ని చాటుకుంది. మంగళవారం ప్రకటించిన తాజా జాబితా ప్రకారం.. టీమిండియా ప్రపంచ నంబర్-1 స్థానాన్ని పదిలపరుచుకుంది. ఈ ఏడాది మార్చిలో శ్రీలంకతో కలిసి సంయుక్తంగా నిర్వహించిన టీ20 ప్రపంచకప్‌లో విజేతగా నిలిచిన భారత్.. ఆ ఘనతతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానాన్ని సుస్థిరం చేసుకుంది. వరుసగా రెండోసారి ప్రపంచ కప్ టైటిల్‌ను గెలుచుకుని చరిత్ర సృష్టించిన టీమిండియా.. ప్రస్తుతం 275 రేటింగ్ పాయింట్లతో నంబర్ 1గా కొనసాగుతోంది.ఈ ర్యాంకింగ్స్‌లో ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా జట్లు తర్వాతి స్థానాల్లో నిలిచాయి. ఇంగ్లాండ్ 262 పాయింట్లతో రెండో స్థానంలో ఉండగా.. ఆస్ట్రేలియా 258 పాయింట్లతో మూడో స్థానానికి చేరుకుంది. ఇంగ్లాండ్‌తో పోలిస్తే ఆస్ట్రేలియా పాయింట్ల తేడా చాలా తక్కువగా ఉండటం గమనార్హం. మే 2025 తర్వాత ఆడిన మ్యాచ్‌లకు 100 శాతం.. అంతకుముందు రెండేళ్ల మ్యాచ్‌లకు 50 శాతం వెయిటేజీ ఇచ్చి ఈ ర్యాంకింగ్స్‌ను నిర్ణయించినట్లు ఐసీసీ వెల్లడించింది. మొదటి ఏడు స్థానాల్లో ఎటువంటి మార్పులు లేవు. న్యూజిలాండ్ (4), దక్షిణాఫ్రికా (5), పాకిస్థాన్ (6), వెస్టిండీస్ (7) తమ స్థానాలను కాపాడుకున్నాయి. అయితే ఎనిమిదో స్థానం కోసం జరిగిన పోరులో బంగ్లాదేశ్ పైచేయి సాధించింది. శ్రీలంక 6 రేటింగ్ పాయింట్లను కోల్పోయి 9వ స్థానానికి పడిపోగా.. బంగ్లాదేశ్ (225 పాయింట్లు) ఓ మెట్టు పైకి ఎగబాకి 8వ స్థానాన్ని దక్కించుకుంది. అఫ్గానిస్థాన్ 220 పాయింట్లతో 10వ స్థానంలో ఉంది. మరోవైపు ఉత్తర అమెరికాలో క్రికెట్ ఎదుగుదలకు నిదర్శనంగా అమెరికా జట్టు ఏకంగా రెండు స్థానాలు ఎగబాకి 13వ స్థానానికి చేరుకుంది. నెదర్లాండ్స్, స్కాట్లాండ్ వంటి జట్లను వెనక్కి నెట్టి అమెరికా ఈ ఘనత సాధించడం విశేషం. చివరగా ఐసీసీ ర్యాంకింగ్స్‌లో జట్ల సంఖ్య 102 నుంచి 98కి తగ్గింది. గత



మూడేళ్లలో కనీసం ఎనిమిది టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడని కారణంగా ఫిజీ, గాంబియా, గ్రీస్, ఇజ్రాయెల్ జట్లు ఈ జాబితా నుంచి తప్పుకున్నాయి. జింబాబ్వే (11), ఐర్లాండ్ (12) స్థానాల్లో ఉండగా, నేపాల్ (17), ఒమన్ (19) జట్లు ఒక్కో స్థానాన్ని మెరుగుపరుచుకున్నాయి. కెనడా జట్టు 20వ స్థానంలో నిలిచింది. టీమిండియా తన ఫామ్‌ను ఇలాగే కొనసాగిస్తే మరికొంత కాలం అగ్రస్థానంలో ఉండటం ఖాయంగా కనిపిస్తోంది.

# బుమ్రా వరుస వైఫల్యాలు

**బలగం టీవి, న్యూఢిల్లీ**



2026 ఐపీఎల్? సీజన్ ముంబయి ఇండియన్స్? స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రాకు పెద్దగా కలిసి రావడం లేదు. ముప్పావు వంతు సీజన్? ముగిసనా ఇప్పటిదాకా అతడి నుంచి ఆశించిన రేంజ్ పర్ఫార్మెన్స్ రాలేదు. ప్రపంచంలోనే టాప్ క్లాస్ బౌలరైన బుమ్రా ఇలా వరుసగా విఫలమవుతుండడంపై అభిమానులు కూడా ఆందోళన చెందుతున్నారు. అసలు అతడికి ఏమైందంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. ఫిట్?నెస్ పరంగా ఎలాంటి ఇబ్బంది లేకపోయినా ఇలా బౌలింగ్ చేయడంపై అనేక సందేహాలు తలెత్తుతున్నాయి. ఈ క్రమంలో మాజీ క్రికెటర్ సునీల్ గావస్కర్ దీనిపై స్పందించాడు. బుమ్రా ఈ సీజన్?లో విఫలమవుతుండానికి గల కారణాలు వెల్లడించాడు.బుమ్రా ప్రయత్నంలో ఎలాంటి లోపం లేదని గావస్కర్ అన్నాడు. అతడు ప్రతీ మ్యాచ్?లో ముందు వికెట్లు పడగొట్టడానికే కృషి చేస్తున్నాడని అన్నాడు. అయితే అతను మరీ ఎక్కువగా ప్రయత్నించడం వల్ల తన నేచురాలిటీని కోల్పోతున్నాడని గావస్కర్ అభిప్రాయపడ్డాడు. ఈ మేరకు తాజాగా ఐపీఎల్ ఓటీటీ పార్ట్?నర్? జియోస్టార్?లో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశాడు. "బుమ్రా తన అత్యుత్తమ ప్రదర్శననే ఇస్తున్నాడు. కానీ, అతడు మరీ ఎక్కువ అదనపు ప్రయోగాలు చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు కనిపిస్తోంది. అతడు వికెట్లు తీసే అవకాశాలను సృష్టిస్తున్నాడు. కానీ అతడికి కలిసిరావట్లేదు. ముఖ్యంగా బుమ్రాలో బౌలింగ్ వేగం కూడా తగ్గింది. అతడు 'స్లో బాల్' కు స్పెషలిస్ట్. అయితే స్లో బంతులు సంధించనప్పుడు లెంగ్త్ కాస్త మరీ ముందుకు పడుతోంది. ఇదివరకు బుమ్రా లైన్ అండ్ లెంగ్త్ సరిగ్గా ఉండేది" "ఇప్పుడు బంతి లెగ్ స్టంప్ వైపునకు జరుగుతోంది. సాధారణంగా బుమ్రా నో బాల్ వేయడు. కానీ ఈ సీజన్‌లో అతను ఇప్పటికే దాదాపు ఏడు నో బాల్స్ వేశాడు. బుమ్రా చేస్తున్న ప్రయోగాలు అతని లయను దెబ్బతీస్తున్నాయి. దీంతో కీలక దశలో అతడు ప్రభావం చూపించలేకపోతున్నాడు. చిన్న విషయాలను కూడా మరీ సంక్లిష్టంగా మారుస్తున్నాడు. అదే అతడికి నష్టం కలిగిస్తోంది. అందుకే బుమ్రా మళ్లీ తన బేసిక్స్?కు తిరిగి వెళ్లాలి. కొత్త విషయాలను ప్రయత్నించడం అతని లయపై ప్రభావం చూపుతోంది. పైగా అదృష్టం కలిసిరావట్లేదు" అని గావస్కర్ అన్నాడు. బుమ్రాకు కొంత విశ్రాంతినివ్వాలని భారత మాజీ బ్యాటింగ్ కోచ్ సంజయ్ బంగర్ అన్నాడు. "బుమ్రా విషయంలో యాజమాన్యం ఆలోచించాలి. అతడు 100 శాతం శారీరకంగా ఫిట్?గా ఉన్నాడా? అని అతడితో కూర్చొని చర్చించాలి. ఒకవేళ ఫిట్?గా లేడని భావిస్తే 'ఒకట్రెండు మ్యాచ్?లు విశ్రాంతి తీసుకోవాలనుకుంటున్నారా?' అని అడగాలి కూడా. శారీరకంగా, మానసికంగా తనను తానుగా కమ్?బ్యాక్ ఇవ్వడానికి బుమ్రా కొంతకాలం ఆటకు దూరంగా ఉంటే ప్రయోజనం కలుగవచ్చు" అని సంజయ్ బంగర్ పేర్కొన్నాడు. ప్రస్తుత సీజన్?లో బుమ్రా 10 మ్యాచ్‌ల్లో ఆడాడు. ఇందులో 37 ఓవర్లు బౌలింగ్ చేసిన బుమ్రా 8.89 ఎకానమీతో 329 పరుగులు ఇచ్చుకున్నాడు. కేవలం మూడే వికెట్లు పడగొట్టాడు. తాజాగా లఖ్?నవూ సూపర్ జెయింట్స్?తో మ్యాచ్?లోనూ నాలుగు ఓవర్లలో 45 పరుగులు ఇచ్చాడు. ఇందులో ఏకంగా మూడు వైడ్లు, మూడు నో బాల్స్ వేశాడు. ఒక్క వికెట్ కూడా పడగొట్టలేదు.



# రూ.27 కోట్లకు రిషభ్ పంత్‌కు సంబంధం లేదు


**లక్నో సూపర్ జెయింట్స్ హెడ్ కోచ్ జస్టిన్ లాంగర్**

**బలగం టీవి, న్యూఢిల్లీ**

ఐపీఎల్ 2026 సీజన్‌లో పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడుతున్న లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్ రిషభ్ పంత్‌కు ఆ జట్టు హెడ్ కోచ్ జస్టిన్ లాంగర్ అండగా నిలిచాడు. అతని ప్రైజ్ ట్యాగ్‌తో ఆటను పోల్చడం సరికాదని అభిప్రాయపడ్డాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో రిషభ్ పంత్ 9 ఇన్నింగ్స్‌ల్లో 128.30 స్ట్రైక్‌రేట్‌తో 204 పరుగులు మాత్రమే చేశాడు. కెప్టెన్‌గానూ అతను రాణించలేకపోతున్నాడు. దాంతో లక్నో 9 మ్యాచ్‌ల్లో 7 పరాజయాలతో ప్లే ఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించింది. ఐపీఎల్ 2025 సీజన్‌లో ఆల్‌టైమ్ రికార్డ్ ధర రూ.27 కోట్లతో లక్నోలోకి వచ్చిన రిషభ్ పంత్‌కు సారథ్య బాధ్యతలు అప్పగించారు. కానీ ఐపీఎల్ 2025 సీజన్‌తో పాటు తాజా సీజన్‌లోనూ పంత్ తీవ్రంగా నిరాశపర్చాడు. అటు కెప్టెన్సీతో పాటు ఇటు బ్యాటర్‌గా విఫలమయ్యాడు. ఐపీఎల్ 2025 సీజన్‌లో పంత్ 14 మ్యాచ్‌ల్లో 260 పరుగులే చేశాడు. ఈ క్రమంలోనే రిషభ్ పంత్‌ను కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పించాలని మాజీ క్రికెటర్లు డిమాండ్ చేస్తున్నారు. జస్టిన్ లాంగర్ మాత్రం రిషభ్ పంత్ తమ కెప్టెన్‌గా కొనసాగుతాడని స్పష్టం చేశాడు. కెప్టెన్సీ అనేది చాలా కఠినమైదని, ఎంతో ఒత్తిడిని తట్టుకోవాల్సి ఉంటుందని లాంగర్ పేర్కొన్నాడు. 'నిజాయితీగా చెప్పాలంటే పంత్ ప్రదర్శనకు డబ్బుతో ఏ మాత్రం సంబంధం లేదని నా అభిప్రాయం. సారథ్యం అనేది ఒక కఠినమైన బాధ్యత. ఎంతో ఒత్తిడిని మోయాల్సి ఉంటుంది. ఆ విషయం పంత్‌కు బాగా తెలుసు. జట్టు కోసం అతను ఎంతో ఒత్తిడిని భరిస్తున్నాడు. మా అందరిలాగే 98 శాతం సమయం అతను చిరునవ్వుతోనే ఆ బాధ్యతను నిర్వర్తిస్తాడు. మిగిలిన 2 శాతం సమయం మాత్రం పరిస్థితి కాస్త కఠినంగా ఉంటుంది. అయినప్పటికీ పంత్ తన ప్రయత్నాన్ని కొనసాగిస్తూనే ఉన్నాడు. తీవ్రంగా శ్రమిస్తున్నాడు. ఈ సీజన్ ఆరంభంలోనే జట్టుకు విజయాన్ని అందించే ఒక అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. అతను నవ్వుతూ తనదైన శైలిలో దూకుడుగా ఆడినప్పుడు మాకు ఎంతో సంతోషంగా అనిపిస్తుంది. ఆ స్థాయి ప్రదర్శనకు అతను ఎంతో దూరంలో లేడు. ఇటీవల ప్రాక్టీస్ మ్యాచ్‌లో 30 బంతుల్లోనే 95 పరుగులు చేశాడు. దీనిబట్టి పంత్ త్వరలోనే ఫామ్‌లోకి వస్తాడనే నమ్మకం ఉంది.'అని జస్టిన్ లాంగర్ చెప్పుకొచ్చాడు.

# ఐపీఎల్‌లో రోహిత్ శర్మ సరికొత్త చరిత్ర..!

**బలగం టీవి, న్యూఢిల్లీ**



భారత క్రికెట్ దిగ్గజం, ముంబై ఇండియన్స్ మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ ఐపీఎల్ చరిత్రలో మరో అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకున్నాడు. వాంఖడే స్టేడియం వేదికగా జరిగిన ఉత్కంఠభరిత పోరులో రోహిత్ తన బ్యాటింగ్‌తో విరుచుకుపడటమే కాకుండా, అత్యధిక మ్యాచ్‌లు ఆడిన ఆటగాడిగా విరాట్ కోహ్లీని వెనక్కి నెట్టాడు. ప్రస్తుతం ఈ రికార్డు రేసు ఆసక్తికరంగా మారింది.సోమవారం లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్ రోహిత్ శర్మకు ఐపీఎల్ కెరీర్‌లో 277వ మ్యాచ్. ఈ మ్యాచ్‌తో ఆయన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ (276 మ్యాచ్‌లు) రికార్డును అధిగమించాడు. ప్రస్తుతం ఐపీఎల్‌లో అత్యధిక మ్యాచ్‌లు ఆడిన ఆటగాళ్ల జాబితాలో చెన్నై సూపర్ కింగ్స్ దిగ్గజం ఎంఎస్ ధోనీ 278 మ్యాచ్‌లతో అగ్రస్థానంలో ఉన్నాడు. ధోనీ రికార్డుకు రోహిత్ కేవలం ఒక్క అడుగు దూరంలోనే ఉండటం విశేషం.ముంబై ఇండియన్స్ తుది జట్టులోకి తిరిగి వచ్చిన రోహిత్ శర్మ, తన పునరాగమనాన్ని ఘనంగా చాటుకున్నాడు. కేవలం 44 బంతుల్లోనే 84 పరుగులు సాధించి ప్రత్యర్థి బౌలర్లను ముప్పుతిప్పలు పెట్టాడు. ఇందులో 7 కళ్లు చెదిరే సిక్సర్లు, 6 ఫోర్లు ఉన్నాయి. 190.91 స్ట్రైక్ రేట్‌తో రోహిత్ ఆడిన ఈ ఇన్నింగ్స్ వంఖడే ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. తన ట్రేడ్‌మార్క్ పుల్ షాట్లు, రిస్ట్ ఫ్లిక్స్‌తో స్టేడియంను హోరెత్తించాడు.ప్రస్తుతం ఎంఎస్ ధోనీ 278 మ్యాచ్‌లతో మొదటి స్థానంలో ఉన్నప్పటికీ, ఆయన ఈ సీజన్‌లో పిక్క కండరాల గాయం కారణంగా ఇంకా బరిలోకి దిగలేదు. ఇదే తరుణంలో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలు వరుసగా మ్యాచ్‌లు ఆడుతుండటంతో, త్వరలోనే ధోనీని వెనక్కి నెట్టి వీరిద్దరూ అగ్రస్థానానికి చేరుకునే అవకాశం ఉంది. 39 ఏళ్ల వయసులోనూ రోహిత్ చూపుతున్న ఫిట్‌నెస్, ఫామ్ చూస్తుంటే, ఆయన మరిన్ని రికార్డులను తిరగరాయడం ఖాయంగా కనిపిస్తోంది. తొలుత బ్యాటింగ్ చేసిన లక్నో సూపర్ జెయింట్స్ భారీ స్కోరు సాధించింది. వెస్టిండీస్ స్టార్ నికోలస్ పూరన్ కేవలం 21 బంతుల్లో 63 పరుగులు చేసి ఇన్నింగ్స్‌కు ఊపునిచ్చాడు. ఆస్ట్రేలియా ఓపెనర్ మిచెల్ మార్ష్ 44 పరుగులు జోడించాడు. అయితే, ముంబై బౌలర్ కోర్బిన్ బాష్ ఒకే ఓవర్లో వీరిద్దరినీ అవుట్ చేసి బ్రేక్ ఇచ్చాడు. ఆ తర్వాత ఐడెన్ మార్క్రామ్ (31 నాటౌట్), హిమ్మత్ సింగ్ (40 నాటౌట్) రాణించడంతో లక్నో గౌరవప్రదమైన స్కోరు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనలో రోహిత్ శర్మ అందించిన మెరుపు ఆరంభంతో ముంబై విజయం సులువైంది. సూర్యకుమార్ యాదవ్ (12), తిలక్ వర్మ (11) తక్కువ పరుగులకే వెనుదిరిగినప్పటికీ.. నమన్ ధీర్ (23), విల్ జాక్స్ (10 నాటౌట్) సమయోచితంగా ఆడి జట్టును విజయతీరాలకు చేర్చారు. విల్ జాక్స్ సిక్సర్‌తో మ్యాచ్ ముగించడం విశేషం. అభిమానులకు కంటి నిండా వినోదాన్ని పంచుతోంది. రోహిత్ శర్మ ఫామ్‌లోకి రావడం ముంబై ఇండియన్స్‌కు కొండంత బలాన్ని ఇస్తుండగా, తదుపరి మ్యాచ్‌లలో ఆయన ధోనీ రికార్డును ఎప్పుడు దాటుతారోనని క్రికెట్ లోకం ఆసక్తిగా ఎదురుచూస్తోంది.



# మరో వివాదంలో భారత స్టార్ రెజ్లర్ వినేష్ ఫోగాట్

**బలగం టీవి, న్యూఢిల్లీ**

భారత స్టార్ రెజ్లర్ వినేష్ ఫోగాట్ మరో వివాదంలో చిక్కుకున్నారు. డోపింగ్ నిరోధక నిబంధనల్లో భాగంగా 'వేర్ ఎబౌట్స్' (అందుబాటులో ఉండే సమాచారం) విఫలమైనందుకు అంతర్జాతీయ టెస్టింగ్ ఏజెన్సీ ఆమెకు నోటీసులు జారీ చేసింది. 2025 డిసెంబర్ 18న ఔట్-ఆఫ్-కాంపిటీషన్ డోపింగ్ పరీక్ష కోసం అధికారులు ప్రయత్నించినప్పుడు వినేష్ ఫోగాట్ అందుబాటులో లేకపోవడాన్ని ఐటీఏ తీవ్రంగా పరిగణించింది. గత 12 నెలల్లో వినేష్ ఫోగాట్ ఇలా నిబంధనలు పాటించకపోవడం ఇదే మొదటిసారి. మే 4, 2026 నాటి అధికారిక సమాచారంలో ఈ విషయాన్ని రికార్డు చేసినట్లు ఏజెన్సీ స్పష్టం చేసింది.నిబంధనల ప్రకారం.. ఎంపిక చేసిన అథ్లెట్లు తాము ఎక్కడ ఉంటామో ముందే సమాచారం అందించాలి. తద్వారా డోపింగ్ నియంత్రణ అధికారులు ఎప్పుడైనా వచ్చి నమూనాలను సేకరిస్తారు. 2025 డిసెంబర్ 18న అధికారులు వినేష్ ఫోగాట్ కోసం వెళ్లగా.. ఆమె నిర్దేశించిన సమయానికి అక్కడ లేదు. ఆ సమయంలో తాను హర్యానా అసెంబ్లీ శీతాకాల సమావేశాలకు హాజరైనట్లు వినేష్ ఫోగాట్ వివరణ ఇచ్చారు. బెంగళూరు నుంచి చండీగఢ్‌కు ప్రయాణించడం వల్ల దినచర్య మారిపోయిందని.. అలాగే ఇటీవల పండంటి బిడ్డకు జన్మనివ్వడం వల్ల వ్యక్తిగత బాధ్యతలు పెరిగాయని ఆమె పేర్కొన్నారు. అయితే, తన ప్రయాణ వివరాలను ముందుగానే అప్‌డేట్ చేయడంలో వినేష్ నిర్లక్ష్యం వహించారని ఐటీఏ తేల్చి చెప్పింది.ప్రస్తుతానికి ఇది యాంటీ డోపింగ్ నిబంధనల ఉల్లంఘన కిందకు రాదు, కేవలం హెచ్చరి మాత్రమే. కానీ, వరల్డ్ యాంటీ డోపింగ్ ఏజెన్సీ నిబంధనల ప్రకారం.. ఒక అథ్లెట్ 12 నెలల కాలంలో మూడు సార్లు ఇలా పరీక్షలకు అందుబాటులో లేకపోయినా లేదా సమాచారం ఇవ్వడంలో విఫలమైనా, దానిని నిబంధనల ఉల్లంఘనగా పరిగణిస్తారు. అటువంటి పరిస్థితిలో సదరు అథ్లెట్‌పై రెండేళ్ల వరకు నిషేధం విధించే అవకాశం ఉంటుంది. వినేష్‌కు ఇది మొదటి విఫల ప్రయత్నం కాబట్టి ప్రస్తుతం ఎలాంటి నిషేధం ఉండదు. 2024 పారిస్ ఒలింపిక్స్‌లో అధిక బరువు కారణంగా అనర్హతకు గురైన తర్వాత వినేష్ రిటైర్మెంట్ ప్రకటించి.. మళ్లీ గతేడాది డిసెంబర్‌లో రీ-ఎంట్రీ ఇస్తున్నట్లు ప్రకటించారు. ప్రస్తుతం ఆమె గోండాలో జరగనున్న నేషనల్ ఓపెన్ ర్యాంకింగ్ టోర్నమెంట్ ద్వారా తిరిగి పోటీల్లోకి దిగాలని భావిస్తున్నారు. ఈ క్రమంలో ఇలాంటి నోటీసులు రావడం ఆమె కెరీర్‌పై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఈ నోటీసుపై అడ్మినిస్ట్రేటివ్ రివ్యూ కోరడానికి ఐటీఏ ఆమెకు ఏడు రోజుల సమయం ఇచ్చింది. ఒకవేళ ఆమె సరైన ఆధారాలు చూపలేకపోతే, ఈ 'మిస్డ్ టెస్ట్' ఆమె రికార్డులో శాశ్వతంగా ఉండిపోతుంది.

# కోలుకుంటున్న నితీష్ కుమార్ రెడ్డి

**బలగం టీవి, న్యూఢిల్లీ**



ఐపీఎల్ 2026 సీజన్‌లో అద్భుత ఫామ్‌లో ఉన్న సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు ఊరటనిచ్చే వచ్చింది. ఆల్‌రౌండర్ నితీష్ కుమార్ రెడ్డి గాయంపై జట్టు హెడ్ కోచ్ డేనియల్ వెట్టోరీ కీలక అప్‌డేట్ ఇచ్చారు. గత మ్యాచ్‌లో అనారోగ్యం కారణంగా కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టుతో ఆడని నితీష్, బుధవారం పంజాబ్ కింగ్స్‌తో జరగనున్న మ్యాచ్‌కు అందుబాటులోకి వచ్చే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని వెట్టోరీ వెల్లడించారు. "ఈ ఉదయం నేను నితీష్‌తో మాట్లాడాను, అతను ఇప్పుడు చాలా మెరుగ్గా ఉన్నాడు. ఈరోజు ప్రాక్టీస్ సెషన్‌లో కూడా పాల్గొంటాడు. రేపటి మ్యాచ్‌లో అతను ఆడతాడనే నమ్ముతున్నాం" అని కోచ్ మీడియాకు వెల్లడించారు. నితీష్ కుమార్ రెడ్డి గైర్హాజరీలో కేకేఆర్‌తో జరిగిన గత మ్యాచ్‌లో సన్‌రైజర్స్ భారీ ఓటమిని చవిచూసింది. నితీష్ స్థానంలో జట్టులోకి వచ్చిన స్మరణ్ రవిచంద్రన్ ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. బ్యాటింగ్, బౌలింగ్‌లో సత్తా చాటుతున్న నితీష్ జట్టులో ఉండటం ఎంతో కీలకమని కోచ్ అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా గత అక్టోబర్‌లో తొడ గాయం, మెడ నొప్పితో బాధపడిన ఈ యువ ఆటగాడు, ఇప్పుడు కోలుకుని జట్టుకు బలాన్ని ఇస్తుండటం విశేషం. ప్రస్తుతం పాయింట్ల పట్టికలో పంజాబ్ కింగ్స్ 13 పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా.. సన్‌రైజర్స్ 12 పాయింట్లతో మూడో స్థానంలో కొనసాగుతోంది. రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియం వేదికగా జరగనున్న ఈ మ్యాచ్ ఇరు జట్లకు ప్లే-ఆఫ్ బెర్త్ ఖరారు చేసుకోవడానికి అత్యంత కీలకం. ప్యాట్ కమిన్స్ సారథ్యంలోని హైదరాబాద్ జట్టు, పంజాబ్‌ను ఓడించి మళ్లీ విజయాల బాట పట్టాలని పట్టుదలగా ఉంది. నితీష్ కుమార్ రెడ్డి తిరిగి రావడం ఆరెంజ్ ఆర్మీకి పెద్ద ప్లస్ పాయింట్ కానుంది.

# 'చెన్నై' గూటికి ముంబై కెప్టెన్..?

**బలగం టీవి, న్యూఢిల్లీ**

చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ ఓటమి పాలైన తర్వాత, మైదానంలో ఒక ఆసక్తికర దృశ్యం కనిపించింది. సీఎస్‌కే సీఈఓ కాశీ విశ్వనాథన్, హార్దిక్ పాండ్యా చాలా సేపు సీరియస్‌గా చర్చించుకున్నారు. ముంబై ఇండియన్స్ ఈ సీజన్ (2026)లో ఆడిన 9 మ్యాచ్‌ల్లో 7 ఓడిపోయి పీకల్లోతు కష్టాల్లో ఉంది. ఇలాంటి సమయంలో ప్రత్యర్థి జట్టు బాస్‌తో హార్దిక్ చర్చలు జరపడం ట్రేడింగ్ రూమర్లకు ఆజ్యం పోసింది. గతంలో సంజూ శామ్సన్ కూడా ఇలాగే కాశీ విశ్వనాథన్‌తో మాట్లాడటం, ఆ తర్వాత ఆయన సీఎస్‌కేలోకి రావడం గమనార్హం. రోహిత్ శర్మను తప్పించి హార్దిక్‌కు కెప్టెన్సీ ఇవ్వడంపై ముంబై అభిమానులు ఇప్పటికే తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. దీనికి తోడు జట్టు వరుస వైఫల్యాలు హార్దిక్‌ను మరింత ఇరకాటంలో పడేశాయి. ప్రముఖ వ్యాఖ్యాత సైమన్ డౌల్ సైతం హార్దిక్‌ను ముంబై వదిలేయడమే మంచిదని అభిప్రాయపడ్డారు. వరుసగా రెండు సీజన్లలో జట్టు విఫలమయ్యాక, కెప్టెన్సీ నుంచి తప్పించి అతడిని జట్టులో ఉంచడం హార్దిక్ ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తుందని డౌల్ పేర్కొన్నారు. ఒకవేళ ఐపీఎల్ 2027 వేలానికి ముందే హార్దిక్ పాండ్యాను సీఎస్‌కే ట్రేడ్ చేసుకోవాలనుకుంటే, కింది మూడు అవకాశాలు ఉండే ఛాన్స్ ఉంది:హార్దిక్, శివమ్ దూబె ఇద్దరూ టీమ్ ఇండియాలో కీలక ఆల్‌రౌండర్లు. అయితే దూబే గత రెండు సీజన్లుగా ఆశించిన స్థాయిలో రాణించడం లేదు. ముంబైకి చెందిన దూబేను ముంబై ఇండియన్స్‌కు ఇచ్చి, హార్దిక్‌ను చెన్నై తీసుకోవచ్చు. అయితే వీరిద్దరి ధరల మధ్య వ్యత్యాసం ఉన్నందున, అదనంగా నాథన్ ఎల్లిస్ వంటి ఆటగాడిని కూడా ముంబైకి ఇచ్చే అవకాశం ఉంది.సీఎస్‌కే కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ మహారాష్ట్రకు చెందిన ఆటగాడు. ముంబై పరిస్థితులపై అతనికి పూర్తి అవగాహన ఉంది. ఒకవేళ నాయకత్వ మార్పు కోరుకుంటే, హార్దిక్ పాండ్యాను కెప్టెన్‌గా తీసుకుని గైక్వాడ్‌ను ముంబైకి పంపే సాహసం సీఎస్‌కే చేయవచ్చు. గుజరాత్ టైటాన్స్ నుంచి ముంబైకి హార్దిక్ వచ్చినట్లుగానే, ఎలాంటి ఆటగాళ్లను మార్చుకోకుండా కేవలం నగదు రూపంలో కూడా ఈ ఒప్పందం జరగవచ్చు. దీనికోసం ముంబై తన భారీ ధర కలిగిన ఆటగాళ్లను వదిలించుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతానికి ఇవన్నీ కేవలం సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాలే. అటు ముంబై ఇండియన్స్ కానీ, ఇటు సీఎస్‌కే కానీ దీనిపై ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు.

# సుకుమార్‌తో రామ్‌చరణ్ తదుపరి చిత్రం



### జూలైలో పట్టాలకెక్కే అవకాశం

కథానాయకుడు రామ్‌చరణ్ 'పెద్ది' సినిమాని ఇప్పటికే పూర్తి చేశారు. ఇది జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. దీంతో ఇప్పుడు అందరి చూపు ఆయన తదుపరి చిత్రంపై పడింది. 'ఆర్‌సీ17' వర్కింగ్ టైటిల్‌తో సెట్స్‌పైకి వెళ్లనున్న ఆ సినిమాకి సుకుమార్ దర్శకత్వం వహించనున్న సంగతి తెలిసిందే. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. ఇప్పటికే ఈ చిత్ర స్క్రిప్ట్ పనులు ఓ కొలిక్కి వచ్చాయని.. సుకుమార్ దీనికి తుది మెరుగులు దిద్దడంలో తలమునకలై ఉన్నారని తెలిసింది. ఈ నేపథ్యంలోనే తాజాగా ఈ సినిమా చిత్రీకరణకు సంబంధించి ఓ ఆసక్తికర కబురు బయటకొచ్చింది. ఈ కొత్త చిత్రాన్ని జులైలో పట్టాలెక్కిం చేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు మైత్రీకి చెందిన నిర్మాతల్లో ఒకరైన చెర్రీ వెల్లడించారు. 'రంగస్థలం' విజయం తర్వాత చరణ్ – సుక్కు కలయికలో రానున్న రెండో చిత్రం కావడంతో ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలేర్పడ్డాయి. దీనికి తగ్గట్లుగానే ఈసారి సుకుమార్ తనదైన శైలిలో మరో శక్తిమంతమైన మాస్ యాక్షన్ కథను సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది.

# ఫౌజీ షూటింగ్ యూనిట్ కారుకు ప్రమాదం




### ప్రమాదంలో ఒకరు మృతి... పలువురికి గాయాలు

ప్రభాస్ హీరోగా తెరకెక్కుతున్న భారీ ప్రాజెక్ట్ 'ఫౌజీ' మూవీ షూటింగ్ కి వెళుతున్న వాహనానికి ప్రమాదం జరగడంతో విషాదం చోటు చేసుకుంది. సినిమా షూటింగ్‌లో భాగంగా ప్రొడక్షన్ యూనిట్ సభ్యులు ప్రయాణిస్తున్న వాహనం ప్రమాదానికి గురవడంతో ఒకరు ప్రాణాలు కోల్పోగా, మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదం హైదరాబాద్ సమీపంలోని అబ్దుల్లాపూర్‌మెట్ ప్రాంతంలో జరిగినట్లు సమాచారం. యూనిట్ సభ్యులు షూటింగ్ కోసం బయలుదేరగా, ఆ కారు అదుపు తప్పి ప్రమాదానికి గురైనట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో గాయపడిన వారిని వెంటనే సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వారి ఆరోగ్య పరిస్థితిపై ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ ప్రమాదంతో 'ఫౌజీ' చిత్ర యూనిట్‌లో తీవ్ర ఆందోళన నెలకొంది. చిత్రబృందం సభ్యులు గాయపడిన వారి ఆరోగ్యంపై ఆరా తీస్తూ, అవసరమైన సహాయం అందించేందుకు ముందుకొస్తున్నారు. ప్రమాదంలో ఒకరి మృతి చెందడం సినిమా యూనిట్‌ను దిగ్భ్రాంతికి గురి చేసింది. ఇక ఈ చిత్రాన్ని 'సీతారామం'తో గుర్తింపు పొందిన దర్శకుడు హను రాఘవపూడి రూపొందిస్తున్నారు. ప్రేమ, దేశభక్తి, యాక్షన్ మేళవింపుతో రూపొందుతున్న ఈ సినిమా ఇప్పటికే భారీ అంచనాలను సొంతం చేసుకుంది.

# విశ్వంభర బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్




హరిగౌరవకు అప్పగించిన చిత్రబృందం

మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న తాజా సోషియో–ఫాంటసీ చిత్రం విశ్వంభరపై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. సంక్రాంతికి 'మన శంకర వరప్రసాద్ గారు' సినిమాతో భారీ విజయాన్ని అందుకున్న చిరంజీవి, ఇప్పుడు మరో భారీ ప్రాజెక్ట్‌తో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. 'బింబిసార'తో సక్సెస్ అందుకున్న దర్శకుడు మల్లిడి వశిష్ఠ తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని యూవీ క్రియేషన్స్ అత్యంత భారీ బ్జడెట్‌తో నిర్మిస్తోంది. పురాణాల నేపథ్యంలో 14 లోకాల కాన్సెప్ట్‌తో రూపొందుతున్న ఈ చిత్రం విజువల్ వండర్‌గా నిలవనుందని చిత్రబృందం చెబుతోంది. లోకాలను కాపాడే రక్షకుడిగా చిరంజీవి వింటేజ్ లుక్‌లో కనిపించనున్నారని సమాచారం. ఈ సినిమాలో చిరంజీవికి జోడీగా త్రిష కృష్ణన్ నటిస్తోంది. దాదాపు దశాబ్దం తర్వాత ఈ కాంబినేషన్ మళ్లీ రిపీట్ అవుతుండటం విశేషం. అలాగే ఆషికా రంగనాథ్, కునాల్ కపూర్ వంటి నటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. జూలై 10న ఈ చిత్రం విడుదలయ్యే అవకాశముందని టాక్ వినిపిస్తోంది. ఇదిలా ఉంటే, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉన్న ఈ సినిమా మ్యూజిక్ డిపార్ట్‌మెంట్‌లో ఆసక్తికర మార్పు చోటుచేసుకుంది. ఇప్పటికే ఈ చిత్రానికి ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి సంగీతం అందిస్తున్న విషయం తెలిసిందే. అయితే తాజా సమాచారం ప్రకారం, నేపథ్య సంగీతం బాధ్యతలను యువ సంగీత దర్శకుడు హరి గౌరకు అప్పగించినట్లు తెలుస్తోంది. పాటల కంపోజిషన్‌ను కీరవాణి చూసుకుంటుండగా, భారీ యాక్షన్ సన్నివేశాలు, ఫాంటసీ ఎలిమెంట్స్‌కు పవర్‌ఫుల్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందించే బాధ్యతను హరి గౌర తీసుకున్నారని సమాచారం. ఇప్పటికే ఆయన తన పనిని ప్రారంభించారని సినీ వర్గాలు చెబుతున్నాయి. హరి గౌర గతంలో చేసిన ప్రాజెక్టులు ఆయన ప్రతిభను నిరూపించాయి. ముఖ్యంగా హనుమాన్ చిత్రానికి అందించిన సంగీతం మంచి ప్రశంసలు అందుకుంది. అలాగే 'మిరాయ్' వంటి సినిమాలకు ఇచ్చిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కూడా ప్రేక్షకులను ఆకట్టుకుంది. మెలోడీస్‌తో పాటు గూస్‌బమ్స్ తెప్పించే బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ ఇవ్వడంలో ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఈ నేపథ్యంలో 'విశ్వంభర'లో హరి గౌర ఎంట్రీ సినిమాకు మరో ప్లస్ పాయింట్‌గా మారనుందని ఇండస్ట్రీ వర్గాలు భావిస్తున్నాయి. భారీ విజువల్స్‌తో వస్తున్న ఈ చిత్రానికి ఆయన ఇచ్చే నేపథ్య సంగీతం ఏ స్థాయిలో ఉంటుందో చూడాలని మెగా అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# ఓటిటిలోకి వచ్చేసిన పాపం ప్రతాప్




టాలీవుడ్ యంగ్ టాలెంటెడ్ నటుడు తిరువీర్ హీరోగా నటించిన లేటెస్ట్ విలేజ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'పాపం ప్రతాప్' ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. ఏప్రిల్ 17న థియేటర్లలో విడుదలై మంచి విజయాన్ని అందుకున్న ఈ చిత్రం సుమారు మూడు వారాల తర్వాత డిజిటల్ స్ట్రీమింగ్‌కు వస్తోంది. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ 'ఈటీవీ విన్' ఈ సినిమా డిజిటల్ హక్కులను సొంతం చేసుకోగా మే 7 నుంచి ఈ సినిమా స్ట్రీమింగ్ కాబోతున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఎస్పీ దుర్గా నరేష్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో తిరువీర్ సరసన పాయల్ రాధాకృష్ణ హీరోయిన్‌గా నటించగా, అజయ్ ఘోష్ కీలక పాత్రలో మెరిశారు. తండ్రి ఇష్టానికి వ్యతిరేకంగా ప్రేమించిన అమ్మాయిని పెళ్లి చేసుకున్న ప్రతాప్ అనే యువకుడికి, పెళ్లయిన మూడు రోజులకే తన భార్య దూరమవ్వడం.. ఆమె తనపై ఒక వింత ఆరోపణ చేయడం అనే ఆసక్తికరమైన పాయింట్‌తో ఈ సినిమా సాగుతుంది. గ్రామీణ నేపథ్యంలో సాగే సహజసిద్ధమైన కామెడీ మరియు భావోద్వేగాల కలయికతో రూపొందిన ఈ చిత్రం డిజిటల్ వేదికగా రాబోతుండడంతో అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# విజయ్ విజయంతో మారిన సీన్






జననాయగన్ విడుదలకు క్లీయర్ కానున్న లైన్

తమిళ స్టార్ హీరో జోసెఫ్ విజయ్ సినీ ప్రయాణంలో అత్యంత కీలకంగా నిలిచిన చిత్రం 'జన నాయగన్' ఇప్పుడు ఇండియన్ సినిమా వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ సినిమాను తన ఆఖరి చిత్రంగా ప్రకటించిన విజయ్, ఇకపై పూర్తిస్థాయిలో రాజకీయాలపై దృష్టి పెట్టనున్న నేపథ్యంలో ఈ ప్రాజెక్ట్‌కు ప్రత్యేకమైన ప్రాధాన్యం ఏర్పడింది. ప్రతిభావంతుడైన దర్శకుడు హెచ్ వినోద్ తెరకెక్కించిన ఈ చిత్రం అసలు ఎన్నికలకు ముందు విడుదల కావాల్సి ఉంది. అయితే పలు కారణాల వల్ల సినిమా విడుదల వాయిదా పడింది. నిర్మాణంలో ఆలస్యం, రాజకీయ పరిస్థితులు, అలాగే అనుకోని అడ్డంకులు 'జన నాయగన్' ప్రయాణాన్ని కష్టతరం చేశాయి. ఇంతేకాకుండా, ఈ చిత్రానికి సంబంధించిన ఓటిటి డీల్ కూడా మధ్యలో నిలిచిపోయినట్లు ప్రచారం జరిగింది. అదే సమయంలో సినిమాపై ఉన్న హైప్ కూడా కొంత వరకు తగ్గిందనే అభిప్రాయాలు వినిపించాయి. ఈ పరిణామాలన్నీ కలిసి సినిమా ప్రభావం తగ్గిపోయిందనే సందేహాలు వ్యక్తమయ్యాయి. అయితే తాజా రాజకీయ పరిణామాలు 'జన నాయగన్'కు పూర్తిగా కొత్త ఉత్సాహాన్ని తీసుకొచ్చాయి. తమిళనాడులో జరిగిన ఎన్నికల్లో విజయ్ నేతృత్వంలోని పార్టీ ఘనవిజయం సాధించడంతో ఆయన అభిమానుల్లో అపారమైన ఉత్సాహం కనిపిస్తోంది. ఒక హీరోగా మాత్రమే కాకుండా, నాయకుడిగా కూడా విజయ్‌పై ఉన్న విశ్వాసం ఇప్పుడు మరింత బలపడింది. ఇప్పటికే గతంలో 'గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైం' వంటి భారీ ప్రాజెక్ట్‌తో విజయ్ తన బాక్సాఫీస్ స్టామినాను నిరూపించారు. భారీ బడ్జెట్, భారీ అంచనాల మధ్య వచ్చిన ఆ సినిమా కూడా అనుమానాలను చెరిపేసి మంచి వసూళ్లు సాధించింది. ఇప్పుడు అదే స్థాయిలో, అంతకంటే ఎక్కువగా 'జన నాయగన్'పై అంచనాలు నెలకొన్నాయి. ముఖ్యంగా, ఒక నటుడు ముఖ్యమంత్రిగా మారిన తర్వాత విడుదలవుతున్న అతని ఆఖరి సినిమా కావడం ఈ చిత్రానికి అదనపు క్రేజ్ తీసుకొచ్చింది. అభిమానులు ఈ సినిమాను కేవలం సినిమాగా కాకుండా, ఒక భావోద్వేగంగా చూస్తున్నారు. తమ హీరో రాజకీయాల్లో విజయం సాధించిన ఆనందంలో, ఈ సినిమాకు అపారమైన ఓపెనింగ్స్ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారు. బాక్సాఫీస్ ట్రేడ్ వర్గాల అంచనాల ప్రకారం, 'జన నాయగన్' ఓపెనింగ్స్ కోలీవుడ్‌లోనే కాకుండా దేశవ్యాప్తంగా రికార్డులు బద్దలు కొట్టే అవకాశముంది. మొదటి రోజు వసూళ్లు ఊహించలేనంత స్థాయిలో ఉండొచ్చని విశ్లేషకులు చెబుతున్నారు. ఒకవేళ సినిమాకు పాజిటివ్ టాక్ వస్తే, వసూళ్లు ఎక్కడ ఆగుతాయో అంచనా వేయడం కూడా కష్టమవుతుంది.





